ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
గుంటూరు
fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
11-5-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 99 పేజీలు: 12 వెల: 8.00

భారత్‌దాడుల్లో మృతి చెందిన ఉగ్రవాదులు వీరే..
పాక్ కాల్పుల్లో మరో జవాన్ వీరమరణం 9లో



శనివారం రాజ్‌భవన్‌లో జరిగిన ఇంటర్ ఫెయిత్ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో గవర్నర్ నజీర్, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

# అందరి నినాదం 'నేషన్ ఫస్ట్' కావాలి

### భారత్,పాక్ మధ్య కాల్పుల విరమణ శుభపరిణామం: గవర్నర్ నజీర్

### ప్రధాని ఏ నిర్ణయం తీసుకొన్నా మద్దతిస్తాం: సిఎం చంద్రబాబు

### రాజ్‌భవన్‌లో జరిగిన 'ఇంటర్ ఫెయిత్' కార్యక్రమంలో పాల్గొన్న సిఎం, డిసిఎం

**అమరావతి, మే 10 ,ప్రభాతవార్తప్రతినిధి:** జాతీయ వాదమే భారతీయుల సంఘటితకు నిదర్శనం అని ఏపీ గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ అన్నారు.మన జాతి పరిరక్షణనే మన కింకర్తవ్యం అనే దృడ సంకల్పంతో ప్రతి భారతీయుడిలో ఉండటమే శత్రు దేశాలకు భయాన్ని కలిగిస్తోందన్నారు.భారత్ పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో రాజ్ భవన్‌లో శనివారం గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్ ఫెయిత్ కార్యక్రమం జరిగింది.అంతర్గత సమస్యలను రెచ్చగొట్టి లబ్దిపొందాలనే వారికి భారత దేశ ప్రజలంతా సంఘటితంగా ఉండటం కనువిప్పు అన్నారు.పాక్,భారత్ నడుమ యుద్ధ వాతావరణ నెలకున్నప్పుడు జాతి యావత్తు ప్రధానికి అండగా నిలవడం మన సంస్కృతికి చిహ్నం అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ మనం ఏ పరిస్థితుల్లో ఉన్నా నేషన్ ఫస్ట్ నినాదంతో దేశాన్ని కాపాడుకోవాల్సి ఉందన్నారు. ఏ సమస్య వచ్చినా భారతదేశంలో ఉండే ప్రతి ఒక్కరూ సంఘటితంగా ఉండాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ప్రపంచశాంతిని ఉగ్రవాదం పట్టి పీడిస్తోందని, తీవ్రవాదం, ఉగ్రవాదం దేశంలో అనిశ్చిత పరిస్థితులకు, ఆర్థిక ఇబ్బందులకు కారణం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పహల్గాంలో మారణకాండ సృష్టించారుపహల్గాంలో ఉగ్రవాదులు మారణకాండ సృష్టించారు. ఉగ్రవాదుల కాల్పుల్లో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఇది పర్యాటకులపై జరిగిన దాడి కాదు దేశ శాంతి సుస్థిరతను దెబ్బతీసే అంశం. మనందరం కులమతాలకు అతీతంగా ముక్తకంఠంతో ఉగ్రదాడిని ఖండించాం. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యుల బాధను ఎవరూ తీర్చలేరు. ఉగ్రవాదుల కాల్పుల్లో మన రాష్ట్రానికి చెందిన ఇద్దరు పర్యాటకులు చనిపోయారు. మనదేశం ఉగ్రవాదంపై పోరాడు >>2



## ఒప్పందాన్ని ఉల్లంఘించిన పాక్

### సరిహద్దు పొడవునా కాల్పులు జరిపింది

### విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ

**న్యూఢిల్లీ, మే 10:** అగ్రరాజ్యం అమెరికా జోక్యంతో కాల్పుల విరమణకు అంగీకరించినా పాకిస్థాన్ మాత్రం సరిహద్దు పొడవునా కాల్పుల విరమణను ఉల్లంఘించిందని విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ప్రకటించారు. రాత్రిపొద్దుపోయాకా మీడియాతో మాట్లాడిన మిస్రీ సరిహద్దుపొడవునా నాలుగురాష్ట్రాల్లోను >>2


# ఇటు విరమణ.. అటు కాల్పులు

### భారత్, పాక్ కాల్పుల విరమణ ప్రకటించిన కొద్దిసేపటికే మళ్లీ కాల్పులు జరిపిన దాయాది

### తన మధ్యవర్తిత్వంతో సయోధ్య సాధ్యమైందన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్

### 12న మళ్లీ చర్చలు జరిగే అవకాశం

**న్యూఢిల్లీ, మే 10:** అగ్రరాజ్యం జోక్యంతో పాకిస్తాన్ దారికి వచ్చింది. సరిహద్దు గ్రామాలు, సైనిక స్థావరాలు టార్గెట్‌గా దాడులు చేయబోయి బొక్కబోర్లాపడిన పొరుగుదేశం పాకిస్థాన్ ఎట్టకేలకు దిగివచ్చింది. గల్ఫ్‌దేశాలు, మిత్రదేశాలతో సంప్రదింపులు జరిపినా కూడా భారత్ ఎక్కడా తగ్గకపోవడం, పహల్గాం మూల్యం చెల్లించుకోవాల్సిందేనని స్పష్టంచేయడంతోపాటు ఆస్థాయిలోనే పాక్ దాడులకు ప్రతి దాడులుచేసింది. పహల్గాం ఘాతుకం తర్వాత వరుసవెంబడి పక్షంరోజులపాటు సరిహద్దుల్లో కాల్పులు జరుపుతూనే రావడంతో సహనం నశించిన భారత్ ఒక్కసారిగా ఆపరేషన్ సిందూర్‌తో భారత్ శక్తిసామర్థ్యాలను చాటిచెప్పింది.దీనితో తోకముడిచిన పాకిస్తాన్ గత్యంతరంలేక కాల్పుల విరమణకు అంగీకరించింది. కాల్పుల విరమణకు అంగీకారం జరిగిందని చెపుతూనే సరిహద్దుల్లో మళ్లీడ్రోన్లతో దాడులకు దిగడం పాక్ వక్రబుద్ధిని స్పష్టంచేస్తోంది. పాక్ కుట్రలను గమనించే భారత్ అప్రమత్తంగా ఉంది. కేవలం ఉగ్రస్థావరాలే లక్ష్యంగా తొమ్మిది కేంద్రాల్లో భారత్ జరిపిన దాడులతో 100మందికిపైగా మృతిచెందడం, పాక్ ఆయుధాగారం, వైమానికస్థావరాలే టార్గెట్‌గా భారత్‌కూడా శక్తివంతమైన దాడులకు దిగడంతో దాయాదికి నిలువెల్లా వణుకు బయలుదేరి అగ్రరాజ్యం అమెరికాను ఆశ్రయించింది. రెం డుదేశాల వివాదంలో జోక్యం చేసుకోబోమని చెప్పిన అమెరికా చివరి >>2



## సయోధ్య కుదిర్చిన 'పెద్దన్న'

### రెండు దేశాలకు అభినందనలు తెలిపిన ట్రంప్

**న్యూఢిల్లీ:** ఆపరేషన్ సింధూర్‌పై పాక్ ఉగ్ర స్థావరాలను భారత్ నేలమట్టం చేపట్టినప్పటి నుంచి నాలుగు రోజులుగా భారత్ పాక్ మధ్య తారాస్థాయికి చేరిన ఉద్రిక్తతలకు శనివారం సాయంత్రం 5 గంటలకు తెరపడింది. మధ్యాహ్నం 3.35 గంటలకు పాక్ డీజీఎంవో నుంచి భారత్ జీజీఎంఓకు ఫోన్ రావడం, కాల్పుల విరమణపై ఇరుదేశాల డీజీఎంఓల మధ్య జరగడం, చర్చల అనంతరం అనంతరం కాల్పుల విరమణకు ఇరుదేశాలు అంగీకరించడం చకచగా జరిగాయి. సాయంత్రం 5 గంటల నుంచి కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది. ఈ మేరకు ఇరుదేశాల విదేశాంగ శాఖ ప్రతినిధులు వేర్వేరు ప్రక టనల్లో కాల్పుల విరమణను >>2

### రాజధానిలో బిట్స్‌కు

# 70 ఎకరాలు

### భూకేటాయింపులపై ప్రభుత్వ ఉత్తర్వులు

**విజయవాడ,మే 10,ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలో బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్) క్యాంపస్ ఏర్పాటుకు ఎకరం రూ.50 లక్షల చొప్పున 70 ఎకరాలు కేటా యిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. >>2

### అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో

# జనఔషధి షాపులు

### ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా నిర్వహణ: మంత్రి సత్యకుమార్ యాదవ్



**విజయవాడ,మే10,ప్రభాతవార్తప్రతినిధి:** పెద్ద సంఖ్యలో ప్రభుత్వ ఆసుపత్రులకొచ్చే రోగుల ప్రయోజనార్థం నాణ్యమైన జనరిక్ మందులను అతి తక్కువ ధరలకే అందించడానికి అన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో జన ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో జనరిక్ మందుల ఏర్పాటుపై అధికారులతో మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన అధికారిక నివేదికలను అనుసరించి మాట్లాడుతూ ప్రస్తుతం జనరిక్ మెడికల్ షాపుల నిర్వాహకులు కొన్ని సందర్భాల్లో 50నుండి 600 శాతం మేరకు లాభాలతో ఈ మందుల్ని విక్రయిస్తున్నారు. ప్రస్తుతం 16 జిజిహెచ్ లలో 23 ప్రైవేట్ జనరిక్ మెడిసిన్ స్టోర్లు ఉన్నాయి. నంద్యాల జిజిహెచ్ లో మాత్రం ఇలాంటి స్టోర్ లేదు. ప్రభుత్వాసుపత్రుల్లో జనరిక్ మందుల షాపుల్ని నిర్వహించడానికి లాభాపేక్షలేని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతిపాదనకు మంత్రి ఆమోదం తెలిపారుప్రస్తుత వ్యవస్థలో లోపాలుజనరిక్ మందుల తయారీ మరియు వాటి ధరలను నిర్ణయించడంలోని లోపాల్ని ఉపయోగించుకుని ప్రస్తుతం అమ్మకందారులు భారీ లాభాలతో రోగులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం 16 జిజిహెచ్ లలో పనిచేస్తున్న జనరిక్ మెడిసిన్ రిటైలర్లు జనరిక్ ఔషధాల తయారీ, ధరల నిర్ణాయక విధానంలోని లొసుగులను ఉపయోగించుకుంటూ రోగులను దోపిడీ చేస్తున్నారు. దీనికి తోడు ఈ వ్యవస్థపై తగిన నియంత్రణ లేకపోవటం వారికి అనుకూలంగా మారింది. జనరిక్ ఔషధాల తయారీదారులు తమ ఉత్పత్తులపై అధిక ఎంఆర్ పి (గరిష్ట రిటైల్ ధర)ని ముద్రించి సరఫరా చేయడాన్ని అమ్మకందారులు స్వంత ప్రయోజనాలకు వాడుకుంటున్నారు. దీంతో రిటైలర్లు వివిధ మందులపై వివిధ ప్రదేశాలలో తమ ఇష్టానుసారం డిస్కౌంట్లను అందిస్తున్నారు. ఈ ప్రక్రియలో వారు 50 నుండి 600 వరకు భారీ లాభాలను ఆర్జిస్తున్నారు. అంతేకాక వారు అవసరమైన జనరిక్ ఔషధాలలో కేవలం 30 నుండి 40 వర కు మాత్రమే అందుబాటులో ఉంచుతున్నారు. అధిక లాభార్జనను నిరోధించడంతో పాటు ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల అమ్మకాలను నిరోధించే తప్పనిసరి బిల్లింగ్ వ్యవస్థ అమలులో లేదు. >>2

# ధర్మ యుద్ధంలో గెలిచాం

### దేశ సైన్యానికి సెల్యూట్ చేయడం మన బాధ్యత: డి.సిఎం పవన్

**విజయవాడ,మే10,ప్రభాతవార్తప్రతినిధి:** ధర్మ యుద్ధంలో మనం గెలిచామని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. భారత్,పాక్ కాల్పుల విరమణ అనంతరం ఆయన శనివారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేసారు. ఉగ్రవాదానికి పుట్టిల్లుగా ఉన్న పాకిస్థాన్ కి బలమైన ఎప్పటికీ మరచిపోలేని పాఠం నేర్పింది ఆపరేషన్ సిందూర్. భారత దేశ శక్తిసామర్థ్యాలను చాటి చెప్పగలిగాము. అసమాన పోరాటం చేసిన మన సైన్యానికి సెల్యూట్ చేసి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు చెప్పడం మనందరి బాధ్యత. దేశానికి బలమైన నాయకత్వం ఉంటే ప్రజలకు ఎంతటి మనోధైర్యం కలుగుతుందో, అందరం ఏకతాటిపై ఎలా నిలుస్తామో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరోమారు నిరూపించారు. పహల్గాంలో పర్యటకులను ఊచకోత కోసిన ఉగ్రవాదులు పాకిస్థాన్ దేశ ప్రాయోజితమే. ఆ దేశ ప్రభుత్వం పెంచి పోషించి మనపైకి పంపిస్తోందని ఆపరేషన్ సిందూర్ తో ప్రపంచానికి ఇంకోసారి బలంగా చెప్పగలిగాము. ఇకపై ఉగ్రవాద దాడిని యుద్ధంగానే పరిగణిస్తామని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నాము. ఆయన తొలి నుంచి దూరదృష్టితో పరిపాలన సాగిస్తూ, దృఢమైన నిర్ణయాలు తీసుకొంటూ వచ్చారు. తన బృందాన్ని కూడా అదే పంథాలో నడిపించారు. దివంగత మనోహర్ పారికర్ గారు రక్షణ శాఖ మంత్రిగా ఉన్న సందర్భంలో ఎస్400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్, రాఫెల్ యుద్ధ విమానాలను సమకూర్చారు. ఆ రోజు శ్రీ మోదీ గారు నిర్దేశకత్వంలో.. దివంగత పారికర్ గారి ఆధ్వర్యంలో రక్షణ శాఖ సమకూర్చుకున్న సంపత్తి ఈ రోజు ఆపరేషన్ సిందూర్ లో సుదర్శన చక్రాల్లా ఉపయోగపడ్డాయి. మన సైన్యం ఎల్లవేళలా అప్రమత్తతతో ఉంటుంది. సరిహద్దుల్లో పహరా కాస్తూ మనల్ని రక్షిస్తుంది. ప్రతి పౌరుడు ఒకటి గుర్తుంచుకోవాలి. యుద్ధం ముగిసిపోయింది అనుకోవద్దు. మనం నిత్య అప్రమత్తతతో ఉండాలి. అంతర్గత భద్రత పట్ల జాగురూకతతో వ్యవహరిస్తూ ఏ దశలోనూ అశాంతికి తావిచ్చే ఘటనలు చోటు చేసుకోకుండా చూడాలి. దేశ సమగ్రత విషయంలో ప్రతి ఒక్కరం ఏకతాటిపై నిలవాలి. జనసేన నాయకులు, శ్రేణులు ముందు అనుకున్న విధంగానే షష్ఠ షణ్ముఖ క్షేత్రాలు, కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్ లోని అన్ని పుణ్య క్షేత్రాల్లో జనసేన శ్రేణులు మంగళవారం పూజాదికాలు నిర్వహిస్తాయి. ఆపరేషన్ సిందూర్ లో మన సైన్యం సాధించిన విజయానికిగాను భగవంతుడికి మొక్కులు చెల్లించుకుంటారు.



శనివారం నెల్లూరు భగత్‌సింగ్ కాలనీలో ప్లాటెడ్ ప్యాక్టరీ షెడ్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి నారాయణ

# పారిశ్రామికాభివృద్ధే లక్ష్యం

### పురపాలక మంత్రి నారాయణ

**నెల్లూరు, మే 10, ప్రభాతవార్త-వైద్యం:** రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం వేగంగా చర్యలు చేపడుతోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. పరిశ్రమలు స్థాపించే వారికి అన్ని రకాల వసతులు కల్పిస్తామన్నారు. స్థలం సమస్య తలెత్తకుండా ఒకే కాంప్లెక్స్‌లో క్లస్టర్‌లు, యూనిట్లు నెలకొల్పేందుకు ప్లాటెడ్ ఫ్యాక్టరీ షెడ్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. నెల్లూరు భగత్‌సింగ్ కాలనీలో 12 కోట్లతో ప్రయోగాత్మకంగా నిర్మించనున్న ఎంఎస్‌ఎంఈ ప్లాటెడ్ ప్యాక్టరీ షెడ్‌కు శనివారం సాయంత్రం మంత్రి నారా యణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ప్రాంతంలోనే 1400 కుటుంబాలకు శాశ్వత ఇంటి పట్టాలకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. రాష్ట్రంలో 20లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. ప్రతి ఇంటి నుంచి ఒక వ్యాపారవేత్తను తయారు చేయాలన్నది సీఎం సంకల్పమని చెప్పారు. అన్ని నియోజకవర్గాల్లో పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశించారని, రాష్ట్రంలోనే మొదటి సారిగా నెల్లూరు సిటీలో ప్లాటెడ్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి షెడ్‌లతో పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పరిశ్రమల నెలకొల్పాలంటే ఎక్కువ స్థలం, ఫ్యాక్టరీకి అవసరమైన నీరు, విద్యుత్, ఇలా ఎన్నో రకాల >>2

# నెలాఖరుకు 'అన్నదాత సుఖీభవ'

### ఖరీఫ్ నాటికి రైతు ఖాతాల్లోకి నిధులు: సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే10,ప్రభాతవార్తప్రతినిధి:** అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు అన్ని సన్నాహకాలు ప్రారంభించినట్లు ఏపీ నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు.రైతాంగ ప్రయోజనాంశాలపై తమ ప్రభుత్వం స్థిరమైన ప్రణాళికతో వ్యవహరిస్తుందన్నారు.ఈ ఖరీఫ్ సీజన్(ఈ మాసాంతానికి) ఆరంభం నాటికి అన్నదాత సుఖీభవ నిధులు రైతుల ఖాతాల్లో జమవుతాయన్నారు."ఎక్స్ 'వేదిక చంద్రబాబు ఈ విషయాన్ని స్పష్టం చేసారు.ఇప్పటికే అధికార యంత్రాంగం ఈ దిశలో కార్యచరణ చేపట్టింది. లబ్దిదారు రైతుకు కచ్చితంగా నిధులు అందే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు.అన్నదాత సుఖీభవ పథకాన్ని వెబ్‌ల్యాండ్‌కు అనుసంధానం చేశారు. అందులో మరణించినవారు, ఉద్యోగులు, ప్రభుత్వ పెన్షన్ పొందేవారు, ఆదాయపు పన్ను చెల్లించేవారి వివరాలన్నీ వెబ్‌ల్యాండ్‌కు అనుసంధానం చేసి తొలగించాలని వ్యవసాయ, రెవెన్యూ శాఖకు ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. వెబ్‌ల్యాండ్ డేటాను వారి లాగిన్లకు: రైతు సేవా కేంద్రాల(ఆర్‌ఎస్‌కే) వారీగా వెబ్‌ల్యాండ్ డేటాను వీఏఏలు, వీఎస్ఏలు, వీహెచ్ఏలతో పాటు ఏవోల లాగిన్లకు ఇచ్చారు. వెబ్‌ల్యాం డ్‌లో సర్వే నంబర్లు, రైతు పేరు, విస్తీర్ణం కచ్చితంగా ఉన్నాయా లేదా అన్నది రైతు సేవా కేంద్రాల సహాయకులు పరిశీలించి కచ్చిత వివరాలను మండల వ్యవసాయాధికారులకు వారు జిల్లా వ్యవసాయాధికారికి నివేదించాలి.

తప్పులుంటే సరిచేయడం, లేనిపక్షంలో తహసీల్దార్ల దృష్టికి తీసుకెళ్లి తప్పులు సరిచేసి ఇంటర్నెట్ లో పొందుపరచాలి. క్షేత్ర స్థాయిలో పరిశీలనలో అనర్హులను ఏరివేయాలి. అర్హులకు పథకాన్ని తప్పనిసరిగా వర్తింపజేయాలి. రైతు సేవా కేంద్రాల సహాయకులు ఈ నెల 20వ తేదీలోగా తప్పులు సరిచేసి ఇంటర్నెట్ లో నమోదు చేయాలని వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావును ఆదేశించినట్లు తెలిపారు అన్నదాత సుఖీభవ పథకం అమలులో భాగంగా గతంలో రైతు భరోసా పథకం కింద ఉన్న గణాంకాల వెబ్‌ల్యాండ్ డేటా సరిచేసిన తర్వాత ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనర్హులు ఉంటే తొలగిస్తామని అర్హులందరికీ అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేస్తారని తెలిపారు. రైతుల విషయంలో ప్రభుత్వం ఏ మాత్రం నిర్లక్ష్యం చేయదని సీఎం చంద్రబాబు అన్నారు.జిల్లాల్లో అకాల వర్షాలు, ప్రస్తుత పరిస్థితులను గురించి సీఎంకు కలెక్టర్లు వివరించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు ఇంకా వర్ష సూచన ఉన్నందున కలెక్టర్లు, అధికారులు ప్రజలను అప్రమత్తం చేసామన్నారు.ఎక్కడా ప్రాణనష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకునే దిశలో జిల్లా ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. విపత్తుల సమయాల్లో అధికారులు మానవత్వంతో వ్యవహరించాలని సూచించారు. పిడుగుల పడే సమయాల్లో ప్రజల సెల్ ఫోన్‌లకు సందేశం వెళ్లని సమయంలో దగ్గరగా ఉన్నట్లైతే నేరుగా వెళ్లి అప్రమత్తం చేయాలని సూచించారు. దీనికి అనుగుణంగా సచివాలయాల్లోని సిబ్బందిని సిద్ధం చేయాలన్నారు.

పిడుగులు పడి చనిపోయిన పశువులకు కూడా నిబంధనల మేరకు పరిహారం వెంటనే విడుదల చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.జిల్లాల్లో పరిస్థితులను బట్టి కిందిస్థాయి అధికారులతో కలెక్టర్లు సమన్వయం చేసుకోవాలని సూచించారు. అకాల వర్షాలతో రాష్ట్రంలో 2,224 హెక్టార్లలో వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. ఈ మేరకు ప్రాథమిక అంచనాల నివేదికను సీఎం చంద్రబాబుకు అందజేశారు. ప్రధానంగా పశ్చిమ గోదావరి, నంద్యాల, కాకినాడ, సత్యసాయి జిల్లాల్లో ఈ పంటలకు నష్టం వాటిల్లిందని అన్నారు. అత్యధికంగా పశ్చిమ గోదావరి జిల్లాలోని 15మం డలాల్లో 1,033హెక్టార్లలో >>2

## రక్షణ, భద్రతా దళాల కదలికలను ప్రత్యక్ష ప్రసారం చేయొద్దు 2లో

# ముందస్తు వర్షాకాలం!

**విజయవాడ,మే10,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో వర్షాకాలం ముందే రానున్నదని భారతీయ వాతావరణ శాఖ వెల్లడించింది. మే 27వ తేదీన నైరుతీ రుతుపవనాలు కేరళను తాకనున్నట్లు ఒకవేళ అధికారులు అంచనా వేసినట్లు ముందుగానే రుతుపవనాలు కేరళను చేరితే, అప్పుడు 2009 తర్వాత ఈ ఏడాది తొలిసారి వర్షాకాలం ముందుగా వచ్చినట్లవుతుందని ఐఎండి వెల్లడించింది. 2009 సంవత్సరంలో మే 23వ తేదీన నైరుతీ కేరళను తాకినట్లు >>2

## పిఎస్ఆర్‌కు బెయిలు తిరస్కృతి

### జత్వానీ కేసు

**విజయవాడ,మే 10,ప్రభాతవార్త ప్రతినిధి:** బాలీ వుడ్ నటి కాదంబరీ జెత్వానీని వేధింపులకు గురి చేసిన కేసులో ఐపీఎస్ అధికారి,నాటి నిఘా విభాగాధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులుకు చుక్కెదురైంది.ఆయన దాఖలు చేసిన బెయిలు పిటీషన్‌ను విజయవాడ మహిళా సెషన్స్ కోర్టు తోసిపుచ్చింది. ఈ పిటీషన్‌పై ఇటీవల వాదనలు ముగిసాయి.ఈ మేరకు న్యాయాధికారి రాజేశ్వరి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసారు. ఈ కేసులో పీఎస్ఆర్‌ను >>2

11-5pg2exHMNWJQE.qxd:11-5pg2exHMNWJQE.qxd 11/05/25 12:17 AM Page 1





ఇంటర్ ఫెయిత్ కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత,ప్రభుత్వ సీఎస్ విజయానంద్,డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా,ఇతర ఉన్నతాధికారులు వివిధ మతాల పెద్దలు

# అందరి నినాదం 'నేషన్ ఫస్ట్' కావాలి

>>తోంది. పహల్గాం కాల్పుల తర్వాత సరిహద్దుల్లో ఐదారు రోజులుగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పాడ్డాయి. ఈ సమయంలో మన త్రివిధ దళాలు వీరోచితంగా పోరాడాయి. ఈ పోరాటంలో కొందరు సైనికులు, పౌరులు ప్రాణాలు కోల్పోయారు. యుద్ధంలో మన రాష్ట్రానికి చెందిన వీర సైనికుడు మురళీ నాయక్ ప్రాణాలు వదిలారు. 25 ఏళ్ల వయసులో దేశ రక్షణ కోసం ప్రాణాలు వదిలారు. తన దేహంపై జాతీయ జెండా కప్పుకుని చనిపోతానని చెప్పి వీరోచితంగా పాకిస్తాన్‌తో పోరాడి మురళీనాయక్ చనిపోయారు. ప్రజల్ని బాధపెట్టే ఉగ్రవాదాన్ని ఉపేక్షించంఇతర దేశాలను దెబ్బతీసే ఆలోచన భారతదేశం చేయదు. మనదేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటూనే ఎవరైనా మనమీదకు వస్తే గట్టిగా సమాధానమిస్తాం. ప్రజల్ని బాధపెట్టే తీవ్రవాదం, ఉగ్రవాదాన్ని ఎప్పటికీ ఉపేక్షించం. దేశంలోని ప్రతి కులం, ప్రాంతం, మతం దేశంకోసం పని చేస్తామని చెప్పాయి. ప్రజాస్వామ్యంలో విభేధాలు ఉండొచ్చు, అభిప్రాయలు, సిద్ధాంతాలను ఏకీభవించకపోవచ్చు. కానీ రాష్ట్ర, దేశ భవిష్యత్ కోసం ఎప్పుడూ వెనకడుగు వేసిన సందర్భాలు లేవు. మత విద్వేషాలు లేని రాష్ట్రం ఏపీ. అందుకే ఇక్కడ అన్ని మతాల ప్రతినిధులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసుకున్నాం. దేశ రక్షణలో ప్రాణాలు పోగొట్టుకున్న సైనికుల త్యాగాన్ని మనం గుర్తు చేసుకుని సంఘీభావంగా ఉండాలి. భారతదేశం చేసే పోరాటానికి సంఘీభావాన్ని తెలియజేయాలి. సరిహద్దు రాష్ట్రాల్లోని ప్రజలు ఐదారు రోజుల బాంబుల మోతతో ఇబ్బందులు పడ్డారు. చదువుకునే విద్యార్థులు స్వరాష్ట్రాలకు తిరిగొచ్చారు. హోంమంత్రి వంగలపూడి అనిత,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్,డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా,ఇతర ఉన్నతాధికారులు వివిధ మతాల పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటర్‌ఫెత్ కార్యక్రమానికి ముందు ఏపీ గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్.సీఎం చంద్రబాబు, డీ.సీఎంపవన్‌కల్యాణ్‌లు మర్యాదపూర్వకంగా పలు అంశాలపై ముచ్చటించారు. **కాల్పుల విరమణ శుభపరిణామం:** కాల్పుల విరమణ శుభపరిణామమని ఈ సమావేశంలో సీఎం చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు భారత్‌పాక్ దేశాల ఆర్మీ చీఫ్‌లు మాట్లాడుకుని కాల్పుల విరమణ చేయాలని నిర్ణయించారు. ఈ పిలుపు కూడా ముందు పాకిస్తాన్ నుంచి రావడంతోనే భారత్ అంగీకరించింది. మన దేశానికి యుద్ధం చేయాలనే ఆలోచన లేదు. కానీ ఉగ్రవాదం, తీవ్రవాదంపై రాజీలేని పోరాటం చేస్తామని కేంద్రం తెలిపింది. రెండు దేశాల ప్రతినిధులు 12వ తేదీన సమీక్ష చేసుకుంటామని ప్రకటించాయి. యుద్ధంలో నష్టపోయిన వారందరికీ సంతాపం తెలుపుతూ తీర్మానం చేద్దాం. దేశ సమగ్రతకు ప్రధాని, కేంద్రం ఏ నిర్ణయం తీసుకున్నా తెలుగుజాతి, ఏపీప్రజలు అండగా ఉంటామని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాదుతూ దేశం ముఖ్యమనే కీలక లక్ష్యంతో ఆపరేషన్ సింధూరకు అండగా నిలవడం అభినందనీయమన్నారు.

# అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో జనఔషధి షాపులు

>> అటు వంటి జనరిక్ ఔషధాల నాణ్యత విషయంలో నియంత్రణ లేకపోవటం కూడా ఆందోళన కలిగించే మరో అంశం.ప్రస్తుతం ఉన్న 23 జనరిక్ దుకాణాలను స్వయం సహాయక బృందాలు మరియు ఇతర సం ఘాలకు కేటాయించినప్పటికీ, ప్రైవేట్ వ్యక్తులు వాటిని భారీ లాభాలతో నడుపుతున్నట్లు తెలుస్తోంది. ఎంతో ప్రజోపయోగమైన జన ఔషధి కేంద్రాల్ని దేశ వ్యాప్తంగా నెలకొల్పాలని ప్రధాని నరేంద్ర మోడీ సూచించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. **వీర జవాను మురళీ నాయక్ అంత్య క్రియలకు హాజరుకానున్న ఆరోగ్య మంత్రి:** దేశ రక్షణ కోసం పాకిస్తాన్ సేనలతో పోరాడుతూ అసువులు బాసిన వీర సైనికుడు మురళీ నాయక్ కు వైద్య,ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ నివాళులు అర్పించారు. మురళీనాయక్ మృతి పట్ల మంత్రి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులతో మంత్రి ఫోన్‌లో మాట్లాడి సానుభూతిని తెలియజేసి వీర సైనికుని కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.మురళీనాయక్ అంత్యక్రియలకు మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరవుతారు.



వీర సైనికునికి నివాళులు అర్పిస్తున్న మహారాష్ట్ర మంత్రి ఉదయ్ సమత్

# మురళి నాయక్ కుటుంబానికి మహారాష్ట్ర ప్రభుత్వం అండ

## మురళి కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించిన మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే

**గోరంట్ల, మే 10 ప్రభాతవార్త :** వీరజవాన్ మురళి నాయక్ మహారాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మహారాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి ఉదయ్ సమత్ పేర్కొన్నారు. శనివారం గోరంట్ల మండలంలోని కల్లి తండాలోని దేశంకోసం ప్రాణాలర్పిచ్చిన వీర జవాన్ అగ్నివీర్ మురళి నాయక్ ఇంటిని సందర్శించి మురళి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు.ఈ సందర్భంగా మురళి నాయక్ తల్లి తండ్రి శ్రీరామ్ నాయక్, జ్యోతి బాయి లనుపరామర్శించి ఓదార్చారు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏకనాథ్ సిందే చరవాణి ద్వారా మురళినాయక్ తల్లీ తండ్రి పరామర్శించి,మీ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మహారాష్ట్ర ప్రభుత్వం వారి కుటుంబానికి అండగా ఉంటుందని తెలిపారు, మహారాష్ట్రలో వారు నివసించిన ప్రదేశంలో విగ్రహం ఏర్పాటు చేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు, మహారాష్ట్ర కు వలస వచ్చి వీర జవాన్ మురళి మురళి నాయక్ కుటుంబం నివాసం నివాసం ఉన్నదని తెలిపారు. వారి ఆత్మ శాంతి కలగాలని ప్రార్థించారు. మహారాష్ట్ర పట్టణంలో మంచి కూడలిలో వారి పేరు పైన కాంప్లెక్స్ పేరు పెట్టడం జరుగుతుందని తెలిపారు.

# ముందస్తు వర్షాకాలం!

>> ఐఎండీ డేటా తెలుపుతుంది. సాధారణంగా జూన్ ఒకటో తేదీ సమయానికి కేరళలోకి నైరుతీ రుతుపవనాలు ప్రవేశిస్తాయి. ఈ రుతుపవనాల వల్లే దేశంలో వర్షాకాలం ప్రారంభం అవుతుంది. ఆ తర్వాత జూలై 8వ తేదీలోగా దేశవ్యాప్తంగా ఆ రుతుపవనాలు విస్తరిస్తాయి. సెప్టెంబర్ 17వ తేదీ నుంచి ఆగ్నేయ దిశ నుంచి తిరోగమనం అవుతాయి. అక్టోబర్ 15వ తేదీలోగా పూర్తిగా ఆ రుతుపవనాలు వెళ్లిపోతాయి. 2025 వర్షాకాలంలో సాధారణం కన్నా అధికంగానే వర్షం కురుస్తుందని ఏప్రిల్‌లో ఐఎండీ వివరించిన సంగతి విదితమే. ఎల్ నినో పరిస్థితులు ఉండబోవని ఐఎండీ పేర్కొన్నది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు ఈసారి నాలుగు నెలల్లో వర్షపాతం సాధారణ స్థాయి కన్నా ఎక్కువే ఉంటుందని ఎర్త్ సైన్సెస్ శాఖ కార్యదర్శి ఎం రవిచంద్రన్ తెలిపారు. ఈసారి వర్షాకాలం ముందే రానున్నదని, మే 27వ తేదీన నైరుతీ రుతుపవనాలు కేరళను తాకనున్నట్లు భారతీయ వాతావరణ శాఖ తెలిపింది.

# నెలాఖరుకు 'అన్నదాత సుఖీభవ'

>> వరిపంట దెబ్బతిందని వివరించారు. నంద్యాల జిల్లాలో 641 హెక్టార్లలో, కాకినాడ జిల్లాలో 530 హెక్టార్లలో, సత్యసాయి జిల్లాలో 20 హెక్టార్లలో వరిపంట దెబ్బతిందని అధికారులు వివరించారు. అకాల వర్షాల కారణంగా రాష్ట్రంలో దెబ్బతిన్న హార్టికల్చర్ పంటల వివరాలను సీఎంకు అధికారులు వివరించారు. అరటి, బొప్పాయి, మామిడి, తదితర ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో ఎక్కువగా అరటి, మామిడి పంటలకు నష్ట వాటిల్లింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 138 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. కృష్ణా, ఏలూరు, కాకినాడ, ఎన్టీఆర్, తిరుపతి, నంద్యాల, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఉద్యానవన పంటలకు నష్టం కలిగిందని అధికారులు వివరించారు. రబీలో 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని పౌరసరఫరాల శాఖ ప్రత్యేక కార్యదర్శి సౌరబ్ గౌర్ సీఎంకు వివరించారు. ఇప్పటికే 13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. వర్షాలకు రంగు మారిన ధాన్యం కూడా కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతుల వద్దనున్న ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. పోలవరం కుడి ప్రధాన కాలువకు సమాంతరంగా మరో కాలువ తవ్వి నీరు పంపగలిగితే రాయలసీమకు ఉపయుక్తంగా ఉంటుందని చంద్రబాబు వెల్లడించారు. అది పోలవరం బనకచర్ల అనుసంధానంతోనే సాధ్యమవుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టును పూర్తిచేస్తే ఏపీలోని అత్యధిక ప్రాంతాలకు సమృద్ధిగా నీళ్లు అందుతాయని చెప్పారు. ఈ ప్రాజెక్టుతో తెలంగాణ కూడా లబ్ధి పొందుతుందని కానీ వాళ్లెందుకో ప్రతికూల భావనలో ఉన్నారని పేర్కొన్నారు. తెలంగాణ నీటివాటాకు ఎలాంటి ఇబ్బందీ ఉండదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టును అనుకున్న లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేస్తామన్నారు.ఈ ఏడాది డిసెంబర్ చివరినాటికి డయాఫ్రమ్ వాల్ పూర్తి చేస్తామన్నారు.పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కూటమి ప్రభుత్వం వచ్చాక పరుగులుపెడుతోంది. సవాళ్లను దాటుకొని ముందడుగు వేస్తోంది. 9 నెలల కాలంలోనే ప్రాజెక్టు మొత్తం మీద 6.11 శాతం పనులు జరిగాయి. జగన్ హయాం ఐదేళ్లలో మాత్రం 11.58 శాతం పనులు మాత్రమే చేశారు. కూటమి ప్రభుత్వంలో 9 నెలల్లోనే అందులో సగం పనులు పూర్తి చేసింది. ప్రధాన డ్యాంలో 3.80 శాతం భూసేకరణ, పునరావాసానికి సంబంధించి 2.56 శాతం మేర పురోగతి కనిపిస్తోంది. జగన్ ఇరిగేషన్ శాఖలోనే రూ.18వేల కోట్ల బిల్లులను పెండింగ్‌లో పెట్టి వెళ్లారని తెలిపారు. గత ప్రభుత్వం లష్కర్లకు ఏడాది జీతాలు బకాయిలు పెడితే కూటమి ప్రభుత్వం చెల్లించిందని చెప్పారు.

**రాయలసీమకు నీరందించేలా చర్యలు:** వృథాగా పోతున్న వరద జలాలను లోటు ఉన్న ప్రాంతాలకు తరలించేలా లింకు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. పల్నాడు జిల్లా బొల్లాపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి బనకచర్ల రెగ్యులేటర్ వరకూ నీటిని తరలించేలా ప్రణాళిక రూపొందించనున్నారు. దాదాపు 150 టీఎంసీల వరకూ నీటిని తరలించేందుకు ఆస్కారం ఉందని లోటు ఉన్న జిల్లాలకు ఈ వరద జలాలను వినియోగించుకోవచ్చని యోచిస్తున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉండే రాయలసీమ జిల్లాలకు నీటిని అందించేలా ఈ ప్రాజెక్టు ఉపకరిస్తుందని ప్రభుత్వం వెల్లడించింది. ఇప్పటికే ?పోలవరం బనకచర్ల రెగ్యులేటర్ కు కాలువలు, ఎత్తిపోతల పథకాలు, భూగర్భ పైప్ లైన్లు, సొరంగాల ద్వారా నల్లమల నుంచి నీటిని తరలించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. దీనికోసం ఓ ప్రత్యేక వాహక సంస్థగా జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టుగా దీన్ని తీర్చిద్దాలని ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఎస్పీవీగా బహిరంగ మార్కెట్ల నుంచి నిధులు సేకరించేందుకు అవకాశం ఉందని వెల్లడించింది. ఈ మేరకు ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

# పిఎస్‌ఆర్‌కు బెయిలు తిరస్కృతి

>> గత నెలలో సీఐడీ అధికారులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుండి విజయవాడ లోని జిల్లా జైలులో రిమాండులో ఉన్నారు. కేసులో ఇంకా దర్యాప్తు పూర్తి కాల్ మనీ,ఈ దశలో నిందితుడిని బెయిలు ఇస్తే విచారణపై ప్రభావం పడుతుందని వాదనల సందర్భంగా ప్రాసిక్యూషన్ తరపున ఏసీపీ వాదనలు వినిపించారు. ఈ కేసులో నిందితుడికి ఎటువంటి సంబంధంలేదని,కక్షపూరితంగా పేరు చేర్చారని పీఎస్ఆర్ తరపు న్యాయవాది వాదించారు.

# రాజధానిలో బిట్స్‌కు 70 ఎకరాలు

>> రాజధానిలోని మందడం,వెంకటపాలెం గ్రామాల పరిధిలో ఈ భూమిని కేటాయించింది. రాజధానిలో వివిధ సంస్థలకు కొత్తగా భూ కేటాయింపులు కొన్ని సంస్థలకు గతంలో చేసిన కేటాయింపులు రద్దు చేస్తూ మంత్రివర్గ ఉపసంఘం తీసుకున్న నిర్ణయాలపై ప్రభుత్వం జిఓ జారీ చేసింది. ఈఎస్ఐ కార్పొరేషన్‌కు ఎకరం రూ.50 లక్షల చొప్పున నెక్కల్లులో 25 ఎకరాలు ఇచ్చారు. హడ్కో ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు ఎకరం భూమి రూ.4 కోట్లు చొప్పున 8 ఎకరాలు కేటాయించింది. భారతీయ రిజర్వు బ్యాంకును నేలపాడు వద్ద గతంలో ఎకరం రూ.4 కోట్లు చొప్పున 2 ఎకరాలు కేటాయించగా,దాన్ని ఇప్పుడు 3 ఎకరాలకు పెంచింది. లా యూనివర్సిటీకి 55 ఎకరాలు, క్వాంటమ్ వ్యాలీకి 50 ఎకరాలు,బసవతారకం క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌కు అదనంగా 6 ఎకరాలు ఐఆర్ సిటీసీ హోటల్‌కు ఎకరం,ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి 0.78,కోస్టల్ బ్యాంకు 0.40 ఎకరాలు చొప్పున కేటాయించింది.ఎల్ఐసీ,కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్),సెంకరటల్ చిన మ్రయ మిషన్ ట్రస్ట్,న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ,జీఎస్ఐ,రామకృష్ణమిషన్‌లకు గతంలో మొత్తం 23,805 ఎకరాలు కేటాయించగా,దాన్ని ఇప్పుడు 8.85ఎకరాలకు తగ్గించింది. కాగ్‌కు గతంలో 14.05 ఎకరాలు కేటాయించగా దాన్ని 2.05 ఎకరాలకు తగ్గించింది.2014-19 మధ్య 22 సంస్థలకు చేసిన 99.61 ఎకరాల భూ కేటాయింపులను రద్దు చేసింది.+రాజధానిలో హోటళ్ళ ఏర్పాటుకు గతంలో వరుణ్ హాస్పటాలిటీ అండ్ ఇట్స్ కన్సార్షియంతో సీఆర్‌డీఏ చేసుకున్న భూ విక్రయ ఒప్పందాన్ని మార్పు చేసి వరుణ్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్‌తో చేసుకునేందుకు అనుమ తిచ్చింది. ఓం శ్రీ భావనసాయి అసోసియేట్స్‌తో గతంలో చేసుకున్న ఒప్పందానికి కాలం చెల్లించినందున,మళ్ళీ ఒప్పందం చేసుకునేందుకు అనుమతినిచ్చింది. ఇప్పుడు ఆ సంస్థ హయత్ గ్రూప్‌తో కలిసి హోటల్ ఏర్పాటు చేయబోతుంది.

# సయోధ్య కుదిర్చిన 'పెద్దన్న'

>> ధ్రువీక రించారు. కాల్పుల విరమించామంటూ భారత్‌పాక్ ధ్రువీకరించడానికి కొద్ది ముందే ఇరుదేశాల మధ్య సయోధ్య కుదిరిందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. భారత్, పాక్ దేశాల మధ్య రాత్రంత్రా జరిపిన మధ్యవర్తిత్వం ఫలించిందని, యుద్ధ విరమణకు భారత్, పాక్ అంగీకరించినందుకు సంతోషంగా ఉందని ట్రంప్ అన్నారు. కాగా, దీనికి కొద్ది గంటల ముందే భారత్‌పాక్ ఉద్రిక్తతల వేళ రెండు దేశాల నడుమ జరిగే యుద్ధంలో తాము జోక్యం చేసుకోమంటూ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తేల్చిచెప్పడం ఆసక్తికరం. ప్రాథమికంగా అయితే ఇరుదేశాల మధ్య యుద్ధం తమకు సంబంధం లేదని విషయమని ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వాన్స్ పేర్కొన్నారు. అణ్వాయుధ దేశాల మధ్య ఘర్షణ వాతావరణం తగ్గించేందుకు మాత్రం ప్రోత్సహిస్తామన్నారు. ఆయుధాలు వదిలేయాలని భారత్, పాక్‌కు మేం చెప్పలేం. మేము దౌత్య మార్గాల ద్వారా ఉద్రిక్తతలు తగ్గించేందుకు ప్రయత్నిస్తాం అని చెప్పారు. ఈ క్రమంలోనే ఏ ఉగ్రదాడినైనా ఇక నుంచి యుద్ధంగా పరగణిస్తాంటూ భారత్ కీలక నిర్ణయం తీసుకుంది. పాక్‌కు పరోక్షంగా తీవ్ర హెచ్చరికలు చేసింది. దీంతో రాయబారం కోసం అమెరికాను పాక్ వేడుకోవడం, ట్రంప్ దౌత్యం ఫలించి కాల్పుల విరమణకు భారత్ అంగీకరించడంతో ఆయన తక్షణమే ఇరుదేశాల అంగీకారంపై కీలక ప్రకటన చేశారు. భారత్‌పాక్ ఎంతో వివేకంగా వ్యవహరించాయని, కాల్పుల విరమణకు అంగీకరించాయంటూ ప్రశంసలు కురిపించారు.

# పారిశ్రామికాభివృద్ధే లక్ష్యం

>> సదుపాయాలు కల్పించాల్సి ఉంటుందన్నారు. భూమి దొరకకుంటే ఫ్యాక్టరీలు పెట్టేందుకు అవకాశం ఉండదని, భూమి కావాలంటే టౌన్‌లకు దూరంగా ఏదొక పల్లెటూరుకు దగ్గరగా వెళ్లిపోవాల్సి వస్తుందన్నారు. ఒక ఫ్యాక్టరినో లేదా చిన్న కంపెనియో స్థాపించాలంటే పట్టణాల్లో ఎక్కడా స్థలం కనపడదని తెలిపారు. ఆ సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు పట్టణాల్లో యూనిట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఉద్యోగాలు చేసే వారికి కంపెనీలు అందుబాటులో ఉండాలని ప్రభుత్వం ఆలోచన చేసిందన్నారు. అందులోంచి వచ్చిందే ఈ ప్లోటెడ్ ఫ్యాక్టరీ షెడ్‌ల ఏర్పాటని అన్నారు. ప్లోటెడ్ షెడ్‌కు రెండు, మూడు ఎకరాలు ఉంటే సరిపోతుందని అందులో మల్టీ స్టోర్ బిల్డింగ్ కడతారని తెలిపారు. వాటిని పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా డివైడ్ చేస్తారన్నారు. ఈ రోజు శంకుస్థాపన చేసుకున్నది కూడా అలాంటిదేనన్నారు. ఏపీఐఐసీ రెండెకరాల 40 సెంట్లు స్థలం కొనుగోలు చేసి ఈ షెడ్‌ను మొత్తం 12 కోట్లతో జీ ప్లస్ 2 విధానంలో ఇక్కడ మల్టీ స్టోర్డ్ బిల్డింగ్ నిర్మిస్తారని చెప్పారు. ఈ బిల్డింగ్‌లో 26 యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రౌండ్ ఫ్లోర్లో 14357 చదరపు అడుగుల విస్తీర్ణంలో 7 యూనిట్లు, ఫస్ట్ ఫ్లోర్లో 13980 చదరపు అడుగుల విస్తీర్ణంలో 9 యూనిట్లు, సెకండ్ ఫ్లోర్‌లో 13980 చదరపు అడుగుల విస్తీర్ణంలో 10 యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా డివైడ్ చేస్తామని తెలిపారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు, సిటీ రూరల్‌లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. అనుకున్నది సాధించే పట్టుదల ఉన్న వ్యక్తి మంత్రి నారాయణ అని కొనియాడారు. ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రభుత్వం చేస్తున్న ఆలోచన చాలా మంచిదన్నారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఎంఎస్ఎం ఈ పార్కు ఏర్పాటుకు మంత్రి నారాయణ కృషి చేస్తారన్నారు. భగత్ సింగ్ కాలనీకి గత ప్రభుత్వ సేవలు ద్రోహం చేస్తే కాలనీ వాసులకు శాశ్వత ఇంటి పట్టాలతో పాటు, నివాస ప్రాంతంలోనే ఎంఎస్ఎంఈ పార్కు పెట్టి ఉపాధి కల్పించాలని సంకల్పించి మాట నిలబెట్టుకున్న చేతల మంత్రిగా నారాయణ చరిత్రలో నిలిచిపోతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర కమీషనర్ నందన్, ఆర్డీఓ అనూష, ఏపీఐఐసీ జీఎం ప్రసాద్, జోనల్ మేనేజర్ శివకుమార్, టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, టీడీపీ నగర అధ్యక్షులు మామిడాల మధు, కార్పొరేటర్ షఫియాబేగం, క్లస్టర్ ఇన్‌ఛార్జీ జహీర్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

# ఇటు విరమణ.. అటు కాల్పులు

>> నిమిషంలో మనసు మార్చుకుని 24 గంటలపాటు రెండువైపులా చర్చలుజరిపింది. విదేశాంగమంత్రి మార్కోరుబియో, ఉపాధ్యక్షుడు జెడివాన్స్‌లు కూడా కీలకంగా వ్యవహరించడంతో పాక్ దారికి వచ్చింది. సరిహద్దుల్లో దాడులు ఆపివేస్తేనే కాల్పుల విరమణ ఉంటుందని భారత్ తెగేసి చెప్పింది. అంతేకాకుండా ఉగ్రస్థావరాలకు సాయం నిలిపివేయాలన్న డిమాండ్‌ను కూడా వినిపించింది. తనకు ఎంతో మిత్రులైన గల్ఫ్‌దేశాలు, చైనా, రష్యాలుకూడా కేవలం ప్రకటనలే చేసాయికానీ భారత్‌కే మద్దతు తెలిపాయన్న భావన పెరగడంతో గత్యంతరంలేక పాక్ కాల్పుల విరమణకు అంగీకరించింది. కాల్పుల విరమణకు భారత్; పాకిస్తాన్‌లు అంగీకరించాయని విదేశాంగశాఖ కార్యదర్శి మిస్రీ తెలిపారు. సాయంత్రం ఐదుగంటలనుంచి అమలుకు వచ్చినట్లు తెలిపింది. విదేశాంగశాఖ కార్యదర్శి మిస్త్రీ మాట్లాడుతూ శనివారం మధ్యాహ్నం 3.35 గంటలకు ఇరుదేశాల డైరెక్టర్‌జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్‌స్థాయిలో చర్చలుజరిగాయని, పాకిస్థాన్ డిజిఎంఒ భారత డిజిఎంఒకు ఫోన్‌చేసారని తెలిపారు. కాల్పుల విరమణకు ఇరుదేశాల సైనికాధికారులు అంగీకరించారని, సాయంత్రం ఐదు గంటలనుంచి అమలుకువచ్చిందని ప్రకటించారు. భూఉపరితలం, గగనతలంలోను, సముద్రజలాలపరంగా కూడా ఇరుదేశాలమధ్య కాల్పుల విరమణ కొనసాగుతుందని చెప్పారు. రెండుదేశాల సైన్యాలకు ఇందుకు సంబంధించినాదేశాలు వెళ్లాయన్నారు. ఈనెల 12వ తేదీ సాయంత్రం డిజిఎంఒలు మళ్లీ చర్చలుజరుపుతారని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు. ఉగ్రవాదంపై భారత్ రాజీలేని వైఖరితోనే కొనసాగుతుందని విదేశాంగమంత్రి జైశంకర్ ఈసందర్భంగా స్పష్టంచేసారు. కాల్పుల విరమణకు అంగీకరించినా భారత సైన్యం నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని భారత సైనికాధికారులు చెప్పారు. కొన్నిరోజులుగా భారత్‌పై పాకిస్థాన్ అసత్యాలు ప్రచారంచేస్తోందని, ఎస్-400, బ్రహ్మోస్ వ్యవస్థలపై దాడిచేసామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. సిర్సా, జమ్ము, భటిండా, భుజ్‌లపై పాక్‌దాడిచేసామని ప్రచారంచేయడం కూడా అవాస్తవమేనన్నారు.నలియా పఠాన్‌కోట్ వాయుసేనస్థావరాలకు నష్టం కలిగించామని చండీగఢ్ ఆయుధాగారంపై దాడిచేసినట్లు పాక్ తప్పుడు ప్రకటనలుచేసిందన్నారు. భారత్ లౌకిక దేశమని ప్రార్థనామందిరాలపై ఎప్పుడూ దాడులుచేయదన్నారు. పాకిస్థాన్ రాడార్, క్షిపణి రక్షణ వ్యవస్థలను నిర్వీరనయంచేసామని, కర్దు, సర్గోదా, జకోదాబాద్‌లోని పాక్ వాయుసేనస్థావరాలను భారత దళాలు ధ్వంసంచేసాయన్నారు. నియంత్రణరేఖపొడవునా అపారనష్టం కలిగించామని, కాల్పుల విరమణకు అంగీకరించినా సైన్యం పూర్తి సన్నద్ధతతో ఉంటుందని సైనికాధికారులు అప్రమత్తంగా ఉంటారని సిఎండిఇ రఘునాయర్, కల్నల్ సోఫియా ఖురేషి, వైమానికదళ కమాండర్ వ్యోమికాసింగ్‌లు ప్రకటించారు.

# ఉల్లంఘించిన పాక్

>> కాల్పుల విరమణను ఉల్లంఘించిందని, పాక్ దురాగతాలను భారత సైన్యం సమర్థంగా తిప్పికొడుతోందని మిస్రీ అన్నారు. ఎలాంటి పరిస్థితిని అయినాసరే కట్టడిచేసేందుకు భారత్ సన్నద్ధంగా ఉందన్నారు. కాల్పుల విరమణ ఉల్లంఘనపై తక్షణ చర్యలు తీసుకోవాలని పొరుగుదేశానికి సూచించామని, డ్రోన్లు, కాల్పులు జరిపినట్లు సమాచారం అందిందని, ఈ సంఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. డైరెక్టర్‌జనరల్‌మిలిటరీ ఆపరేషన్స్ రెండు దేశాల అధికారులమధ్య జరిగిన ఒప్పందాన్ని పాకిస్తాన్ ఉల్లంఘించిందని అయినా భారత్ తన వ్యూహం అమలుచేసి ఎక్కడికక్కడ తిప్పి కొట్టిందని ఆయన అన్నారు.ఉల్లంఘనలను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు విదేశాంగ కార్యదర్శి చెప్పారు.

## రక్షణ, భద్రతా దళాల కదలికలను ప్రత్యక్ష ప్రసారం చేయవద్దు

**విజయవాడ,మే10,ప్రభాతవార్తప్రతినిధి:** భారత రక్షణ, భద్రతా దళాల కదలికలను ప్రత్యక్ష ప్రసారం చేయకుండా ఉండాలని భారత ప్రభుత్వం సమాచార. ప్రసార మంత్రిత్వ శాఖ (న్యూఢిల్లీ) దేశంలోని అన్ని మీడియా ఛానళ్ళకు మోలిక సూత్రాలు,. నిబంధనలు జారీ చేసింది.ఏపీ సమాచార,పౌరసంబంధాల శాఖ ఈ విషయంపై శనివాం ఒక ప్రకటన జారీ చేసింది.జాతీయ భద్రత దృష్ట్యా, అన్ని మీడియా ప్లాట్ ఫామ్స్, వార్తా సంస్థలు సోషల్ మీడియా ఉప , రక్షణ, ఇతర భద్రతా కార్యకలాపాల గురించి ప్రసారం చేసేటప్పుడు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.

# భారీ ఉష్ణోగ్రతలు నమోదు

## రేణిగుంట, విజయనగరం 41°

**విజయవాడ,మే10,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో పలు ప్రాంతాల్లో శనివారం భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.కొన్ని జిల్లా ఉక్కపోత ప్రజలను ఇబ్బంది పెట్టినప్పటికి,సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వానలు పడ్డాయి.విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగింది.ఎండలో ఇదే రీతిలో కురు స్తాయని,రాబోయే నాలుగు రోజులు ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని వాతావరణ శాఖ తెలిపింది.శనివారం తిరుపతి జిల్లా రేణిగుంటలో 41.7డిగ్రీలు విజయనగరంలో 41.1డిగ్రీలు, తూర్పుగోదావరి జిల్లా మురమండలో 41డిగ్రీలు అన్నమయ్య జిల్లా కంబాలకుంటలో 40.8డిగ్రీలు, వైఎస్సార్ జిల్లా మద్దూరు,ప్రకాశం జిల్లా మేకలవారిపల్లిలో 40.7డిగ్రీలు చొప్పున అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపారు.ఎండలో బయటకు వెళ్లేప్పుడు నెత్తికి టోపి పెట్టుకోండి లేదా రూమాలు కట్టుకోండి, తెలుపురంగు గల కాటన్ వస్త్రాలను ధరించండి. అదేవిధంగా మీ కళ్ళ రక్షణ కోసం సన్ గ్లాసెస్ ఉపయోగించండి. చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలి. గుండె సంబంధిత వ్యాదులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు.మరోవైపు పిడుగులతో కూడిన ఆకస్మిక వర్షాలు, ఈదురుగాలులు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు హోర్డింగ్స్, చెట్ల క్రింద, శిథిలావస్థలో ఉన్న గోడలు, భవనాలు దగ్గర నిలబడరాదన్నారు. ఆదివారం 41డిగ్రీలు 43.5డిగ్రీలు మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు.అల్లూరి సీతారామరాజు11,అనకాపల్లి జిల్లా8 మండలాల్లో తీవ్రవడగాలులు(19), మరో 30 మండలాల్లో వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు తెలిపారు. సోమవారం 24 మండలాల్లో తీవ్ర,57 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందన్నారు. రేపు అల్లూరి సీతారామరాజు8, అనకాపల్లి16, అనంతపురం4, అన్నమయ్య1, చిత్తూరు జిల్లా కుప్పం మండలాల్లో(30) వడగాలులు వీచే అవకాశం ఉందన్నారు.



శనివారం హైదరాబాద్‌లో మిస్‌వరల్డ్ పోటీల కార్యక్రమానికి హాజరైన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

## వారం - వర్జ్యం

తేది : 11-05-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్ల పక్షం
చతుర్దశి రా.8.01
స్వాతి పూర్తి
వర్జ్యం ఉ.9.21-11.10
దు.సా.4.43-6.34
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** ఆత్మీయులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. గృహ నిర్మాణ ఆలోచనలు స్థిరంగా ఉండవు.

**వృషభం:** కుటుంబంలో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. వృత్తి, వ్యాపార లావాదేవీలు మందగిస్తాయి.

**మిథునం:** బంధువులతో ఏర్పడిన తగాదాలు పరిష్కరించుకుంటారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**కర్కాటకం:** భూవివాదాలు పరిష్కరించుకుంటారు. చర్చాగోష్ఠులలో చురుకుగా పాల్గొంటారు. వస్తు సేకరణ.

**సింహం:** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో కొత్త ఆశలు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**కన్య :** పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**తుల :** ప్రయాణాలలో తొందరపాటు వద్దు. ఇంటా బయటా సమస్యలు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు.

**వృశ్చికం:** ఉద్యోగయత్నాలు నత్తనడకన సాగుతాయి. వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. సోదరుల కలయిక.

**ధనుస్సు:** ఉద్యోగాలలో చికాకులు ఎదురైన అధిగమిస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. వస్తులాభం.

**మకరం:** ఆకస్మిక ప్రయాణాలలో తొందర పాటు వద్దు. గృహనిర్మాణ ఆలోచనలు స్థిరంగా ఉండవు. వస్త్రాల సేకరణ.

**కుంభం:** శ్రమ పెరుగుతుంది. వ్యాపారాలు మందకొడిగా ఉంటాయి. ఉద్యోగాలలో కొత్త సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి.

**మీనం:** కొత్తమిత్రులు పరిచయమై నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

11-05Pg3exHMNWJQEV.qxd:11-05Pg3exHMNWJQEV.qxd 11/05/25 12:06 AM Page 1



### శని త్రయోదశి సందర్భంగా

# విశేష పూజలు

## 30వేల మంది భక్తుల దర్శనం



శ్రీకాళహస్తీశ్వరుని దర్శనం కోసం నిరీక్షిస్తున్న జనం

**శ్రీకాళహస్తి, మే 10 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్తులతో కిట కిట లాడింది. ఉదయం నుంచి ఆలయంలో ఎటు చూసినా భక్తుల శివనామస్మరణతో పునీతమైంది. శనివారం త్రయోదశి కావటంతో శనీశ్వరుని ఆలయం వద్ద , అభయ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. శనీశ్వరునికి 372 అభిషేకాలు జరిగాయి. అభయ వెంకటేశ్వరస్వామి నిలువెత్తు విగ్రహాన్ని కన్నులుమిరుమిట్లు గోల్పునట్లు ముస్తాబు చేసారు. శనీశ్వరుని విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు జరిపారు. వేదపండితులు, అర్చకులు స్వామి సన్నిధిలో వేద మంత్రాలను పఠిస్తూ షోడషాభిషేకాలు జరిపారు. ఇక శనీశ్వరస్వామి, రాహుకేతుదోష నివారణ పూజలు కూడా రికార్డు స్థాయిలో జరిగాయి. ఇటీవల కాలంలో శ్రీకాళహస్తీశ్వరాలయం లో భక్తుల రద్దీ పెరిగింది. ముఖ్యంగా రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. శనివారం ఓ వైపు సామాన్యభక్తుల తాకిడి మరోవైపు అతిధులతో కళ కళ లాడింది.

**అనూహ్యంగా పెరిగిన రద్దీ:** నాలుగైదు రోజులుగా ఎండలతో పరిమితంగా ఉన్న భక్తుల సంఖ్య శనివారం ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. దేవస్థానం అందించిన సమాచారం మేరకు సుమారు 30వేల మంది శనివారం స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకున్నారని ఆలయాధికారులు చెబుతున్నారు. రికార్డు స్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిగినట్లు వివరించారు.

**శివానందైక నిలయం జనంతో కిట కిట:** దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శివానందైక నిలయం శనివారం భక్తులతో కిట కిట లాడింది. దక్షిణ కైలాసంలో వెలసిన వాయుటింగేశ్వరుడు భక్తులు తమ ఇష్టదైవం ముక్కంటీశునికి దర్శించుకొని శుభాలు పొందాలని పరుగులు తీశారు. ఓ వైపు సామాన్యభక్తుల తాకిడి మరో వైపు అతిధుల తాకిడితో ఆలయం కిట కిట లాడింది. అడుగు తీసి అడుగు వేయలేని స్థితి చోటు చేసుకుంది. అయితే వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ఆదేశాలతో వారి సిబ్బంది పరుగులు తీసారు. తిరుమలేశుని దర్శనానికి వచ్చిన భక్తులకు దర్శనం ఆలస్యం అవుతుండటంతో సమీపం లోని ఆలయాల దర్శనానికి రద్దీ ఏర్పడింది. ఒక్కసారిగా జనం తండోప తండాలుగా కడలి తరంగాల్లా కదలి వచ్చారు. రెండు రోజులుగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ అధికమైంది. శ్రీకాళహస్తీశ్వరాలయంతో పాటు పరిసర దేవాలయాలు భక్తులతో కిట కిట లాడాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బంది ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, సతీష్ మాలిక్, టెంపుల్ ఇన్స్పెక్టర్లు హరియాదవ్, సుదర్శనం, వారి సహచరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


**రోజు రోజుకు పెరుగుతున్న భక్తులు : ఇఓ డి.బాపిరెడ్డి**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వేసవి సెలవులతో రద్దీ పెరుగుతుందని ఆలయ ఇఓ బాపిరెడ్డి శనివారం వివరించారు. అయితే వచ్చినభక్తులు ఇబ్బందిపడకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఆలయంలోనిర్వహించే సేవల్లో స్వామి అమ్మవార్ల అభిషేకాలు 67 రాహుకేతుదోష నివారణ పూజలు 5వేలు జరిగాయి.

# జాతీయ రక్షణ నిధికి స్పీకర్ నెల వేతనం విరాళం

**విజయవాడ,మే10,ప్రభాతవార్తప్రతినిధి:** జాతీయ రక్షణ నిధికి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తన ఒక నెల వేతనాన్ని విరాళంగా అందజేశారు. ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా



ఈ విరాళాన్ని ఆయన జమ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్న పాత్రుడు గారు మాట్లాడుతూ– మన దేశ సాయుధ దళాలు ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు చేస్తున్న ధైర్యసాహసాలు ప్రతి భారతీయునిలో గర్వాన్ని కలిగించే అంశం. దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న వీర జవాన్లకు నా వంతుగా సంఘీభావంగా నా నెలవేతనాన్ని జాతీయ రక్షణ నిధికి విరాళంగా ఇచ్చాను. అని తెలిపారు. ఉగ్రవాద నిర్మూలనలో సాయుధ దళాలు ప్రదర్శిస్తున్న ధైర్యసాహసాలు దేశ ప్రజలందరికీ గర్వకారణంగా నిలుస్తున్నాయి అని అన్నారు. భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో ఆర్మీకి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. సైనికులకు తమ వంతు సహాయం అందించేందుకు తెలుగు రాష్ట్రాల్లో ప్రజాప్రతినిధులు తమ నెల జీతాన్ని ఆర్మీకి విరాళంగా ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారు. తాజాగా ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తన నెల వేతనాన్ని జాతీయ రక్షణ నిధికి విరాళంగా ఇచ్చారు. ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా ఈ విరాళాన్ని స్పీకర్ అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. దేశ సాయుధ దళాలు ఉగ్రవాద నిర్మూలనలో చూపిస్తున్న ధైర్యం ప్రతీ భారతీయునికి గర్వకారణమన్నారు.

# 13న కల్లి తండాకు జగన్

## మురళీనాయక్ కుటుంబానికి పరామర్శ

**విజయవాడ,మే10.ప్రభాతవార్తప్రతినిధి:** జమ్మూకశ్మీర్ లో వీర మరణం పొందిన మురళీ నాయక్ ఈ నెల 13న కల్లి తండాకు మాజీ సీఎం జగన్ వెళ్లనున్నారు. ఇప్పటికే మురళి కుటుంబాన్ని ఫోన్ ద్వారా పరామర్శించిన జగన్ జమ్మూకశ్మీర్ లో శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లి తండాకు చెందిన జవాన్ మురళీ నాయక్ వీర మరణం పొందారు. మురళి మృతిపై వైసీపీ అధినేత జగన్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించేందుకు ఈనెల 13న జగన్ కల్లి తండాకు వెళ్లనున్నారు. ఇప్పటికే మురళి కుటుంబ సభ్యులను జగన్ ఫోన్ ద్వారా పరామర్శించి ధైర్యం చెప్పారు. మురళీ నాయక్ అగ్నివీర్ పథకం కింద మూడేళ్ల క్రితం ఆర్మీలో చేరారు. నాసిక్ లో శిక్షణ పొంది అసోంలో పని చేశారు. పాకిస్థాన్ తో యుద్ధం నేపథ్యంలో జమ్మూకశ్మీర్ లో విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పాక్ బలగాలను అడ్డుకునే ప్రయత్నంలో ఆయన వీర మరణం పొందారు. మురళి మృతి పట్ల అన్ని పార్టీల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు.

# పిఠాపురం అనాధపిల్లలకు నా జీతం ఇస్తున్నా

## ప్రతి నెల ఇంటివద్దనే అందిస్తాం : డిసిఎం పవన్

**విజయవాడ,మే10,ప్రభాతవార్తప్రతినిధి:** పిఠాపురం నియోజకవర్గంలోని అనాథ పిల్లలకు తన వేతనాన్ని కేటాయిస్తున్నట్లు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. పదవి ఉన్నంత కాలం సాయం కొనసాగుతుందని పవన్ ప్రకటించారు. పిఠాపురం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఒక కీలక నిర్ణయాన్ని తన కార్యాలయం ద్వారా విడుదల చేసిన సమాచార పత్రంలోను, ఎక్స్ వేదికలోను ప్రకటించారు. ఎమ్మెల్యే తన వేతనాన్ని నియోజకవర్గంలోని అనాథ పిల్లల సహాయార్థం అందజేయనున్నట్లు ఆయన వెల్లడించారు. పిఠాపురం నియోజకవర్గ ప్రజలు ఎంతో నమ్మకంతో తనను శాసనసభ్యుడిగా గెలిపించారని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడటం, సమస్యలను పరిష్కరించడం తన బాధ్యత అని పవన్ పేర్కొన్నారు. పిఠాపురం ప్రజలు ఇచ్చిన అధికారం ద్వారా వచ్చిన జీతాన్ని అక్కడే వినియోగించాలని ఆయన నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా, నియోజకవర్గ పరిధిలోని తల్లిదండ్రులు లేని పిల్లల భవిష్యత్తు కోసం ఆ మొత్తం ఇస్తున్నట్లు తెలిపారు. తాను పదవిలో ఉన్నంత కాలం వచ్చే జీతం మొత్తాన్ని ఆ పిల్లల సంక్షేమానికి వినియోగిస్తా నని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పిఠాపురం



నియోజకవర్గానికి చెందిన 42 మంది అనాథ పిల్లలకు పవన్ కల్యాణ్ తన వేతనం నుంచి ఒక్కొక్కరికి నెలకు రూ. 5 వేల చొప్పున మొత్తం రూ. 2 లక్షల 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. జీతంలో మిగిలిన మొత్తాన్ని కూడా వారి బాగోగులు చూసేందుకే ఖర్చు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న 32 మందికి పవన్ స్వయంగా సహాయం అందజేసినట్లు వివరించారు..

# హేతుబద్దీకరణ, ఆ తర్వాతే టీచర్ల బదలీలు,పదోన్నతులు

**విజయవాడ,మే 10,ప్రభాతవార్త ప్రతినిధి:** హేతుబద్ధీకరణ,ఆ తర్వాతే టీచర్ల బదిలీలు,పదోన్నతులు అమలు చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఉపాధ్యాయుల బదిలీల్లో ఈసారి పోస్టులను బ్లాక్ చేయకూడదని నిశ్చయించింది, పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. గత ప్రభుత్వంలో కొన్ని పోస్టులను బ్లాక్ చేయడం వల్ల ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. దాంతో ఈ సారి పోస్టుల హేతుబద్ధీకరణ, బదిలీలు,పదోన్నతులను ఒక దాని తర్వాత మరొకటి నిర్వహిస్తారు. ఇప్పటికే సీనియారిటీ జాబితాలను సిద్ధం చేశారు. పదోన్నతులు, బదిలీల ప్రక్రియనువిద్యాశాఖ చేపట్టింది. తొలుత పోస్టుల హేతుబద్ధీకరణ ఉత్తర్వులను ఇవ్వనుంది. ఆ తర్వాత పదోన్నతులకు 1.2 విధానంలో జాబితా విడుదల చేసి, అభిప్రాయాలు తీసుకోనుంది. ఏదైనా పాఠశాలలో బదిలీ, పదోన్నతులతో 50%కంటే ఎక్కువ మంది ఉపాధ్యాయులు రిలీవ్ కావాల్సి వస్తే నూతన డీఎస్సీ ఉపాధ్యాయులు వచ్చే వరకు 50% పైన ఉన్న వారిని నిలిపివేస్తారు. ఇకజూన్ 5 నుండి 11 వరకు జిల్లా స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు. పాఠశాలల పున:ప్రారంభమైన వెంటనే వారం రోజుల పాటు విద్యార్థుల ప్రవేశాలకు బడిబాట కార్యక్రమం నిర్వహిస్తారు. జూన్ 28న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేస్తారు.

# పి4 పేరుతో పేదలకు అవమానం

## - దీర్ఘకాలిక విద్యుత్ ఒప్పందాలను రద్దుచేయాలి
## - సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు




**తిరుపతి,మే 10ప్రభాతవార్తప్రతినిధి:** పి4 పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నడుపుతున్న నాటకం పేదలను అవమానించడమేనని సిపిఎం పోలిట్‌బ్యూరోసభ్యుడు బివి రాఘవులు విమర్శించారు. దారిద్ర్యాన్ని నిర్మూలించే పేరుతో రాష్ట్రంలో చంద్రబాబు సాగిస్తున్న పథకం పి4 పేదలను అవమానించడమేనని అన్నారు. ప్రభుత్వ తన బాధ్యత నుండి తప్పుకుని పేదలను కార్పొరేట్ శక్తులకు అప్పజెబుతున్నాడని మండిపడ్డారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత పేరున కొన్ని కంపెనీలు కేటాయించే డబ్బులను కొన్ని కుటుంబాలకు ఖర్చుచేయడం ద్వారా దారిద్ర్యం రాష్ట్రంలో పోతుందనుకోవడం ఆయన భ్రమేనని దుయ్యబట్టారు. శనివారం తిరుపతిలోని సిపిఎం కార్యాలయంలో మీడియా ప్రతినిధుల సమా వేశంలో బివి రాఘవులు పలు అంశాలపై వివరించారు. పి4 పథకం అగరుబత్తి లాంటిదని, భక్తునికి భగవంతునికి అనుసం ధానం అగరబత్తి అనే ప్రకటన లాంటిదని ఎద్దేవాచేశారు. చంద్రబాబు వేదాంతం ప్రజలను అవమానం చేసేదని ఆయన తీవ్రంగా విమర్శించారు. కేంద్రప్రభుత్వం పత్రికా స్వాతంత్ర్యానికి, వాక్‌స్వాతంత్ర్యానికి, సభా స్వాతంత్ర్యానికి భంగం కలిగించే రీతిలో వ్యవహరిస్తున్నదని తాజాగా ది వైర్ పత్రికను బ్లాక్‌చేసిందని అన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌పైఅంతర్జాతీయ వేదికల ద్వారా ఒత్తిడి పెంచి ఒంటిపాలు చేయడానికి కేంద్రప్రభుత్వం నిర్ధిష్టచర్యలు తీసుకోవాలన్నారు. ఉగ్రవాదులను పాకిస్థాన్ భారత్‌కు అప్పగించేందుకు తోడ్పడే విధంగా ఈ ఒత్తిడి ఉండాలని రాఘవులు సూచించారు. మౌలికంగా సిపిఎం యుద్దానికి వ్యతిరేకమైనా ఎదుటివారు కవ్వింపు చర్యలకు పాల్పడుతూ, ఉగ్రవాద చర్యలకు పాల్పడటం చూస్తూ ఊరుకోమని దాని అర్థంకాదన్నారు. ఆపరేషన్ కగారును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, చర్చలకు సిద్దం అంటున్న మావోయిస్టుల విజ్ఞప్తిని ప్రభుత్వం అంగీకరించకుండా హత్యలు చేయడం దారుణమని రాఘువులు విమర్శించారు. తక్షణం కాల్పులు విరమించి మావోయిస్టులతో చర్చలు జరపాలని ఆయన కోరారు. విద్యుత్ కొనుగోలు పేరుతో ప్రైవేటు సంస్థలతో చేసుకుంటున్న దీర్ఘకాలిక ఒప్పందాలు ప్రజలపై తీవ్రమైన భారాన్ని కలిగించేవని, తక్షణం ఈ ఒప్పందాలనురద్దుచేసుకుని ,ప్రజలపై భారాలు లేకుండా చూడాలని సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. రోజురోజుకూ తెలుగుదేశంపార్టీ తన లౌకిక స్వభావాన్ని కోల్పోతుందని, కేంద్రంలోని బిజెపి ఏది చెబితే తాను తందానా అంటూ వ్యవహరిస్తున్నదని విమర్శించారు. రాయలసీమ ప్రాంతంలో ఏనుగులు పొలాలపై పడి రైతులను తీవ్రంగా నష్టపరిచి, ప్రాణాలు తీస్తుంటే రాష్ట్రప్రభుత్వం మాటమాత్రంగా కూడా పట్టించుకోకపోవడం లేదని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో రాజధాని అమరావతి, పోలవరం తప్ప మిగిలిన సమస్యలన్నీ పూర్తిగా పాలకులు మరచిపోయారని ఇది బాధ్యతారాహిత్యమని అన్నారు.

# ఎక్స్‌రే అవార్డుకు కవితల ఆహ్వానం

**విజయవాడ మే 10,ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగు కవిత్వం అనేక ప్రాపంచిక పరిణామాలకు స్పందిస్తూనే ఉంది. అటువంటి కవిత్వాన్ని ఎక్స్ రే సంస్థ ప్రోత్సహిస్తుంది. అందులో గత నాలుగు దశాబ్దాలుగా తెలుగు వచన కవితా రంగంలో విశిష్ట స్థానాన్ని పొంది, నిరంతర సాహిత్య పాఠశాలగా వెలుగొందుతున్న ఎక్స్ రే జాతీయస్థాయి అవార్డుల కవితలను ఆహ్వానిస్తుంది. ప్రధాన అవార్డుకు ఎంపికైన కవితకు రూ.పదివేల నగదుతో పాటు జ్ఞాపిక, సత్కారం, మరో పది కవితలకు ఉత్తమ కవితా పురస్కారాలు ఇవ్వబడతాయి. చారిత్రక వికాసాన్ని క్రమ పద్దతిలో పదిలపర్చే ఈ ప్రయత్నంలో కవులు పాల్గొని సహకరించగలరు. కవితా వస్తువు, పరిధి విషయాల్లో కవికి పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. సుదీర్ఘ కవితలు పరిశీలించబడవు. ఈ సంవత్సరం విజయవాడలో జరిగే సభలో ఈ అవార్డులు బహూకరించబడతాయి. కవితలు పంపేవారు ఖచ్చితంగా ఎక్స్ రే సంస్థలో చందాదారులుగా ఉండాలి. సంవత్సర చందా రూ.100/–లు ఎక్స్ రే పేరు, చిరునామా, కవితపై కాకుండా హామీ పత్రంపై మాత్రమే వ్రాయాలి

# ఇంద్రకీలాద్రిలో 12న గిరి ప్రదక్షిణ

**ఇంద్రకీలాద్రి, మే 10, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఇంద్రకీలాద్రికి ఈనెల 12న వైశాఖ మాసం పౌర్ణమి సందర్భంగా ఉదయం 5.55 గంటలకు గిరి ప్రదక్షిణ నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. ఘాట్‌రోడ్డు వద్ద వేంచేసియున్న శ్రీ కామధేను అమ్మవారి ఆలయం వద్ద ఈ ప్రదక్షిణ ప్రారంభమై విద్యాధరపురం, కుమ్మరిపాలెం, నాలుగు స్తంబాల సెంటర్, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి మీదుగా తిరిగి ఇంద్రకీలాద్రికి చేరుకుంటుని ఇఓ వివరించారు.

# ఐపిఎస్ అధికారి జాషువాకు హైకోర్టులో ఊరట, నోటీసు ఇచ్చి వివరణ తీసుకోమన్న న్యాయస్థానం

**విజయవాడ,మే 10,ప్రభాతవార్త ప్రతినిధి:** స్టోన్ క్రషర్ యాజమాన్యాన్ని విజిలెన్స్ తనిఖీల పేరుతో బెదిరించి లంచం వసూలు చేసిన కేసులో ఐపీఎస్ అధికారి పి.జాషువాకు హైకోర్టులో ఊరట లభించింది. ఆయనకు నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలని ఏసీబీ అధికారులను హైకోర్టు ఆదేశించింది. దర్యాప్తునకు సహకరించాలని కేసుకు సంబంధించిన వివరాలను బహిరంగంగా మాట్లాడవద్దని నివాస వివరాలను అఫిడవిట్ రూపంలో దర్యాప్తు అధికారికి అందచేయాలని జాషువాకు షరతులు విధించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లిఖార్జునరావు ఈ మేరకు ఉత్తర్వులిచ్చిరు. వైకాపా ప్రభుత్వ హయాంలో విజిలెన్స్ తనిఖీల పేరుతో తమను బెదిరించి రూ.2.20 కోట్ల అక్రమంగా వసూలు చేశారంటూ పల్నాడు జిల్లా యడ్లపాడు లోని శ్రీలక్ష్మి బాలాజీ స్టోన్ క్రషర్ మేనేజింగ్ భాగస్వామి ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా మాజీమంత్రి వడదల రజిని తదితరులపై ఏసీబీ కేసు నమోదు చేసిందిజ ఈ కేసులో రెండో నిందితుడు జాషువా ముందస్తు బెయిలు కోసం హైకోర్టులో పిటీషన్ వేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ) మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ పిటీషనర్ రూ.10 లక్షలు తీసుకున్నారనే అభియోగాలు ఉన్నాయన్నారు. ఇదే కేసులో నిందితుడిగా ఉన్న విడదల గోపీని పోలీసులు అరెస్ట్ చేశారని, విచారణలో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయన్నారు. న్యాయమూర్తి స్పందిస్తూ పిటీషనర్‌పై నమోదు చేసిన సెక్షన్లు ఏడేళ్ళ లోపు జైలు శిక్షకు వీలున్నవేనన్నారు. ఇదే కేసులో ఇద్దరు నిందితుల విషయంలో నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలని ఇటీవల ఉత్తర్వులు ఇచ్చామని గుర్తు చేశారు. జాషువా విషయంలోనూ అదే ఉత్తర్వులు వర్తిస్తాయని స్పష్టం చేశారు. ఇక ఇదే కేసులో రిమాండులో ఉన్న విడదల గోపి బెయిలు కోసం హైకోర్టులో వేసిన పిటీషన్ను ఉపసంహరించుకున్నారు. బెయిలు కోసం కింది కోర్టును ఆశ్రయించనున్నామని, అందువల్ల హైకోర్టులో వేసి బెయిలు పిటీషన్లు ఉపసంహరించుకునేందుకు అనుమతి ఇవ్వాలని గోపి.

# తిరుమల సమాచారం

## వెంకన్న చెల్లెలు గంగమ్మకు టిటిడి సారె

### - గంగమ్మ ఆలయ అభివృద్ధికి అన్ని విధాలా సహకారం
### - టిటిడి ఛైర్మన్ నాయుడు, ఇఒ శ్యామలరావు

**తిరుమల,మే 10ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి స్వయాన చెల్లెలైన తిరుపతి తాతయ్యగుంట గంగమ్మకు ఆనవాయితీగా సారె తీసుకువచ్చి సమర్పించడం జరుగుతుందని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. తిరుపతి పరిసరాల ప్రాంతాల ప్రజల ఆచార వ్యవహారాలను, వారి జీవనవిధనాలు ప్రతిబింబించేలా అపురూపంగా తిరుపతి గంగమ్మజాతర



జరుగుతుందని అన్నారు. తాతయ్యగుంట గంగమ్మజాతరలో నాల్గవరోజు శనివారం సాయంత్రం అమ్మవారికి పసుపు, కుంకుమ, పూలు, చీర, రవికె, పండ్లుతో సారె తీసుకువచ్చి సమర్పించారు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు దంపతులు, టిటిడి ఇఒ శ్యామలరావు దంపతులు, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, శాంతారామ్, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, విఎస్ఒ సదాలక్ష్మి ఆలయ సాంప్రదాయంతో మంగళవాయిద్యాల నడుమ తిరుపతి గోవిందరాజస్వామి ఆలయం వద్ద నుండి సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి గంగమ్మ ఆలయం వద్ద తిరుపతి ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు, ఆలయ ఇఒ జయకుమార్‌కు అందజేశారు. త్వరలోనే 3.50కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయని ఇఒ తెలిపారు. అమ్మవారికి సారె సమర్పించిన టిటిడి ఛైర్మన్ నాయుడు దంపతులుకు, ఇఒ శ్యామలరావు దంపతులుకు గంగమ్మ ఆలయ అర్చకులు అమ్మవారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఉద్రిక్తతలకు బ్రేక్ పడినా తిరుమల తిరుపతిలో భద్రత పటిష్టం

### - అలిపిరి, విమానాశ్రయంలో భద్రతాదళాల నిఘా





**తిరుమల,మే 10ప్రభాతవార్తప్రతినిధి:** భారత్ –పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలకు, యుద్దానికి బ్రేక్ పడినా ప్రసిద్ద హిందూ పుణ్యక్షేత్రం తిరుమలతో బాటు తిరుపతి రేణిగుంటవిమానాశ్రయంలో భద్రత పటిష్టంగా అమలుచేస్తున్నారు. పూర్తిస్థాయిలో సిఐఎస్ఎఫ్ భద్రతా దళాలు, ఆక్టోపస్ బలగాలు, పోలీసులు డేగకళ్ళతో నిఘాను కొనసాగిస్తున్నారు. ముందుజాగ్రత్తగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రధానంగా తిరుమలకు చేరుకునే కీలకమైన అలిపిరి సప్తగిరి తనిఖీ కేంద్రం ప్రాంతంలో నిశితంగా తనిఖీలు చేస్తున్నారు. అనుమానం కలిగితే కొండకు వస్తున్న వారెవరు, ఎక్కడ నుండి వచ్చారు అనే వివరాలు రాబడుతున్నారు. ఇరుదేశాల సరిహద్దుల్లో శనివారం సాయంత్రం వరకు ఉద్రిక్తతలు తలెత్తడంతో తిరుమలలో భద్రతను పటిష్టంచేశారు. ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయం పరిసరాల్లో ఆక్టోపస్ దళాలు, ఏఆర్ పోలీసులు ఆయుధాలతో డేగకళ్ళతో పహరాకాస్తున్నారు. తిరుమలలోని జిఎన్‌సి టోల్‌గేట్, శ్రీవారి ఆలయం పరిసరాలు, యాత్రికుల వసతిసముదాయం 3వద్ద యాత్రికులు ఉన్నపుడు ఏదేని అవాంఛనీయసంఘటనలు జరిగితే ఎలా తప్పించుకోవాలి, ప్రాణాలు కాపాడుకోవడంపై విస్తృతంగా మాక్‌డ్రిల్ ద్వారా చూపించారు. తిరుమలకొండపై భద్రతా దళాలు నిరంతరంగా గస్తీ తిరుగుతున్నారు. పోలీసులు, విజిలెన్స్, ఆక్టోపస్ బలగాలు సంయుక్తంగా ఏరియా డామినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ గస్తీ ఆదివారంకూడా కొనసాగుతుందని పోలీసు వర్గాలు తెలిపాయి. అనుమానాస్పద వస్తువులు, బ్యాగ్ల తనిఖీలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ తనిఖీలు చేసి పటిష్టంగా భద్రతను అమలుచేస్తున్నారు. హైసెక్యూరిటీజోన్‌లో తిరుమల భద్రతను పెంచారు. అలాగే తిరుపతి యాత్రాస్థలంలో కూడా భద్రతా దళాలు, ఏఆర్ పోలీసులు, నిరంతరం గస్తీ ఉన్నారు. టిటిడికి చెందిన కార్యాలయాలు, వసతి సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాలు వద్ద భద్రతను డేగకళ్ళతో ఉంచారు. రేణిగుంట విమానాశ్రయంలోనూ భద్రతా దళాలు మాక్‌డ్రిల్ నిర్వహించి శనివారం ఉదయంనుండి మద్యాహ్నం వరకు ప్రాణాలు కాపాడుకోవడంపై అవగాహన కల్పించారు. తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో జిల్లాయంత్రాంగం జిల్లా వ్యాప్తంగా భద్రతను పటిష్టం చేశాయి.

## అలిపిరిలో ప్లాస్టిక్ సీసాల కుప్పలు

**తిరుమల,మే 10ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకొండపై పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్‌నీళ్ళ సీసాలు నిషేధం ఉండటంతో ప్రతిరోజూ వస్తున్న యాత్రికుల నీళ్ళసీసాలు అలిపిరిలో అనుమతించడంలేదు. దీంతో యాత్రికులు తమవెంట తీసుకువస్తున్న ప్లాస్టిక్‌నీళ్ళసీసాలను భద్రత సిబ్బంది తనిఖీ కేంద్రం వద్ద తీసిపడేస్తున్నారు. ఉదయం గంట సమయంలోనే ప్లాస్టిక్



నీళ్ళసీసాలు కుప్పలుగా పేరుకుపోతున్నాయి. గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వస్తువులు, ప్లాస్టిక్ కవర్లు నిషేధించింది. అయితే సామాన్యభక్తులు తాగునీటి సమస్య పరిష్కారంలో గాజుసీసాలు అమలుచేసింది. వీటివల్ల కొన్ని ఇబ్బందులు కలుగుతున్నాయి. అంతేగాక కొండపై గాజుసీసానీళ్ళబాటిల్ 55రూపాయల నుండి 65రూపాయల వరకు విక్రయిస్తున్నారు. నీటిని వాడుకున్న తరువాత ఖాళీగాజుసీసా ఏ దుకాణంలో ఇచ్చినా 30రూపాయలు తిరిగి భక్తులకు చెల్లిస్తున్నారు. దీనివల్ల లీటరునీళ్ళు 30రూపాయలుకు భక్తులు కొని తాగడం ఇబ్బందికరంగా మారింది. అలిపిరిలో ప్రోగవుతున్న టన్నుల కొద్దీ ప్లాస్టిక్ నీళ్ళసీసాలు కాంట్రాక్టర్లకు వరంగామారింది.

## ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత

### - టిటిడి ఉద్యోగులకు ఉచితంగా హెల్మెట్లు అందజేసిన ఛైర్మన్ నాయుడు

**తిరుమల,మే 10ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతిరోజూ లక్షమందివరకు భక్తులు తిరుమలకు వస్తున్నావారికి చిన్నపాటి అసౌకర్యం, ఇబ్బందులు కలగకుండా సేవలందిస్తున్న ఉద్యోగుల సంక్షేమానికి టిటిడి దర్మకర్తలమండలి, అధికారులు ప్రాధాన్యతనిస్తున్నట్లు టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. నిత్యం తిరుమలలో విధుల నిర్వహణకు తిరుపతి నుండి తిరుమలకు



రావడం, తిరిగి తిరుపతికి వెళ్ళడం చేస్తున్న ద్విచక్రవాహనదారులైన ఉద్యోగుల భద్రతకోసం హెల్మెట్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగులు ఘాట్‌రోడ్లలో ప్రయాణసమయంలో భద్రతకోసం తగిన చర్యలు తీసుకుంటూ, వారికి హెల్మెట్లు అందించామన్నారు. తొలివిడతలో 5లలక్షల రూపాయలు విలువైన 555హెల్మెట్లు గుంటూరుకు చెందిన జలాది రఘురామ్, ఢిల్లీకి చెందిన కెసిఎన్ హెల్మెట్ల తయారీ సంస్థ అధినేత నవీన్ ముందుకువచ్చారన్నారు. 15రోజుల్లో మరో 500 హెల్మెట్లు వస్తాయని చెప్పారు. వీటిని పరిశీలించి బాగున్నాయని తెలిపితే మరో ఐదువేల హెల్మెట్‌లు అందజేస్తారని ఛైర్మన్ నాయుడు తెలిపారు. శనివారం ఉదయం తిరుమలలోని ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఛైర్మన్ బిఆర్‌నాయుడు, విజిలెన్స్ సిఎస్ఒ ఎస్వీవి రామ్‌కుమార్, సురేంద్ర, బోర్డుసభ్యుడు శాంతారామ్‌తో కలసి పంపిణీ చేశారు.

# భూగర్భజలాల పరిరక్షణే తక్షణ కర్తవ్యం

తిరుమల రావు

రాష్ట్రవ్యాప్తంగా భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. ఎండలు మండిపోతుండడంతో తాగునీటి, సాగునీటికి ఇబ్బంది పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. భూగర్భజలాల పరిరక్షణకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రానున్న రోజుల్లో మరింత నీటి ఎద్దడి తప్పేలా లేదు. ఇప్పటికే సాగు,తాగు, అన్ని అవసరాలకు బోరుబావుల నుంచి నీళ్లను విచ్చల విడిగా తోడుతుండడంతో భూగర్భ జలాలు గతంలో ఎన్నడూ లేనివిధంగా వేగంగా పడిపోతున్నాయి. భూగర్భజలాల పరిరక్షణ విషయంలో ప్రభుత్వంతో పాటు ప్రతి ఒక్కరి బాధ్యత ఉంది. భూగర్భజల్లాల పరిరక్షణకు ఇంకుడు గుంతలు నిర్మించడమే ఏకైక మార్గం. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత నిర్మించేలా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటే నీటి మట్టాలు పడిపోయే పరిస్థితి ఉండదు. వర్షపు నీటిని ఒడిసిపట్టుకుంటే రానున్న రోజుల్లో కూడా నీటి ఎద్దడి అంటూ ఉండదు. మరోవైపు గ్రామాల మొదలు పట్టణాల వరకు ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టకపోగా, విచ్చిల విడిగా బోరుబావులు తవ్వుతున్నారు. ఈ బోరు బావుల నుంచి విచ్చలవిడిగా నీటిని తోడేస్తున్నారు. దీంతో నీటి సమస్యలు తీవ్రతరం అవుతుంది. గత యేడాది డిసెంబరు నెలలో 6.7 మీటర్ల లోతుగా ఉన్న రాష్ట్ర సగటు భూగర్భ జలమట్టాలు క్రమంగా తగ్గతూ ఈ సంవత్సరం జనవరిలో 1.46 మీటర్లు, ఫిబ్రవరి నెలలో 8.88 మీటర్లు, మార్చినెలలో 9.91 మీటర్ల లోతుకు పడిపోయాయి. ఏప్రిల్ నెలల మరింత దిగజారి 10.17 మీటర్లకు చేరుకున్నాయి. డిసెంబర్ నెలతో పోల్చిచూస్తే ఏప్రిల్ నెలనాటికి ఏకంగా 3.47 మీటర్ల మేర భూగర్భ జలమట్టాలు పడిపోవడం ఆందోళన కలిగిస్తుంది. మార్చినెలతో పోల్చితే ఏప్రిల్ నాటికి కేవలం నెల రోజుల వ్యవధిలో 0.23 మీటర్ల మేర నీటి మట్టాలు పడిపోయాయి. ప్రస్తుత మే నెలలో మరింత అధ్వాన్న స్థితికి చేరుకున్నాయి. చాలా ప్రాంతాలలో బోరుబావులు ఎండిపోయాయి. తాగు నీటికి, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండలు మరింత ముదిరి రాబోయే రోజుల్లో తాగు, సాగు నీటి అవసరాలు, ఇతర అవసరాలు పెరిగి వేసవి ముగిసేలోగా భూగర్భ జల మట్టాలు గతంలో ఎన్నడూ లేని విధంగా మరింత పడిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. భూగర్భ జలవనరుల శాఖ ఏప్రిల్లో రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో భూగర్భ జలాల స్థితిగతులను పరిశీలించి నివేదిక తయారు చేసింది. జలవనరుల శాఖ రూపొందించిన నివేదికలో పలుకీలక అంశాలు వెల్లడించింది. రాష్ట్రంలో భూగర్భ జలాల పరిస్థితి రోజురోజుకు పడిపోతున్నాయని, ఇదే పరిస్థితి



కొనసాగితే రానున్న రోజుల్లో నీటికి ఎన్నడూ లేనివిధంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి ఏర్పడవచ్చునని, ముందస్తు చర్యలు తీసుకుని, నీటిని సంరక్షించుకోకపోతే మరింత కష్టాలు తప్పవని సూచించింది. వర్షాలు కురిసినప్పుడు నీటిని సంరక్షించుకునే విషయంలో తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రధానంగా నీటి సంరక్షణకు ఇంకుడు గుంతల నిర్మాణం ఏకైక మార్గం, అంతేకాకుండా నీటిని వృధాకానియ్యకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. నీటి సంరక్షణకు చర్యలు తీసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని, నిర్లక్ష్యం వహిస్తే ప్రతి సంవత్సరం నీటి సమస్యలు ఎదుర్కొకతప్పదు. రాష్ట్ర వ్యాప్తంగా భూగర్భజల శాఖ తయారు చేసిన నివేదికలో రాష్ట్రంలోనే అత్యధికంగా వికారాబాద్ జిల్లాలో 16.6 మీటర్ల లోతుకు భూగర్భ జల మట్టాలు పడిపోయాయని స్పష్టంగా పేర్కొంది. ఇక జగిత్యాల జిల్లాలో అత్యల్పంగా 5.57 మీటర్లలోతులో నీరు అందుబాటులో ఉందని పేర్కొంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో భూగర్భ జలాలలను సగటుగా 0-5 మీటర్లు, 5-10 మీటర్లు, 10 మీటర్లపైన లోతు అంటూ మూడు విభాగాలుగా విభజించారు. భూగర్భ జలాలు 5 మీటర్ల లోపు లోతుల్లో ఉంటే నీటి మట్టాలు సురక్షిత స్థాయిలో ఉన్నట్టు తేలుస్తారు. రాష్ట్రంలో మొత్తం 33 జిల్లాలుండగా, ఒక్క జిల్లాలో కూడా 0-5 మీటర్ల లోతులో లేవు. అంటే ఏ జిల్లాలో నీటి మట్టాలు సురక్షితంగా పరిస్థితుల్లో లేవన్నమాట. భూగర్భ జలాలు సంరక్షణ లేకపోవడంతో పరిస్థితి ఎంత దారుణంగా తయారైందో నివేదిక చూస్తే తెలిసిపో తుంది. మరోవైపు రాష్ట్రంలో 33 జిల్లాలో 18 జిల్లాలో 5-10మీటర్ల లోతులో నీటి మట్టాలు ఉన్నాయి. 11 జిల్లాలో 10 నుంచి 15 మీటర్ల లోతులో ఉగన్యఇ. నాలుగు జిల్లాలో 15 మీటర్ల లోతులో నీటి మట్టాలు ఉన్నాయి. ఈ నాలుగు జిల్లాల పరిస్థితి దయనీయంగా మా రింది. 15 జిల్లాల్లో సైతం ఇలాంటి పరిస్థితులు నెలకొని ఉన్నాయి. గతఏడాది ఏప్రిల్ నెలతో పోల్చి చూస్తే ఈ ఏడాది ఏప్రిల్ నెలలో రాష్ట్రంలోని 16 జిల్లాల్లో భూగర్భ జలమట్టా ల్లో భారీగా పడిపోయియి. భూగర్భ జలాలు గత కొన్ని సంవ త్సరాలతో పోల్చి చూస్తే తగ్గుకుంటూ పోతున్నాయి. ప్రస్తుతం సంవత్సరం 3452 చదరపు కిలోమీటర్ల లోతుల్లోకి చేరుకుం ది. అత్యంత లోతుల్లో అంటే 20మీటర్లకి మించిన లోతు ఉన్న జలాలున్న ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయి. మే 2024 తో పోల్చితే ఏప్రిల్ 2025లో, 1,262 చదరపు కిలోమీటర్ల నుంచి 3.452 చదరపు కిలోమీటర్ల మేర పెరిగింది. 2015-2024తో పోల్చి చూస్తే మాత్రం ఏప్రిల్లో అత్యంత లోతుల్లో భూగర్భ జలాలున్న ప్రాంత విస్తీర్ణం 5,527 చదరపు కిలోమీటర్ల నుంచి4,714 చదరపు కిలోమీటర్లకు తగ్గింది.రాష్ట్రంలో పలుజిల్లాల్లో ప్రమాదకర స్థాయిలోనీటి మట్టాలు పడిపోయాయి. రంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాలోవికారాబాద్ యాదాద్రి జిల్లాల్లోని ఉత్తర, దక్షిణ ప్రాంతాలు, నాగర్‌కర్నూలు, జిల్లాలోని దక్షిణాది ప్రాంతాలు, నిర్మల్, సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లోని పశ్చిమ ప్రాంతాలు, భూపాలపల్లి జిల్లాలోని ఉత్తర, భద్రాద్రి జిల్లాలోని ఆగ్నేయ ప్రాంతాల్లో అత్యంత ప్రమాదకర స్థాయికి భూగర్భ జలమట్టాలు పడిపోయాయని భూగర్భజల శాఖ తన నివేదికల్లో వెల్లడించింది. ఈ ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు 15-20 మీటర్ల మధ్య, కొన్నిచోట్ల 20 మీటర్లకన్నా లోతుకు వెళ్లాయి. రాష్ట్రంలో 172 మండలాల్లో 0.01 మీటర్ల నుంచి 25.80 మీటర్ల వరకు గణనీయంగా క్షీణించాయి. 41 మండలాల్లో 0.5 మీటర్ల వరకు, 34 ముండలాల్లో 0.5 మీటర్ల నుంచి మీటర్ల వరకు, 43 మండలాల్లో 12 మీటర్ల మేర, 54 మండలాల్లో 2 మీటర్లకు పైగా పడిపోయాయి. హైదరాబాద్ నగరానికి నగరానికి నీటి ఎద్దడి పొంచి ఉంది. ఎండలు మండుతుండడంతో రిజర్వాయర్లలో నీటి మట్టాలు పడిపోతున్నాయి. గడిచిన 15 రోజులుగా వివిధ రిజర్వాయర్‌లలో నీటి మట్టాలు ఘణనీయంగా తగుముఖం పట్టాయి. ప్రజలకు తాగునీటిలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు రిజర్వాయర్ల వద్ద పంపింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు చేపట్టారు. నాగార్జునసాగర్‌లో నీటిమట్టం 510 అడుగులకు పడిపోయినప్పుడు అత్యవసర పంపింగ్ చేపట్టేందుకు సిద్ధం చేస్తున్నారు. హైదరాబాద్ నగర ప్రజల అవసరాలకు రోజుకు 581 మిలియన్ గ్యాలెన్ల నీరు అవసరం అవుతుండగా, ప్రస్తుతం కృష్ణా మూడు దశల నుంచి 270 ఎంజిడిల నీటిని తీసుకుంటుండగా, గోదావరి ప్రాజెక్టు ఎల్లంపల్లి నుంచి ప్రతి రోజు 183 ఎండిజిటల నీటిని తీసుకుంటున్నారు. గత యేడాది నాగార్జున సాగర్ నీటి మట్టం 505 అడుగులు ఉండగా, శ్రీశైలం వద్ద 808 అడుగులు ఉండగా, ప్రస్తుతం నాగార్జునసాగర్ వద్ద 514, శ్రీశైలం వద్ద 815 అడుగులు ఉన్నాయి. సాధారణంగా వర్షాలు కురిసి సాగర్‌లోకి కొత్త నీటి రావడం ఆగస్టు నుంచి ప్రారంభం అవుతుంది. ఈ నేపథ్యంలో వర్షాలు కురిసి, పరిస్థితులు మెరుగుపడే వరకు పంపింగ్ ప్రక్రియ తప్పేలా లేదు. 2016లో పంపింగ్ ప్రక్రియను చేపట్టారు. ఆ తరువాత 2024లో జూన్‌లో, ప్రస్తుత సంవత్సరం మే నెలలో పంపింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. ●

రాష్ట్రంలో మొత్తం 33 జిల్లాలుండగా, ఒక్క జిల్లాలో కూడా 0-5మీటర్ల లోతులోలేవు. అంటే ఏజిల్లాలో నీటి మట్టాలు సురక్షితంగా పరిస్థితుల్లో లేవన్నమాట. భూగర్భ జలాలు సంరక్షణ లేకపోవడంతో పరిస్థితి ఎంత దారుణంగా తయారైందో నివేదిక చూస్తే తెలిసిపో తుంది. మరోవైపు రాష్ట్రంలో 33 జిల్లాలో 18జిల్లాలో 5-10మీటర్ల లోతులో నీటి మట్టాలు ఉన్నాయి. 11 జిల్లాలో 10 నుంచి 15 మీటర్ల లోతులో ఉగన్యఇ. నాలుగు జిల్లాలో 15 మీటర్ల లోతులో నీటి మట్టాలు ఉన్నాయి. ఈ నాలుగు జిల్లాల పరిస్థితి దయనీయంగా మారింది. 15 జిల్లాల్లో సైతం ఇలాంటి పరిస్థితులు నెలకొని ఉన్నాయి. గతఏడాది ఏప్రిల్ నెలతో పోల్చి చూస్తే ఈ ఏడాది ఏప్రిల్ నెలలో రాష్ట్రంలోని 16 జిల్లాల్లో భూగర్భ జలమట్టాల్లో భారీగా పడపోయియి. భూగర్భజలాలు గత కొన్ని సంవత్సరాలతో పోల్చి చూస్తే తగ్గుకుంటూ పోతున్నాయి. ప్రస్తుతం సంవత్సరం 3452 చదరపు కిలోమీటర్ల లోతుల్లోకి చేరుకుంది. అత్యంత లోతుల్లో అంటే 20మీటర్లకి మించిన లోతు ఉన్న జలాలున్న ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయి. మే 2024 తో పోల్చితే ఏప్రిల్ 2025లో, 1,262 చదరపు కిలోమీటర్ల నుంచి 3.452 చదరపు కిలోమీటర్ల మేర పెరిగింది. 2015-2024తో పోల్చి చూస్తే మాత్రం ఏప్రిల్‌లో అత్యంత లోతుల్లో భూగర్భ జలాలున్న ప్రాంత విస్తీర్ణం 5,527 చద రపు కిలోమీటర్ల నుంచి4,714 చదరపు కిలోమీటర్లకు తగ్గింది.రంగారెడ్డి,కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాలో వికారాబాద్ యాదాద్రి జిల్లాల్లోని ఉత్తర,దక్షిణ ప్రాంతాలు, నాగర్‌కర్నూలు, జిల్లాలోని దక్షిణాది ప్రాంతాలు, నిర్మల్,సిద్ధిపేట, సిరిసిల్ల జిల్లాల్లోని పశ్చిమప్రాంతాలు, భూపాలపల్లి జిల్లాలోని ఉత్తర, భద్రాద్రి జిల్లాలోని ఆగ్నేయప్రాంతాల్లో అత్యంత ప్రమాదకర స్థాయికి జలమట్టాలు పడిపోయాయని భూగర్భజలశాఖ తననివేదికల్లో వెల్లడించింది.

# నవ 'సిందూరం'..

ఎ.వి.వి ప్రసాద్

న్యూఢిల్లీ

ఏ నోట విన్నా.. ఏ చోట ఉన్నా ఇప్పుడు అంతా 'సిందూర' మే. సిందూర వర్ణ కాంతులే దేశంలో అడుగడుగునా ఆవిష్కృతమవుతున్నాయి. ఆ సిందూరం వెనుక ముష్కరులను అణిచివేసే ప్రతీకారం ఉంది, పక్క వారికోసం ప్రాణాలిచ్చే ప్రేమానురాగాలూ ఉన్నాయి. ప్రజలను పీడించే రక్కసులను అంతమొందించడానికి దుర్గాదేవిఅవతరించి లోకానికి శాంతి అందించిందని పురాణాలలో విన్నాం. ఇప్పుడు 'సిందూరం' కూడా ఆ బాధ్యతే తలకెత్తుకొంది. సిందూరం భారతీయ మహిళకు ఒక సెంటిమెంట్. నొసట ఆ కాంతి లేకుండా ఏ నవ వధువు, ఏ గృహిణి కనిపించదేమో! సిందూరం మహిళలకు రక్షాబంధనం. అందుకే.. ఆ పేరుతోనే ఉగ్ర ముష్కరులను చీల్చి చెండాడే బృహత్తర కార్యక్రమం ఆరంభమైంది. ఏప్రిల్ 22న పహల్గాంలో కొందరు పాక్ ప్రేరేపిత ఉగ్ర ముష్కరులు జరిపిన ఊచకోత అనంతరం కేవలం సంతాప సందేశాలకు పరిమితం కాకుండా, మరోసారి ఎటువంటి ఉగ్రవాది భారత్ వైపు కన్నెత్తి చూడకుండా స్పష్టమైన సమాధానం చెప్పింది కేంద్ర ప్రభుత్వం. దాడి ఘటన జరిగి రెండు వారాలు తిరిగే లోగా గత మంగళవారం ( 6,మే ) అర్ధరాత్రి తర్వాత ఎవరూ ఊహించని విధంగా, ఎక్కడినుంచైతే పహల్గాం దాడికి వ్యూహం తయారయిందో సరిగ్గా అక్కడే ఉగ్ర ముష్కరులను అంతమొందించే ప్రక్రియకు భారత్ సైనికులు శ్రీకారం చుట్టారు. అదే 'ఆపరేషన్ సిందూర్'. 26 మంది పర్యాటకులను వారి భార్యల నుంచి విడదీసి, వారు చూస్తుండగానే,వారు విలపిస్తూండగానే తమ తుపాకులకు బలి చేసిన ముష్కరులను' సిందూరం' ఏరి పారేసింది. వందమందో, రెండువందలమందో.. ఆ లెక్కలు పక్కన పెడితే, మొత్తానికి పెద్ద సంఖ్యలోనే 'శత్రువు' ను మట్టుబెట్టింది. అయితే ఈ సంహార కాండ అక్కడితో పూర్తి కాలేదు. మొత్తం ఉగ్ర వ్యవస్థనే వేళ్లతో పెకలించే ప్రక్రియ కూడా అప్పుడే ఆరంభమయింది. అది కొనసాగుతూనే ఉం టుంది. ఆ 'సిందూరం' మెరుస్తూనే ఉంటుంది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత శత్రువు ఊహించని విధంగా దెబ్బ కొట్టడమేగాక, పాక్‌తో యుద్ధ వాతావరణం నెలకొన్న పరిస్థితిలో దేశ పౌరులను కూడా అందుకు మానసికంగా సిద్ధం చేసింది ప్రభుత్వం. మాక్‌డ్రిల్స్ అందులో భాగమే.ప్రజలందరూ ప్రభుత్వ భవిష్యత్ కార్యాచరణను ఊహించుకొంటూండగానే, కేవలం 24 నిముషాల వ్యవధిలో పాక్‌లోని 9 ఉగ్ర స్థావరాలను సైన్యం నేలమట్టంచేసింది. ఉగ్రదాడి ఎప్పుడు జరిగినా మన సైనికులు తట్టుకొని నిలబడడమే గాక తగినవిధంగా పాక్‌కు బుద్ధిచెబుతూనే వస్తున్నారు. అయితే ఈ సారి 'సిందూరం' మరింత కొత్త కాంతిని ప్రసరిస్తోందనిపిస్తుంది. దేశ ప్రజలందరిలో సెంటిమెంట్‌తో పాటు, దేశభక్తిని కూడా మరింత పెంచుతోంది. యువకులే కాదు, దేశంలోని ప్రతి వ్యక్తి ముష్కర మూకలను దునుమాడడానికి 'సిందూరం' ధరిస్తున్నారు.



యుద్ధం

ప్రతి వ్యక్తి ఒక సైని కుడులా మారుతామని, ఉగ్రవాదులను అంత మొందిస్తామనీ ప్రతిజ్ఞ చేస్తున్నారు. పాఠశాలల్లో చదివే బాలబాలికలు సైతం వీర సైనికులకు సంఘీభావంగా రోడ్లపైకి వచ్చి ప్రదర్శనలు జరుపుతున్నారు. తాము కూడా సైనికులం అవుతామంటున్నారు. కుల, మతాతీతంగా దేశంలోని ప్రజలందరూ ఒకే బాటలో కదులుతున్నారు. పహల్గాం దాడిలో తండ్రిని కోల్పోయిన తనూజ్ కుమార్ సత్పతి అనే తొమ్మిదేళ్ల బాలుడు ఉగ్ర స్థావరాలపై సైనిక చర్య ఘటనకు స్పందిస్తూ 'భారత సైన్యంలో చేరి ఉగ్రవాదులను అంతం చేయడానికి నేనూ పోరాడుతా' అని అన్నాడంటే పిల్లల్లో సైతం ఉగ్రవ్యతిరేక ప్రతీకారేచ్ఛ ఎలా ఉన్నదో, దేశభక్తి ఎలా పొంగి పొర్లుతున్నదో అర్థమవుతుంది. అటువంటి బాలలు ఒకరిద్దరు కాదు, దేశంలో అనేక ప్రాంతాల నుంచి అటువంటి 'బాలవాక్కు' వినిపించింది. రేపు అదే బ్రహ్మవాక్కుగా కూడా మారుతుంది. ఒడిశాలోని బాలాసోర్ కు చెందిన ఆ బాలుడు స్ఫూర్తిగా ఎందరో 'సిందూరం' ధరించారు. అదే ప్రతిజ్ఞ చేశారు.'మా సైన్యాన్ని చూసి మేం గర్వపడుతున్నాం, ఆ సైన్యంలో మేమూ భాగస్వాములవుతాం' .. అందరి నోటి నుంచి ఇదే మాట ఇప్పుడు వినిపించడంప్రజల్లో దేశభక్తి ఎలా పెరిగిందో చెప్పడానికి నిదర్శనం. భారతీయ సంప్రదాయంలో వివాహిత మహిళలకు సిందూరం ఎంత ముఖ్యమైనదో తెలియజెప్పే విధంగా, ఆ సిందూరాన్ని మహిళలకు దూరం చేసిన ముష్కరులను అంతమొందించడానికి ప్రధానిమోడీ ఈ ఆపరేషన్ కు'సిందూర్' అనే పేరు పెట్టడాన్ని కూడా దేశమంతా ఎంతో అభినందించింది. అంతేకాదు.. సిందూర్ ఆపరేషన్ మొదలైనప్పటినుంచి జన్మిస్తున్న పిల్లలకు కూడా దేశంలో పలుచోట్ల అదే పేరు పెడుతున్నారట. మొదటి రోజునే 62 మంది ఆడపిల్లలకు సిందూరి అనీ,మగ పిల్లలకు సిందూర్ అనీ పేర్లు పెట్టినట్లు వార్తలు వినిపించాయి. అంతేకాదు.. కొన్ని ఇతర మతాల మహిళలు కూడా నుదుట సిందూరం ధరించి కనిపించారట. కర్ణాటక సిఎం సిద్దరామయ్య ఆ మర్నాడు బెంగళూరులో మీడియా సమావేశానికి సిందూరం ధరించి వచ్చారు. ఎప్పుడూ తిలకమైనా పెట్టుకోని ఆయన ఇప్పుడు సిందూరం ధరించి కనిపిస్తున్నారు. సిందూర వర్ణం దుస్తులు ధరించేవారు కూడా ఇప్పుడు ఎక్కడ చూసినా అధికమయ్యారు. ఇంకొంచెం ఆసక్తి కరమైన విషయం.. సిందూర్ టైటిల్ ను 30 మంది తెలుగు సినీ నిర్మాతలు వెంటనే రిజిస్టర్ చేయించారట. ఆ టైటిల్ కోసం సినీ నిర్మాతలలో కూడా ఇప్పుడు గట్టిపోటీ కనిపిస్తోందంటే ఆ పదానికి ఉన్న ప్రభావం ఎంతటిదో అర్థమవుతుంది. చిటికెడంత సిందూరం ఆడపడుచుకు ఆకాశమంత భరోసా ఇస్తుంది. అది పాపిట మధ్య చేసుకునే అలంకరణే కాదు.. ఇక దేశంలోని ప్రజలందరికీ రక్షా రేఖ కూడా.. ●

# హింసకు సూత్రధారి!

గన్ని మోహన్

పాకిస్థాన్

సరిహద్దుల్లో భీకరపోరు. శాంతి సామరస్య వాతావరణంలో కొనసాగాల్సిన ఇరుగుపొరుగుదేశాలు ఇపుడు చావోరేవో తేల్చుకునే దశకు చేరాయి. గడచిన మూడురోజులుగా పాకిస్థాన్, భారత్ సరిహద్దుల్లో జరుగుతున్న హింస ఇదే. ఇందుకు కారణం ఎవరు? ఎందుకు ఈపరిస్థితులు ఇలాగే కొనసాగుతున్నాయి?ఉద్రిక్తతలను తొలుత రెచ్చగొట్టింది ఎవరు? ఇవన్నీ పరిశీలించుకుంటే కరుడు గట్టిన మత ఛాందస వాదం, ప్రభుత్వంమొత్తాన్ని తన అదుపులోకి ఉంచుకున్న మిలిటరీ చీఫ్ అనిచెప్పక తప్పదు. జమ్ముకాశ్మీర్, గుజరాత్, పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల వెంబడి సుమారు 3300 కిలోమీటర్లమేర విస్తరించిన ఈ సరిహద్దు వెంబడి చొరబాట్లు, మిలిటెంట్ కార్యకలాపాలు ఈనాడే కొత్తగా జరుగుతున్నవికాదు. పొరుగు దేశం ఆర్మీ ప్రోత్సాహం, అండదండలతో యధేచ్ఛగా కొనసాగించిన ఈ మిలిటెంట్ కార్యాచరణ గడచిన పదేళ్లలో కట్టుదిట్టం చేయడంతో గణనీయంగా తగ్గింది. తిరిగి రెండుమూడేళ్లనుంచి మళ్లీ పెరుగుతూ వచ్చింది. అందుకు కారణం పొరుగుదేశం పాకిస్థాన్‌లో మారుతున్న మిలిటరీ చీఫ్‌లేనని చెప్పాలి. ప్రస్తుత మిలిటరీ చీఫ్ సయ్యద్ ఆసిమ్ మునీర్ అహ్మద్‌షా ఒకప్పటి ఇంటిలిజెన్స్ చీఫ్‌గా పనిచేసిన అధికారి. అంచలంచెలుగా తన వ్యూహాలను పదునుపెట్టుకుంటూ మారుతున్న ప్రభుత్వాలకు అనుగుణంగా ఎదుగుతూ వచ్చాడు. నియంతృత్వం, జీహాదీ వైఖరి,మొత్తం సాయుధ బలగాలపైపట్టు సాధించేందుకు ఎంతస్థాయికైనా వెళ్లిపోయే మునీర్ ఇమ్రాన్ హయాంలో అతితక్కువ కాలం పని చేసాడు.అప్పటిప్రధాని ఇమ్రాన్ భార్య బుస్రా బీబీ అవినీతికార్యకలాపాలను బయటపెట్టేందుకు ప్రయత్నించడంతో అప్పటి మిలిటరీ చీఫ్‌క్వామర్ జావేద్ బాజ్వా ఐఎస్ఐచీఫ్‌గా తొలగించారు. తిరిగి సంకీర్ణ ప్రభుత్వం రావడం, ఇమ్రాన్‌కు వ్యతిరేకంగా పనిచేసిన ఘనత సాధించడంతో షెహబాజ్‌షరీఫ్ ప్రభుత్వం కీలక పదవులన్నింటినీ అప్పగించడంతోపాటు ఏకంగా ఆర్మీచీఫ్ పదవినే కట్టబెట్టింది. భారత్‌పై నిరంతరం అక్కసు వెళ్లగక్కే పాకిస్థాన్‌కు పాక్ ఆక్రమిత కాశ్మీర్ తోపాటు ఇపుడు భారత్ అధీనంలో ఉన్న కాశ్మీర్ ను కూడా చేజిక్కించుకోవాలన్న లక్ష్యమే కనిపిస్తుంది. ఈవిధంగా 1971లో జరిగిన యుద్ధం కానీ, 1965లో జరిగిన భీకర దాడులు కాని ఆనాటి ఆర్మీచీఫ్‌ల ఆధ్వర్యంలో జరిగినవే. భారత్‌పై దాడులను ప్రోత్సహించడంలో ఆసిమ్ మునీర్ హస్తం పరోక్షంగా పనిచేస్తుందన్నది భారత నిఘా సంస్థలు కూడా గుర్తించాయి. 2019 ఫిబ్రవరి 14వ తేదీ ఆర్మీ కాన్వాయ్‌పై పేలుడు సామగ్రితో ఉన్న ఒక కారులోని ఆత్మాహుతి జీహాదిలు పేల్చి వేయడంతో 40 మంది కిపైగా మన సైనికులు ప్రాణత్యాగంచేసారు. ఈ ఘాతుకానికి కుట్రలు చేసిన ఆదిల్ అహ్మద్‌ధర్ నేతృత్వం వహించినా తదనంతర గాలింపుల్లో అతడితోపాటు ఆరుగురు హతమయ్యారు. అయితే ఈ కాన్వాయ్‌పేలుడుకు



ఆసిమ్ మునీర్

సంబంధించిఅప్పటి ఐఎస్ఐ చీఫ్‌గాఉన్న ఆసిమ్ మునీర్ ప్రత్యక్ష, పరోక్ష హస్తం ఉందనేది నిర్వివాదాంశం. బాహ్యప్రపంచానికి జైషేముహ్మద్ ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పేర్కొంటున్నా కర్త, కర్మక్రియ అంతా కూడా మునీర్ కనుసన్నల్లోనే జరిగింది.కాశ్మీర్ మన జీవనాడి అని అది ఎప్పటికీ పాకిస్థాన్ భూభాగంలోనిదేనని, మన కాశ్మీర్ ముస్లిం సోదరులను మనం పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని, అందుకు పాకిస్థాన్ నిరంతరం సంపూర్ణ మద్దతునిస్తూంటుందని చేసిన ప్రసంగాలే సరిహద్దుల్లో చొరబాట్లకు, పాక్‌సైన్యం కాల్పులకు దారితీసిందన్నది నగ్నసత్యం.ఇందుకు ఆర్మీచీఫ్‌గా ఆసిమ్ మునీర్ కనుసన్నల్లోనే ఇదంతా జరిగింది. ఇప్పుడు మొత్తం 11పైగా ఉన్న మిలిటరీ, వైమానిక, నావికా స్థావరాలపై దాడులకు ఉపక్రమించే వ్యూహం కూడా ప్రస్తుత పాక్ ఆర్మీచీఫ్ దే. ఖురాన్‌ను అలవోకగా పఠించగలిగే నైపుణ్యం ఉన్న మునీర్ ముందునుంచి ఇస్లామిక్‌భావజాలం పుణికిపుచ్చుకున్న వ్యక్తి. మిలిటరీలో అంచలంచెలుగా ఎదుగుతున్నా కాశ్మీర్‌పైనే తన ధ్యాసనంతా పెట్టినట్లు తెలుస్తోంది. ఆర్మీచీఫ్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటినుంచి కూడా సరిహద్దుల్లో కాల్పులు సంఘటనలు పెరిగాయి. మిలిటెంట్లు చొరబడేందుకు విఫలయత్నాలు ఎక్కువ జరిగాయి. తాజాగా పహల్గాంవ్ ఉదంతంతో ఇక భారత్ ఓర్పు,సహనం పరీక్షించిన పాక్ గుణపాఠం చెప్పేందుకు సిద్ధం కావడంవల్లనే నేటి భీకర దాడులు. ఏతావాతా చెప్పాలంటే వీటన్నింటికీకేంద్ర బిందువు, మూల కారకుడు వివాదాస్పద మిలిటరీ చీఫ్ ఆసిఫ్‌మునీర్ అని నిస్సందేహంగా చెప్పాల్సిందే. సింధుజలాల ఒప్పందం తాత్కాలిక నిలిపివేతకు అయినా నేటి హింసాత్మక ఉద్రిక్తతలకు మూలకారణం కూడా ఆయనేనని భారత్ గాఢంగా విశ్వసిస్తోంది. ఎంత మత ఛాందసవాదంతోను, జమ్ముకాశ్మీర్‌ను సొంతం చేసుకోవాలని కుట్రలుచేసినా భారత్‌ముందు మాత్రం ఈ ఆటలుసాగవు. భారత్‌ఎంతమాత్రం సాగనీయదు కూడా. అయినాకూడా ఇదే హింసాత్మక ప్రవృత్తితో పాకిస్థాన్‌వ్యవహరిస్తోంది. అంతర్జాతీయ వేదికలపైనా భారత్‌ను విమర్శించబోయి ఘోర అవమానాలు పాలవుతున్నప్పటికీ తన వైఖరినిమాత్రం వీడటంలేదు. ఉగ్రవాదులు, ఉగ్రస్థావరాలు, ఉగ్ర కార్యకలాపాలకు నిధుల సాయం అందించడంలో ఆధారాలతోసహాభారత్ ప్రకటించినప్పటికీ ఈ దేశ వైఖరి మారలేదు. వాస్తవానికి పాకిస్థాన్‌లో 33 ఏళ్లపాటు సైనిక పాలనే జరిగింది దీనివల్లనే ఈ కరడు గట్టిన వాదం అనేది దేశం మొత్తం పాకిపోయింది. బాధ్యతలుచేపడుతున్న మిలిటరీ ఉన్నతస్థాయి అధికారులు కూడా ఇదే వైఖరితో ఉండటంతో ప్రత్యేకించి భారత్‌పట్ల కుట్రపూరిత భావనతోనే కొనసాగుతుండటం వల్లనే అభివృద్ధి కనుమరుగయి అరాచకం ప్రబలిపోయింది. మొత్తంగా చూస్తే ఇప్పుడు జరుగుతున్న వివాదానికి వివాదాస్పద అధికారి అన్న ట్యాగ్‌లైన్ సాధించిన ఆసిఫ్ మునీర్ అనే స్పష్టం అవుతోంది. ●

# టూరిజం అభివృద్ధికి 'మిస్ వరల్డ్' దోహదం



బోరెడ్డి అయోధ్యరెడ

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన మిస్ వరల్డ్ 2025 పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాల సుందరీ మణులు హైదరాబాద్‌కు చేరుకుంటు న్నారు. వీరి రాకతో హైదరాబాద్ నగరం సందడిగా మారింది. హైద రాబాద్‌లో మిస్‌వరల్డ్ పోటీలు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఈనెల 10న ప్రారంభమై 31న జరిగే గ్రాండ్ ఫినాలేతోముగుస్తాయి. ఈ 21రోజులు అడుగడుగునా తెలంగాణ సంస్కృతి, సాం ప్రదాయాలు ఉట్టిపడేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. పోటీ ల్లో పాల్గొనే సుందరీమణులకు ఇక్కడి కళలను పరిచయం చేసేలా కార్యక్రమాలను రూపొందించింది. ఇందులో 120 దేశాల ప్రతినిధులు పాల్గొనడమే కాకుండా, 150కిపైగా దేశాల్లో ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం కానుంది. ఈ వేదిక ద్వారా మెడికల్ టూరిజంపై ప్రచారం చేయటం ద్వారా ప్రపంచవ్యాప్తంగా హెల్త్ టూరిస్టులను ఆకర్షించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మెగా ఈవెంట్‌ను కవర్ చేసేందుకు 3వేల మందికిపైగా దేశ,విదేశీ మీడియా ప్రతినిధులు హైదరాబాద్‌కు రానున్నారు. తెలంగాణవైపు ప్రపంచం దృష్టిని ఆకర్షించటం, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచటం, ఇక్కడి పర్యాటకప్రాంతాలకు ప్రాచుర్యం కల్పించడమేలక్ష్యంగా ఈ పోటీలకు ప్రభుత్వం ఆతిథ్యం ఇస్తున్నది. మిస్ వరల్డ్ 2025 వేడుకలకు 'చార్ సౌ సాల్‌కా షహర్' హైదరాబాద్ ముస్తాబవుతుండగా రాష్ట్రవ్యాప్తంగా హెరిటేజ్, మెడికల్, టెంపుల్ టూరిజానికి ఊతమిచ్చేలా ప్రభుత్వం కార్యాచరణను రూపొందించింది. 'తెలంగాణ జరూర్ ఆనా' థీమ్‌తో అటు అందగత్తెల పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తూనే ఇటు పర్యాటకాన్ని ప్రోత్సహించేలా చర్యలు తీసుకుంటోంది. 116 దేశాల సుందరీమణులు, దేశవిదేశీ అతిథులు, 3 వేల మంది పాత్రికేయులు పాల్గొనే ఈ పోటీలను హైదరాబాద్ మహానగరానికే పరిమితం చేయకుండా.. రామప్ప ఆలయ దర్శనం, యాదగిరిగుట్ట నారసింహుడి ఆశీర్వాదం పోటీదారులకు కలిగేలా షెడ్యూల్‌ను రూపొందించింది. అంతేకాదు.. భౌగోళిక గుర్తింపు పొందిన పోచంపల్లి ఇక్కత్ పట్టు చీరల తయారీ తీరు.. మహబూబ్ నగర్‌లోని పిల్లలమర్రి, ప్రఖ్యాత బౌద్ధారామమైన నాగార్జున సాగర్, హైదరాబాద్‌కు మకుటాయమానంగా ఉన్న చార్మినార్ ఆ పక్కనే అపురూపమైన గాజులకు నిలయమైన లాడ్ బజార్, ఆణిముత్యాల ఆభరణాలను విక్రయించే వీధులు, అస్‌ఫజాహీల కాలంనుంచి దేశవిదేశీ ప్రతినిధులకు ఆతిథ్యమిచ్చే చౌమొహల్లా ప్యాలెసలను మిస్‌వరల్డ్ పోటీదారులకు పరిచయం చేయనుంది. ఈ పోటీలకు వచ్చినవారు 'హైదరాబాద్ యాత్ర' అనుభూతి గురించి తమ డెరీల్లో ప్రముఖంగా రాసుకునేలా కార్యక్రమాలను రూపొందించింది.జూన్ 2న తెలంగాణ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా మిస్ వరల్డ్ విజేతతోపాటు ఆరు ఖండాల టైటిళ్లను గెలుచుకునే అందగత్తెలకు రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ తేనేటీ విందు ఇస్తారు. మిస్‌వరల్డ్ లిమిటెడ్ సీఈవో జూలియా మోర్లె మాట్లాడుతూ మిస్ వరల్డ్ అనేది అందం కన్నా అంతర్జాతీయ సంస్కృతీ, సాధికారతకు ప్రతీక అన్నారు. ఈ పోటీలు అంతర్జాతీయ పర్యాటక, పెట్టుబడుల కేంద్రంగా తెలంగాణను ముందువరుసలో నిలుపుతాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని కొత్త పుంతలు తొక్కించటమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం తొలి పర్యాటక విధానాన్ని తీసుకొచ్చింది. ఐదేళ్లపాటు అమల్లోఉండే విధంగా రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదించిన తెలంగాణ పర్యాటక పాలసీ 2025-30పై జీవో వెలువరించింది. దీనిలో ఐకానిక్ ప్రాజెక్టులు, మెగా థీమ్‌పార్కులు, ఫిలిం స్టూడియోల అభివృద్ధికి అనువైన ప్రోత్సాహకాలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నూతన పర్యాటక విధానంతో రాబోయే ఐదేళ్లలో 15వేల కోట్ల పెట్టుబడులను రాబట్టాలని, మూడు లక్షల అదనపు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసమై త్వరలో ప్రత్యేక టూరిజం పోర్టల్‌ను అందుబాటులో తీసుకురానుంది.



తెలంగాణ చరిత్ర, పర్యాటక ప్రాంతాల వివరాలు ఇందులో పొందుపరచనున్నారు.రాష్ట్ర జీడీపీలో టూరిజం వాటాను 10శాతానికి పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకున్నది. రాష్ట్రంలో పర్యాటక వనరులు సమృద్ధిగా కలిగి ఉన్నప్పటికీ, సరైన ప్రచారం లేక పర్యాటక రంగంలో మన రాష్ట్రం వెనకబడిపోయింది. తెలంగాణ రాష్ట్ర జీడీపీలో పర్యాటకరంగం 5.06శాతం ఉండగా, గుజరాత్ 10.2 శాతం, కర్ణాటక 14.20శాతం, కేరళ 10శాతం,రాజస్థాన్ 12శాతంగా ఉన్నాయి. 2023 సంవత్సరంలో రాష్ట్రంలోని వివిధ ప్రదేశాలను సందర్శించిన దేశీయ పర్యాటకుల సంఖ్య 5.84కోట్లు. కాగా, 2024 జనవరి నుంచి ఆగస్టు నాటికి ఆ సంఖ్య 6.51కోట్లకు చేరింది. ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా 2023!!24 సంవత్సరంలో దేశీయ పర్యాటకులు సందర్శించిన టాప్ 10 ప్రదేశాల జాబితాను గతనెల విడుదల చేసింది. అందులో గోల్కొండ కోట 6వ స్థానంలో,చార్మినార్‌లో 9వ స్థానంలో నిలిచాయి. పర్యాటకం కారణంగా ఆర్థికవృద్ధితోపాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. టూరిజం కౌన్సిల్‌ప్రకారం అంతర్జాతీయంగా ఏర్పడే ప్రతీ నాలుగు ఉపాధి అవకాశాల్లో పర్యాటకరంగం కూడా ఉంది. పర్యాటకుల రాక పెరిగితే ట్యాక్సీలు నడిపేవారికి, హోటళ్లకు, ఫోటోగ్రాఫర్లకు, టూరిజం గైడ్లకు, వ్యాపారస్తులకు ఉపాధి అవకాశాలు వృద్ధి చెందుతాయి. సింగపూర్ వంటి దేశాలు తక్కువ ప్రదేశంలో వైవిధ్యమైన ప్రణాళికలతో పెద్ద సంఖ్యలో పర్యాటకులను ఆకర్షిస్తూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నాయి. ఇదే తరహాలో రాష్ట్రంలోనూ ఈ రంగం నుంచి వచ్చే ఆదాయం పెరిగితేనే తెలంగాణ ఆర్థిక వ్యవస్థ మరో దశకు చేరుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యాటకశాఖపై సమీక్ష సందర్భంగా పేర్కొన్నారు. ఈరంగంలో బహుళజాతి సంస్థల పెట్టుబడులతో అంతర్జాతీయ స్థాయిలో వసతులు ఏర్పడతాయి. హుస్సేన్‌సాగర్ పరిసరాల్లోని సంజీవయ్య, ఎన్‌టీఆర్, ఇందిరా పార్కులను కలుపుతూ ట్యాంక్‌బండ్ చుట్టూ స్కైవాక్, పర్యాటక వలయాన్ని ఏర్పాటు చేయాలని, కవ్వాల్, అమ్రాబాద్ పులుల అభయారణ్యాలను సఫారీ టూరిజానికి అనుగుణంగా తీర్చిదిద్దాలని ఆయన అధికారులను ఆదేశించారు. మనదేశంలో మిస్ వరల్డ్ పోటీలు గతంలో 1996లో బెంగళూరులో, 2024లో ముంబయ్ వేదికగా జరిగాయి. మూడవసారి ఈ అవకాశం తెలంగాణకు దక్కింది. ఈ పోటీలకు దుబాయ్‌నగరం నుంచి తీవ్ర పోటీ ఎదురైంది. అయితే, హైదరాబాద్ నగరానికి అంతర్జాతీయంగా ఉన్న గుర్తింపుతోపాటు చారిత్రక, గ్రామీణ ప్రాంతాల ప్రత్యేకతల్ని వివరించటంతో ఇక్కడ నిర్వహించేందుకు అవకాశం లభించింది. దేశంలో కొత్త రాష్ట్రమైన తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతోంది. రాష్ట్రంలో శంషాబాద్ విమానాశ్రయం ప్రపంచంలోని అత్యుత్తమైన విమానాశ్రయాల్లో ఒకటి. ఇక్కడ ఏడాది పొడవునా ఆహ్లాదకర వాతావరణం, ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు అనేకంఇక్కడ ఉన్నాయి. ఈ అంశాలు పోటీల నిర్వహణకు అవకాశం దక్కేందుకు అనుకూలించాయి. ఇప్పటికే ప్రపంచ సుందరి 2024 క్రిస్టినా పిజ్కోవా రాష్ట్రంలోని అనేక ప్రాంతాలను సందర్శిస్తూ, ఈ పోటీలకు ముందస్తు ప్రచారం కల్పిస్తున్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా కేబీఆర్ పార్కులో నిర్వహించిన అంతర్జాతీయ అటవీ దినోత్సవాలలో మంత్రి కొండా సురేఖతో కలిసి మిస్ వరల్డ్ క్రిస్టినా పిజ్కోవా పాల్గొని మొక్కలకు నీళ్లు పోశారు. తెలంగాణకు అంతర్జాతీయంగా పేరు ప్రతిష్టలు తీసుకొచ్చి టూరిజం అభివృద్ధికి ఈపోటీలు దోహదం చేయనున్నాయి. తాము చేయలేని పనిని కాంగ్రెస్‌ప్రభుత్వం చేస్తున్నదనే అక్కసుతో బీఆర్‌ఎస్ ఈ కార్యక్రమంపై బురద జల్లుతున్నది. ఈ ఈవెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తుండగా, రూ.250కోట్లు చేస్తున్నారని విమర్శలు చేస్తున్నాయి. వాస్తవానికి ఈ పోటీలకోసం అంతర్జాతీయ స్థాయిలో విలేకరులు, ఫోటోగ్రాఫర్లు వచ్చి ఈ వార్తలను కవరేజ్ చేయటం వల్ల అంతర్జాతీయ మీడియాలో తెలంగాణ రాష్ట్రానికి ప్రముఖ స్థానం దక్కుతుంది. ప్రపంచంతోపాటు మనం కూడా పరుగులు పెడితేనే వృద్ధిని అందుకోగలుగుతాం. లేకపోతే వెనకబడిపోతాం. అంతేకానీ ప్రతీ విషయంలోనూ రాజకీయంగా ఆలోచించి విమర్శలు చేస్తూ ప్రతీదాన్ని అడ్డుకునే సంకుచిత మనస్తత్వాన్ని మానుకోవాలి. ●

# నేరస్తులకు శిక్షలు పడే విధంగా చర్యలు : పల్నాడుజిల్లా ఎస్పీ



**నరసరావుపేట క్రైం, మే 10 ప్రభాతవార్త :** నేరస్తులకు కోర్టులలో శిక్షలు పడే విధంగా చూడాలని జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు పోలీస్ అధికారులకు శనివారం సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో కోర్టు కానిస్టేబుళ్ళతో ఆయన సమావేశం నిర్వహించారు. న్యాయ స్థానాలలో ఉన్న కేసుల విచారణ వేగవంతం చేయాలన్నారు. వివిధ కేసుల్లో రౌడీషీటర్ల హాజరు, నాన్ బెయిలబుల్ వారెంట్‌ల జారీ, అత్యాచార కేసులకు సంబంధించి విచారణ వేగవంతం చేయాలన్నారు. గత నెలలో పలు కేసులకు సంబంధించి వచ్చిన కోర్టు తీర్పుల వలన అసాంఘిక కార్య కలాపాలకు పాల్పడే వారికి హెచ్చరికలు వెళ్తాయన్నారు. శిక్ష పడటం వలన తగిన గుణపాఠం నేర్చుకుంటారని ఎస్పీ కె.శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జె.వి.సంతోష్, అధికారులు ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి వార్త

## జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిబంధనలు నిల్

# వసూళ్ళు ఫుల్

**- స్టాంపుల అక్రమ, అదనపు వసూళ్ళపై రాష్ట్ర ఐజికి ఫిర్యాదులు**

**- 'ప్రభాతవార్త' ప్రత్యేక కథనంపై ఇంటిలిజెన్స్ విచారణ**

**- అక్రమాలపై సిద్ధమవుతున్న నివేదికలు**

**నరసరావుపేట, మే 10 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా కేంద్రంలోని నరసరావుపేట జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిబంధనలకు నీళ్ళువదిలి ప్రతి పనికి పెద్ద ఎత్తున జరుగుతున్న వసూళ్ళ తంతుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా అధికారులు ఉన్న కార్యాలయంలో ఏ మాత్రం భయం, బెదురు లేకుండా ఇష్టానుసారంగా ముక్కుపిండి మరీ వసూళ్ళు చేసే కార్యక్రమానికి కార్యాలయ సిబ్బంది వెనుకాడటం లేదు. పైగా అధికారులకు ఇందులో వాటాలు ఉన్నాయంటూ బహిరంగంగానే చెప్తున్నారు. అంతేగాక స్టాంపుల విక్రయాల అదనపు వసూళ్ళతో పాటు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల అవసరాల కోసం ఏడాదికి ఒక రేటు చొప్పున కార్యాలయంలో నిర్ణయించి ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. ఈకేవైసి చేసే దగ్గర నుండి ప్రారంభిస్తే ప్రతి పనికి అక్కడ సిబ్బంది, అధికారులు వసూళ్ళ పర్వాన్ని యదేచ్ఛగా సాగిస్తున్నారు. స్టాంపుల విక్రయాలలో జరుగుతున్న అక్రమాలు, అదనపు వసూళ్ళపై 'వార్త దినపత్రిక"లో ప్రత్యేక కథనం రావడంతో బాధితులు కార్యాలయంలో వివిధ పనులకు సంబంధించి జరుగుతున్న అక్రమాలపై మరిన్ని వివరాలు తెలియజేశారు. నేరుగా డబ్బుల వసూళ్ళతో పాటు ఫోన్ పే ల ద్వారా డబ్బులు లాగేసే లేటెస్ట్ దోపిడి జరుగుతుందనే పరిస్థితి ఏ స్థాయికి వెళ్ళిందో అర్ధమవుతుంది. కేవలం వసూళ్ళ కోసమే ఎటువంటి జీతాలు లేకుండా ప్రైవేట్ వ్యక్తులను అధికారులు పెంచి పోషిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులను తొలగించి స్పష్టమైన ఆదేశాలను ఇచ్చినప్పటికీ అధికారులు వారిని కొనసాగిస్తున్నారంటే ఆదాయం ఏ స్థాయిలో ఉందో తేలికగానే అర్థమవుతుంది. స్థాయిని బట్టి కార్యాలయంలో పర్సంటేజ్‌ల పరంపర కొనసాగుతుంది. అదే విధంగా ఈ కథనంపై ఇంటిలిజెన్స్ అధికారులు శనివారం కార్యాలయం వద్ద పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. కార్యాలయానికి వచ్చేవారి నుండి ప్రభుత్వానికి నివేదిక తెలియజేసేందుకు వివరాలు తీసుకున్నారు. స్టాంపులపై అదనపు వసూళ్ళ గురించి ఎక్కువ శాతం మంది తమను దోపిడి చేస్తున్నారని స్పష్టంగా తెలియజేశారు. మరికొందరు పని కావాలంటే అదనంగా డబ్బులు ఇవ్వాల్సి వస్తున్నట్లు, ఎవరెవరికి ఎంతెంత ముట్టేది కూడా వివరాలు తెలిపారు. ఇందుకు సంబంధించి మరింత సమాచారాన్ని ఇంటిలిజెన్స్ వర్గాలు సేకరిస్తున్నాయి.

**- రిజిస్ట్రార్ కార్యాలయాలలో స్టాంపులు విక్రయాలు ఇలా...**

ప్రతి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో షరాబ్ అనే వ్యక్తిని స్టాంపుల విక్రయం కోసం నియమిస్తూ ఉంటారు. గతంలో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులలో స్టాంపుల విక్రయాల కోసం సబ్ రిజిస్ట్రార్ సంతకాలతో కూడిన స్టాంపులను మాత్రమే ప్రజలకు అమ్మేవారు. స్టాంపుల విక్రయాలలో జ్యుడిషియరీ స్టాంప్స్ మరియు నాన్ జ్యుడిషియరీ, నోటరీ స్టాంప్స్, రెవిన్యూ స్టాంప్స్ సైతం ప్రజలకు అందుబాటులో ఉంటాయి. జ్యుడిషియరీ స్టాంప్స్‌లో కోర్టు ఫీజుకు సంబంధించినటువంటి స్టాంప్స్ మాత్రమే విక్రయాలు జరుగుతాయి. అలాగే రెవిన్యూ స్టాంప్స్ ను సైతం ఏపి ప్రభుత్వం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు పాస్టాఫీస్‌లలో అందుబాటులో ఉంచింది. నాన్ జ్యుడిషియరీ స్టాంప్స్ విధానంలో ప్రజలకు మూడు విధాలుగా ప్రజలకు లభిస్తుంటాయి. దానిలో మొట్టమొదటి విధానం ప్రభుత్వ కార్యాలయాలైన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో మాత్రమే స్పెషల్ ఎడ్‌హెస్సివ్ స్టాంప్స్ (ఎస్‌పిఎల్) ఉంటాయి. అదే విధంగా ప్రభుత్వం వారికి, స్టాంప్ వెండర్స్‌కి, ప్రజలకు అందుబాటులో సులభంగా అందే విధంగా ప్రభుత్వం పాత స్టాంపుల విధానం నాన్ జ్యుడిషియరీ స్టాంప్స్ (గత ప్రభుత్వం రద్దు చేసినటువంటి స్టాంప్ పేపర్ల విధానం) రెండవది ఫ్రాంకింగ్ విధానం, మూడవది గత ప్రభుత్వం తెచ్చినటువంటి ఈ స్టాంపింగ్ విధానం కూడా ఇప్పుడూ ఉంది. అయితే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గత ప్రభుత్వం రూ.100లు స్టాంప్ కొనుగోలు చేయాలంటే రూ.50 లు యూజర్ ఛార్జీ కట్టాలనే విధానాన్ని అమలు చేసింది. దీనిని ఆసరాగా చేసుకొని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులలో ఇష్టానుసారంగా వసూళ్ళు జరుగుతున్నాయి. ఏ రోజు ఏ తేది కావాలన్నా రోజులైతే వందల్లో, నెలలు అయితే వేలల్లో, సంవత్సరాలు అయితే వారికి ఇష్టమొచ్చి రీతిలో వసూళ్ళు జరుపుతున్నారు. బ్యాంక్ వారు కాని, ఫైనాన్స్ సెక్టారుకు సంబంధించి లోను మంజూరుకై అవసరమైన స్టాంపుల కొరకు, అదే విధంగా ఏదైనా నెలలు తేడా వచ్చి ఆడిట్‌లో బ్యాంక్ వారు కాని, ఫైనాన్స్ సెక్టారుకు సంబంధించినటువంటి అధికారులు కాని పొరపాటున తగిన స్టాంపు వేయించాలంటే అదనంగా చెల్లించాల్సిందే. దీనిపై సంబంధిత రాష్ట్ర స్టాంప్స్ మరియు రిజిస్ట్రేషన్ ఐజీ కి ఇప్పటికే ఈ అదనపు వసూళ్ళపై ఫిర్యాదులు వెళ్ళగా మరికొన్ని ఫిర్యాదులు సిద్ధమవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా కొన్ని ఆఫీసులలో ఖాళీ స్టాంపులు అమ్మడంపై సైతం ఆరోపణలు ఉన్నాయి. ఇంటిలిజెన్స్ వర్గాల విచారణలో ఏపి కార్యాలయాల్లో ఇటువంటి ఖాళీ స్టాంపులు ఉన్నాయో కొన్ని వివరాలు తీసుకున్నారు. కాగా ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అయితే మీడియాలో వచ్చే కథనాలు లైట్‌గా తీసుకొని కొన్ని రోజులు పోగానే యధావిధిగా వసూళ్ళపర్వాన్ని కొనసాగించవచ్చని కార్యాలయంలోని కొందరు అధికారులు, ఉద్యోగులు సైతం వ్యాఖ్యానించడం పరిస్థితికి అద్దం పడుతుంది.



నరసరావుపేట జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

# డిజిటల్ జనసేవ కేంద్రంగా ఇండియా పోస్టు

**- కేరళ రాష్ట్ర పర్యటనలో కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని**

**గుంటూరు తూర్పు, మే 10 ప్రభాతవార్త :** ఇండియా పోస్ట్‌ను డిజిటల్ జనసేవ కేంద్రంగా మారుస్తున్నామని కేంద్ర సహాయకమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. కేరళ రాష్ట్రంలో పర్యటిస్తున్న ఆయన అక్కడి తపాళా కార్యాలయాలను ఎం.పి. ప్రకాష్, ఎమ్మెల్యే జాయ్, కేంద్ర మాజీ సహాయకమంత్రి మురళీధరన్‌తో కలిసి సందర్శించి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ ఇండియాలో ప్రతి పౌరుడిని భాగస్వామిని చేస్తున్నామన్నారు. ఇండియా పోస్ట్ ఉత్తరాలతో పాటు మరెన్నో సేవలను అందిస్తుందని ంద్రశేఖరరావు తెలిపారు. అదే విధంగా ఆధ్యాత్మికవేత్త నారాయణ గురువు మఠాన్ని సందర్శించడం సంతోషమన్నారు. భారత ప్రభుత్వం పోస్టల్‌శాఖ తరపున ప్రత్యేక స్మారక పోస్టల్ స్టాంపును విడుదల చేస్తుందని తెలియజేశారు. ప్రపంచ వ్యాప్తంగా తపాల వ్యవస్థ తగ్గుముఖం పడుతున్న ఈ డిజిటల్ యుగంలో భారత్ పోస్టు ఒక కొత్త మార్గాన్ని ఎంచుకుందన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద నెట్‌వర్క్ ఉన్న తపాలాశాఖ ఇప్పటిదాకా 1.6 లక్షలకు పైగా పోస్టాఫీసులను కలిగి ఉందన్నారు. ఈ మార్పు ప్రధానమంత్రి నరేంద్రమోదీ దూర దృష్టితో జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 70 శాతం ఖాతాలున్న ఇండియా పోస్టు పేమెంట్స్ బ్యాంక్‌ను నడుపుతుందని, వెయ్యికి పైగా డాక్ ఘర్ నిక్యాత్ కేంద్రాల ద్వారా చిన్న వ్యాపారాలను ప్రోత్సహిస్తుందన్నారు. 420కి పైగా పోస్టాఫీస్‌లు పాస్‌పోర్టు సేవలను సైతం అందిస్తున్నామని, ఆధార్, మొబైల్ బ్యాంకింగ్, క్యూఆర్ కోడ్ లావాదేవీలతో ప్రతి పౌరుడిని డిజిటల్ ఇండియాలో భాగస్వామ్యుల్ని చేస్తున్నామన్నారు. ఇతర కేంద్ర, రాష్ట్ర శాఖలతో కలిపి ఇంటి వద్దే సేవలను అందించేందుకు గట్టి నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుంటున్నామని మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వివరించారు.




# పేదలకు ఆపన్నహస్తం సిఎం సహాయనిధి

**-గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్12 మందికి రూ.29 లక్షల చెక్కులు అందజేత**

**గుంటూరుతూర్పు,మే10,ప్రభాతవార్త:** సీఎం సహాయనిధి పేదపాలిట ఆపన్నహస్తమని గుంటూరు తూర్పు ఎమ్మె మొహమ్మద్ నసీర్ అన్నారు. శనివారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో 12 మంది బాధితులకు రూ.29 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు వైద్యశాలలో చికిత్స తీసుకుని ఆర్థికంగా చితికిపోయిన వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరమని చెప్పారు. పేద ప్రజలెవరూ వైద్యానికి ఇబ్బందులు పడకూడదనే గొప్ప మనసుతో సీఎం చంద్రబాబు నాయుడు సీఎం రిలీఫ్ ఫండ్ అందిస్తున్నారని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటి వరకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.1.85 లక్షలు పేద ప్రజలకు అందించామని, ఇది వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా నిలుస్తోందని చెప్పారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందుకున్న వారు మాట్లాడుతూ తాము అనారోగ్యం కారణంగా ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స తీసుకుని తీవ్రంగా నష్టపోయామని, ఎమ్మెల్యే నసీర్ ను కలిసిన వెంటనే సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేయించారని చెప్పారు. సీఎం రిలీఫ్ ఫండ్ వచ్చేలా ప్రయత్నించిన ఎమ్మెల్యే నసీర్, అందించిన సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటామని రెండు చేతులు జోడించి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు యల్లావుల అశోక్, మీరావలి, చీప్తి, మహంకాళి నరసింహారావు, జాగర్లమూడి శ్రీనివాస్, కోటా పిచ్చిరెడ్డి, వంగర ఏడుకొండలు, మొహమ్మద్ హాఫీజ్, శీను నాయక్, పిడతల బాబురావు, అబ్దుల్ సలీం తదితరులు పాల్గొన్నారు.



# సైనికుల సహాయనిధికి ఎన్ఆర్ఐ రు.5లక్షలు విరాళం అందజేత

**బాపట్ల,మే10,ప్రభాతవార్త:** సైనికుల సహాయ నిధికి బాపట్ల జిల్లా చీరాలకు చెందిన ఎన్ఆర్ఐ ఐదు లక్షల రూపాయలు విరాళం అందించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ తుషార్ డూడి కొనియాడారు. భారతదేశ సైనికుల సహాయనిధికి ఐదు లక్షల రూపాయల చెక్ ను యుఎస్ఏ లో ఉంటున్న బాపట్ల జిల్లా చీరాల పట్టణానికి చెందిన ఎన్ఆర్ఐ శనివారం జిల్లా ఎస్పీకి చీరాల ఒకటో పట్టణ ఇన్స్పెక్టర్ సుబ్బారావు ద్వారా అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భారత సైనికులు దేశ భద్రత కోసం నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తున్నారన్నారు. వారిని గౌరవించడమే కాదు, ఇటువంటి విపత్కర సమయాల్లో సాయంగా నిలవడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. బాపట్ల జిల్లాకు చెందిన ఎన్ఆర్ఐ చూపిన ఉదారత అభినందనీయ మన్నారు. విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ దేశానికి సేవ చేయాలనే తపన వారి చర్యలో స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఇలాంటి విరాళాలు అందించే వారు ఇతరులకు ప్రేరణగా నిలుస్తారన్నారు. బాపట్ల జిల్లా పోలీస్ విభాగం వారి దేశభక్తికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిజేస్తుందని ఆయన అన్నారు.

# సైప్రస్ దేశం వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గురజాల విద్యార్థి



**గురజాల, మే 10 ప్రభాతవార్త:** ఉన్నత విద్య కోసం సైప్రస్ దేశం వెళ్లిన గురజాల విద్యార్థి అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. గురజాల పట్టణానికి చెందిన నల్ల నవీన్ ఉన్నత విద్యనభ్యసించేదుకు 18 నెలల క్రితం సైప్రస్ దేశం వెళ్లారు. అక్కడ ఉన్నత విద్యనభ్యసిస్తూ పార్ట్‌టైం జాబ్ చేస్తున్నాడు. కాగా శుక్రవారం రాత్రి 11:30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలతో మృతిచెందారు. చేతికి అందివచ్చిన కుమారుడు మృతితో కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. విషయం తెలుసుకున్న గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు మృతుని కుటుంబసభ్యులను





ఫోన్‌లో పరామర్శించారు. నవీన్ పార్థివ దేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. కుటుంబసభ్యులు తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసి ధైర్యం చెప్పారు.

# 12న తిరువూరులో గ్రీవెన్స్‌డేకు కలెక్టర్ రాక



**ఎ కొండూరు, మే 10, ప్రభాతవార్త :** ఎన్టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తిరువూరు రెవిన్యూ డివిజన్ నడింతిరువూరు టౌన్‌లోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఈ నెల 12న సోమవారం ఉదయం 9.30 గంటలకు ప్రజా సమస్యల పరిష్కారం వేదిక కార్యక్రమంలో పాల్గొంటారని ఇన్‌చార్జ తహశీల్దార్ యు రాజ్‌కుమార్ తెలిపారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గ్రీవెన్స్ సెల్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో చీఫ్ గెస్ట్ పాల్గొంటారని తహశీల్దార యు రాజ్‌కుమార్ తెలిపారు. కావున తిరువూరు డివిజన్ పరిధిలోని ప్రజలందరూ పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎ కొండూరు ఇన్‌చార్జ్ తహశీల్దార్ యు.రాజ్‌కుమార్ కోరారు.

# కల్పవృక్ష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన దేవదేవుడు



పొన్నూరు, మే 10, ప్రభాతవార్త: శ్రీ సాక్షి భావదేవుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవరోజైన శనివారం ఉదయం స్వామివారికి విశేష అర్చనలు, హోమాలు, అభిషేకాలు జరిగాయి. రాత్రికి ప్రత్యేకంగా 'సప్తఋషిపూజ' జరిపారు. భృగు, అత్రి, కశ్యప, క్రతు,పులహ, పులహస్త్య, భరద్వాజులు అయిన సప్తఋషు లను పూజించి వారిని స్వామివారికి జరగబోవు కళ్యాణోత్సవానికి ఆహ్వానించడం ఈ సప్తఋషి పూజలోని అంతరార్థం. తర్వాత స్వామివారిని శ్రీకృష్ణుని అలంకరణలో పొన్నవృక్షవాహనం (కల్పవృక్షవాహనం)పై స్వర్ణపురి పురవీధుల్లో భక్తులకు దర్శనార్థం ఊరేగించారు. కల్పవృక్ష వాహనానికి ముందు ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి శ్రీ భావనారాయణ స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. సమస్త కామితార్ధ ములను తీర్చేది కల్పవృక్షం. భక్తుడు తన సర్వస్వము భగవంతు డేనని విశ్వసించి ఇహ,పరమైన మమకారాములను వదిలేసి ఆ భగవంతుని శరణు వేడడం తద్వారా ఆయన కృపాకటాక్ష వీక్షణములను పొందడం ఈ పొన్నవృక్షవాహనం యొక్క విశిష్టత. లీలామానుష విగ్రహుడైన కృష్ణుని అలకంరణలో భావదేవుడు భక్తులకు కనువిందు చేశాడు. ఈ కార్యక్రమంలో యాజీ కస్వామి ఎన్.ఎస్.కె.ఆర్. భట్టా చార్యులు (రాంబాబు),అర్చకులు గోవర్ధనం రామకృష్ణ, రొంపిచర్ల గౌతమ్ తదితరులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా దేవాలయం అసిస్టెంట్ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో రత్నం, హరిబాబు తదితరులు ఏర్పాట్లు చేశారు.

# రోడ్లపై ఆవులను వదిలిన యజమానులకు రూ.10వేల జరిమానా

**విజయవాడ కార్పొరేషన్,మే 10,ప్రభాతవార్త:** విజయవాడ నగరపాలక సంస్థ కమీషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు రోడ్లపై ఆవులను వదిలిన యజమానులకు రూ.10వేల జరిమానాను విధించనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. రోడ్లపై పశువులను వదిలిపెట్టడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కల్గడం ప్రమాదాలు సంభవించిడం ప్రజలకు అసౌకర్యం కల్గించే అంశాలను దృష్టిలో ఉంచుకొని ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ చర్యల్లో భాగంగా ఆవులను రోడ్లపై వదిలిపెట్టకుండా నియంత్రించేందుకు అజిత్‌సింగ్‌నగర్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసి కాటిల్ షెడ్‌లో గోవుల ఆరోగ్య సంరక్షణ కోసం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బిఎస్ఎస్ రెడ్డి పర్యవేక్షణలో ఉంటాయని తెలిపారు. ప్రజలందరూ రోడ్లపై పశువులను వదిలిపెట్టకుండా సహకరించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. ప్రజల భద్రత,ట్రాఫిక్ సౌలభ్యం,పర్యావరణ పరిరక్షణే ఈ చర్యల ప్రధాన లక్ష్యమని అన్నారు.

# పోలీసుల అదుపులో శ్రీకాంత్‌రెడ్డి

**-శ్రీకాంత్‌రెడ్డిను పోలీసులు అదుపులోకి తీసుకుంటుండగా అడ్డుకున్న మాజీ మంత్రి విడదల రజిని**







**చిలకలూరిపేట,మే10,ప్రభాతవార్త:** వైసిపి ప్రభుత్వ హయంలో టిడిపి వారిపై అసభ్యపోస్టులు పెట్టినందుకు గాను, పట్టణంలో పలువురు దగ్గర బెదిరించి డబ్బులు తీసుకున్నారని ఆరోపణల నేపద్యంలో చిలకలూరిపేట రూరల్ మండలం మానుకొండవారిపాలెం గ్రామానికి చెందిన మానుకొండ శ్రీకాంత్‌రెడ్డిని నాదెండ్ల మండలం జంగాలపల్లి గ్రామం వద్ద రూరల్ సిఐ బి సుబ్బనాయుడు, నాదెండ్ల ఎస్ఐ పుల్లారావు, సిబ్బంది అదుపులోకి తీసుకుంటుండగా మాజీమంత్రి విడదల రజిని అడ్డుకున్నారు. దీనితో సిఐ సుబ్బనాయుడు మాట్లాడుతూ పలు కేసులలో నిందితుడిని అదుపులోకి తీసుకునే పరిస్థితులలో మీరు అడ్డుకో వద్దని మాజీమంత్రి విడదల రజినికితెలియచేశారు. అయినప్పటికి ఆమె అడ్డుకునే పరిస్థితులలో సిఐ, ఎస్ఐ, సిబ్బంది మాజీ మంత్రి కారులో ఉన్న శ్రీకాంత్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆ గ్రామం వద్ద కొంతసేపు ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. ఆ తరువాత శ్రీకాంత్‌రెడ్డిని పోలీసులు నాదెండ్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

**మాజీమంత్రి, మహిళ అనే చూడకుండా, విషయం చెప్పకుండా నా అనుచరుడిని పోలీసుల అదుపులోకి తీసుకోవడం దారుణం : మాజీమంత్రి విడదల రజిని**

**అదుపులోకి తీసుకున్న వైసిపి కార్యకర్త శ్రీకాంత్‌రెడ్డిని కోర్టులో హాజరుపరచాలి లేకపోతే కోర్టు తలుపులు తడతాం : మాజీమంత్రి పేర్ని నాని**

నాదెండ్ల మండలంలో జంగాలపల్లి గ్రామ వైసిపి నాయకుడు సీతారామరెడ్డి ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకున్న మాజీమంత్రి విడదల రజిని ఆ మండల నాయకులతో కలసి శనివారం జంగాలపల్లి గ్రామం వెళ్లి ఆయనను పరామర్శించి తిరిగి వస్తుండగా రూరల్ సిఐ సుబ్బనాయుడు, నాదెండ్ల ఎస్ఐ పుల్లారావు, సిబ్బంది కలసి ఊరి వెలుపల తమ వాహనాన్ని చుట్టుముట్టి తన కారులో ఉన్న అనుచరుడు శ్రీకాంత్‌రెడ్డిని అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నం చేశారు. ఆ సందర్భంలో తాను అతనిని ఎందుకు అదుపులోకి తీసుకుంటున్నారు, విషయం చెప్పండి, అతనితో పాటు మేము పోలీస్ స్టేషన్‌కు వస్తాము అని చెప్పినప్పటికి వినకుండా అదుపులోకి తీసుకోవడానికి తిరిగి ప్రయత్నం చేశారు. ఆ దశలో సిఐ సుబ్బనాయుడు అతనిపై పలు కేసులు ఉన్నాయని, అతనిని తప్పనిసరిగా అదుపులోకి తీసుకుంటున్నాము, మీరు దయచేసి పోలీస్ విధులకు అడ్డురావద్దు, ఆ విధంగా వస్తే మీపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారని తెలియచేసింది. మాజీమంత్రి, మహిళ అయిన తన పట్ల రూరల్ సిఐ అనుచితంగా ప్రవర్తించారని అనంతరం పట్టణంలో ఆమె నివాసంలో ఏర్పాటు చేసినవిలేకరుల సమావేశంలో ఆమె ఆరోపించారు. మరో మాజీ మంత్రి పేర్ని నాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక పోలీసుల వ్యవహారం మితిమీరిపోయిందని, వైసిపి నాయకులపై, కార్యకర్తలపై విచక్షణా రహితంగా కేసులు పెడుతున్నారని ఆరోపించారు. మాజీమంత్రి, మహిళ అయిన విడదల రజిని అడ్డు చెప్పున్నప్పటకి వినిపించుకోకుండా వైసిపి కార్యకర్త శ్రీకాంతరెడ్డిని పోలీసుల బలవంతంగా అదుపులోకి తీసుకోవడాన్ని ఆయన ఖండించారు. శ్రీకాంత్‌రెడ్డిని ఏ పోలీస్ స్టేషన్‌లో ఉంచారో కూడా ఇప్పటివరకు తెలియరాలేదని అన్నారు. అతనిని వెంటనే కోర్టులో హాజరుపరచకపోతే హైకోర్టు తలుపులు తడతామని ఈ సందర్భంగా పేర్ని నాని తెలియచేశారు. ఈ సమావేశంలో నరసరావుపేట మాజీ శాసనసభ్యుడు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైసిపి నాయకులు ఎల్ అప్పిరెడ్డి, డైమండ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత కుట్టుమిషన్‌ల సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నా



**సత్తెనపల్లి, మే 10 ప్రభాతవార్త :** మండలంలోని నందిగామ గ్రామంలో పేద మహిళల ఉచిత కుట్టుమిషన్ల శిక్షణా శిబిరాన్ని శనివారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద మహిళలకు స్వయం ఉపాధి అందించే ఇటువంటి కార్యక్రమాలు అభినందనీయమన్నారు. శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసిన మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు శిక్షణ పొందిన కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సూచించారు.

# ఈ నెల 14న జాబ్ మేళా

### -గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్సద్వినియోగం చేసుకోవాలన్న ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు తూర్పు,మే10,ప్రభాతవార్త:** గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఈ నెల 14వ తేదీన నిర్వహించే జాబ్ మేళా నిరుద్యోగ యువతకు సువర్ణావకాశమని ఎమ్మెల్యే మొహమ్మద్



నసీర్ అన్నారు. శనివారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో జాబ్ మేళా వాల్ పోస్టర్ ను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి నసీర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీల్లో భాగంగా 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో పరిశ్రమల స్థాపనకు రాష్ట్రంలో పచ్చతివాచీ పరిచారని, తద్వారా యువతకు ఉద్యోగావకాశాలు రానున్నాయని చెప్పారు. జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలు పాల్గొననున్నాయని, ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పదో తరగతి నుంచి పీజీ చదివిన యువతీ, యువకులకు ఇదో గొప్ప వరమన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ ప్రాంతంలో యువతకు జాబ్ మేళాపై అవగాహన కల్పించాలని సూచించారు. గుంటూరులోని జలగం రామారావు హైస్కూల్లో జాబ్ మేళా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు యల్లావుల అశోక్, మీరావలి, చీష్టి, మహంకాళి నరసింహారావు, జాగర్లమూడి శ్రీనివాస్, కోటా పిచ్చిరెడ్డి, వంగర ఏడుకొండలు, మొహమ్మద్ హఫీజ్, శీను నాయక్, పిడతల బాబునసీర్ అబ్దుల్ సలీం తదితరులు పాల్గొన్నారు.

## ఏసి కళాశాల 1987-1990 పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**గుంటూరు విద్య,మే 10,ప్రభాతవార్త :** ఆంధ్రక్రైస్తవ కళాశాల డే అండ్ ఈవెనింగ్ కళాశాల్లో 1987-90 విద్యా సంవత్సరంలో డిగ్రీ కోర్సు చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



శనివారం ఆంధ్రక్రైస్తవ కళాశాల్లోని జేడి శీలం సెమినార్ హాల్లో జరిగింది. ఈ సమ్మేళనానికి కొంతమంది పూర్వ విద్యార్థులు నడుంబిగించి అందర్ని సమీకరించి ఎంతో ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు .1987-90విద్యా సంవత్సరంలో డిగ్రీ చదువు చెప్పిన అధ్యాపకులను సగౌరవంగా కార్యక్రమానికి ఆహ్వానించి, వేదికపై వారిని ఆసీనులను చేసి,ప్రతి పూర్వ విద్యార్థి పేరుపేరునా వారికి ధన్యవాదాలు తెలిపారు.రెండు తెలుగు రాష్ట్రాలనుంచి పూర్వ విద్యార్థులు పెద్దఎత్తున కార్యక్రమానికి హాజరై ఒకరికి ఒకరు ఆప్యాయత అనురాగాలను ఆనాటి జ్ఞాపకాలను పంచుకుంటూ ఆనందోత్సహాల మధ్య కార్యక్రమంలో పాలి భాగస్తులయ్యారు .గురు పూజ్యులు ఏసి కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఆండ్రూస్,డాక్టర్ పి.ముత్యం, ఏసి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొమ్మాలపాటి మోజేష్,ప్రకాష్ బాబు, బి.రత్నం,టి.రాధాకృష్ణమూర్తి,శారద,రాజ్యలక్ష్మి తదితరులు పూర్వ విద్యార్థుల నుండి కృతజ్ఞతాభినందనలు అందు కున్నారు.పూర్వ విద్యార్థులు వ్యక్తిగతంగా సభా వేదికపై వారి వ్యక్తిగత విషయాలతో ఆనాటి తీపి జ్ఞాపకాలను తెలియజేసి గుర్తుకు తెచ్చారు.అప్పట్లో ఏసి కళాశాల్లో డిగ్రీ చదవాలంటే సీటు దొరకటం అత్యంత కష్టం అలాంటిది మాకు సీటు దొరకటం మేము డిగ్రీ చదవడం నిజంగా మా అదృష్టమంటూ కొందరు పూర్వ విద్యార్థులు సభాముఖంగా తెలుపు కున్నారు.పల్నాడు జిల్లాలో జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులుగా చేస్తున్న ఒక పూర్వ విద్యార్థి అప్పట్లో డిగ్రీ సీటు రావడానికి డాక్టర్ పి.ముత్యం సహాయపడ్డారని,ఆయన సహాయాన్ని మరువలేనని ముత్యం చేసిన ఆ చిన్నపాటి సహాయం నన్ను విద్యావంతుడ్ని చేసిందన్నారు.తద్వారా ఎంతోమంది విద్యార్థులకు విద్యాదానం చేసే ఉపాధ్యాయ వృత్తిలో ప్రధానోపాధ్యాయునిగా ఉండడం నిజంగా ఎంతో అదృష్టమని ఆ పూర్వ విద్యార్థి తెలపటం అందరిలో ఆనందాన్ని నింపింది.ఒక పూర్వ విద్యార్థి ఆలాపించిన హిందీ సినిమా పాట అందరిలో ఉత్సాహాన్ని నింపింది.పూర్వ విద్యార్థులను ఉద్దేశించి గురుపూజ్యులు మాట్లాడారు.కార్యక్రమం ఆసాంతం ఆహ్లాదకరంగా జరిగింది.

## డిఆర్ఎన్ కళాశాల అభివృద్ధికి లక్షరూపాయిలు విరాళం అందచేసిన కాకుమాను పుల్లారావు దంపతులు

చిలకలూరిపేట,మే10,ప్రభాతవార్త: డిఆర్ఎన్ఎస్సివిఎస్ కళాశాలలో నాన్‌టీచింగ్ రిటైర్డ్ ఉద్యోగులైన కాకుమాను పుల్లారావు, వెంకట నరసమ్మ దంపతులు కళాశాల అభివృద్ధికి లక్షరూపాయిలు విరాళాన్ని శనివారం విద్యాసంఘం అధ్యక్షులు తేళ్ల సుబ్బారావు, కార్యదర్శి మైలవరపు శివానందకుమార్‌లకు అందచేశారు. ఈ సందర్భంగా పాలకవర్గ అధ్యక్షులు తేళ్ల సుబ్బారావు మాట్లాడుతూ 40 సంవత్సరాలపాటు కళాశాలలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన దంపతులు కళాశాల అభివృద్ధికి లక్షరూపాయిలు విరాళం అందించడం వారికి కళాశాల మీద ఉన్న అభిమానానికి నిదర్శనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి కుమారుడు బిసి సంఘం అధ్యక్షుడు కాకుమాను రమేష్, జర్నలిస్ట్ కాకుమాను వెంకట్, విద్యాసంఘం కోశాధికారి బచ్చు రామలింగేశ్వరరావులు పాల్గొన్నారు.



## శ్రీ సీతారామస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్‌గా గ్రంధి భాస్కరరావు నియామకం

చిలకలూరిపేట,మే10,ప్రభాతవార్త: పట్టణంలోని మెయిన్‌బజార్ నందు వేంచేసియున్న శ్రీ సీతారామస్వామి దేవస్థానం పాలకమండలి చైర్మన్‌గా భాస్కర్‌ఫ్యాన్సీ అధినేత గ్రంధి భాస్కరరావు నియమితులయ్యారు. భాస్కరరావు చైర్మన్‌గా నియమితులు కావడం పట్ల పట్టణానికి చెందిన పలువురు వ్యాపారస్తులు, ఆర్యవైశ్య సంఘాల నాయకులు, పురప్రముఖులు ఆయనకు అభినందనలు తెలియచేశారు. తనను ఈ పదవిలో నియమించినందుకు మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావుకు గ్రంధి భాస్కరరావు ధన్యవాదాలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి సభ్యులతో కలిసి తనవంతు కృషి చేస్తానని భాస్కరరావు తెలిపారు.



## 12న జరిగే పెద్దరథం తిరునాళ్లను జయప్రదం చేయండి

### -జనసేన యువనాయకుడు మండలనేని చరణ్‌తేజ

చిలకలూరిపేట,మే10,ప్రభాతవార్త: పట్టణంలో కోమటపల్లిపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి పెద్దరథం తిరునాళ్ల ఈ నెల 12వ తేదిన జరగనున్నదని, దానిని జయప్రదం చేయాలని చిలకలూరిపేట పట్టణ, పరిసర గ్రామాల ప్రజలకు జనసేన యువనాయకుడు మండలనేని చరణ్‌తేజ శనివారం విజ్ఞప్తి చేశారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల ఒక గొప్ప ఆధ్యాత్మిక వేడుక అని, ఈ తిరునాళ్లకు మతాల కతీతంగా చుట్టుపక్కల గ్రామాలనుంచే కాకుండా పక్క నియోజకవర్గాల నుంచి కూడా వేలాదిమంది భక్తులు తరలి వస్తారని తెలిపారు. ఆ రోజున స్వామివారిని దర్శించుకోవడం, పెద్దరథం లాగుటలో పాల్గొనటం భక్తులందరూ ఒక గొప్ప అనుభూతిగా భావిస్తారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు భక్తులను ఎంతగానో అలరిస్తాయని, స్థానిక కళాకారులకు ఈ తిరునాళ్ల ఒక వేదికగా నిలుస్తుందని ఆయన వివరించారు. కావున ఈ తిరునాళ్లలో ప్రజలందరూ వేలాదిగా పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.



## ఎస్ఎంఎస్ షాదీఖానా ప్రాంతంలో చలివేంద్రం ప్రారంభించిన ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు

చిలకలూరిపేటటౌన్,మే10,ప్రభాతవార్త: పట్టణంలోని ఎస్ఎంఎస్ షాదీఖానా ప్రాంతంలో శనివారం ఈనాడు మాజీ ఏజెంట్ ఉమర్ సహకారంతో మున్సిపల్ లైసెన్స్‌డ్ ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు మండుటేసవి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ మండుటేసవి చలివేంద్రం ఆ ప్రాంతంలో తిరిగే పాదచారులకు ఎంతో ఉపయోగపడుతుందని లోకేష్‌తగ్గా రాష్ట్ర కమిటీ సభ్యుడు మాదాను భానుప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లైసెన్స్‌డ్ ఇంజనీర్స్ అండ్ సర్వేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి డేవిడ్, ఉపాధ్యక్షులు శ్యాం, శ్రీనివాస్, సభ్యులు ఫిరోజ్, సాయి, ఉమర్ కుటుంబసభ్యులు, సాధిక్, బాజీ తదితరులు పాల్గొన్నారు.

## కనపర్రు గ్రామంలో కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

నాదెండ్ల,మే10,ప్రభాతవార్త: మండలంలోని కనపర్రు గ్రామానికి చెందిన మొగిలి రమేష్ శనివారం కరెంట్‌షాక్ తగిలి మృతిచెందాడు.



శుక్రవారం తమ పొలంలో వ్యవసాయపనులు ముగించుకొని మొగిలి రమేష్ అతని భార్య విజయలక్ష్మి ఇంటికి తిరిగివచ్చారు. వచ్చిన తరువాత రమేష్ ఫ్యాన్ స్విచ్ ఆన్‌చేయగా కరెంట్ షాక్ కొట్టడంతో కింద పడిపోయాడు. గమనించిన అతని భార్య కేకలు వేయడంతో ఇంటి పక్కన వారు వచ్చి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షలు చేసిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలియచేశారు. రమేష్‌కు ఇద్దరు కుమారుడు ఉన్నారు. నాదెండ్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## న్యాయశాఖ సిబ్బందికి ప్రమోషన్లు

**గుంటూరు లీగల్,మే 10,ప్రభాతవార్త :** జిల్లా కోర్టుల్లో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగుల ప్రమోషన్ల ప్రక్రియకు సహకరిస్తానని జిల్లా పోర్టుపోలియో జడ్జి ,రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య పేర్కొన్నారు.శనివారం గుంటూరు జిల్లా కోర్టులో జ్యూడిషియల్ ఆఫీసర్స్ వర్క్‌షాప్ కార్యక్రమానికి విచ్చేసిన జస్టిస్ జయసూర్యను న్యాయశాఖ నాల్గవ తరగతి ఉద్యోగుల రాష్ట్ర,నగర సంఘ కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఈ సందర్భంగా సభ్యులు ప్రస్తావించారు.జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ చక్రవర్తి నేతృత్వంలో త్వరితగతిన ప్రమోషన్ల ప్రక్రియ చేపడతామని హామీ ఇచ్చారు.సంఘ రాష్ట్ర అధ్యక్షులు రామరాజు చంద్రశేఖర్,గుంటూరు నగర అధ్యక్షులు రాచకొండ శ్రీనివాసరావు,కార్యదర్శి సొర్రా బైరాగి,పలువురు సభ్యులు పాల్గొన్నారు.

## బాలభాను విద్యాలయంలో మాతృదినోత్సవ వేడుకలు

**కారంపూడి, మే 10 ప్రభాతవార్త:** ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే మాతృదినోత్సవ వేడుకలను కారంపూడిలోని బాలభాను విద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. టీచర్ హనుమంతరావు విద్యార్థులకు గ్రీటింగ్ కార్డులు తయారు చేయడంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డా॥ కంఠంరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, మాతృత్వాన్ని జరుపుకోవడం శుభప్రదమని, ఈ సంవత్సరం మాతృదినోత్సవ ఇతివృత్తం తల్లిబిడ్డల బంధం యొక్క శాశ్వత స్వభావాన్ని నొక్కి చెబుతుందన్నారు. తల్లులు జీవితాంతం ఇచ్చే శాశ్వత ప్రేమ చాలా గొప్పదని హెచ్ఎం విష్ణుప్రియ గుర్తు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ఉపాధ్యాయులకు యోగదా ఛారిటబుల్ ట్రస్టు పండ్లు, స్వీట్లు పంపిణీ చేసింది. నిర్వాహకులకు పాఠశాల కరస్పాండెంట్ శివానంద మాస్టర్ శుభాకాంక్షలు తెలిపారు.



## విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా

**రాజుపాలెం, మే 10 ప్రభాతవార్త :** మండలంలోని గణపవరం గ్రామంలో శనివారం శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠ, శ్రీపోలేరమ్మ పోతురాజు స్వామి



వార్ల నూతన దేవాలయ శిలా విగ్రహ, ప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులు భక్తులకు ఉండాలని వేడుకున్నారు. ముందుగా ఎమ్మెల్యే కన్నాకు గ్రామస్తులు, కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో వేద పండితులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## కన్నుల పండువగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

**రెంటచింతల, మే 10 ప్రభాతవార్త:** మండలంలోని పశర్లపాడు గ్రామంలోని బ్రహ్మంగారి గుడిలో గోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ క్రతువు వేడుకలు శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా గ్రామ విశ్వకర్మల ఆధ్వర్యంలో గ్రామస్థుల సహాయ సహకారాలతో కాలజ్ఞాని, పురోగామి సంఘసంస్కర్త, భూత భవిష్యత్ వర్తమాన కాలజ్ఞానంతో మహిమాన్వితుడైన వీర బ్రహ్మంను భక్తులు భక్తి శ్రద్ధలతో పూజించి ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. గుడిలో పూజారి లక్ష్మీనారాయణాచారి ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాతం, నామ సంకీర్తన, అభిషేకం, మధ్యాహ్నం



గోవిందస్వామి ధర్మపత్ని వీరపాపమాంబ ఆరాధన, సాయంత్రం పురాణ కాలక్షేపం, కలశోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. స్వామివారిర కల్యాణోత్సవంలో గ్రామ ప్రజలు, భక్తులు, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తరించారు. ఈ ఆధ్యాత్మిక సంబంరాల్లో భాగంగా విద్యుత్తు ప్రభలు ఏర్పాటుతోపాటు పలు సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి.

## నేడు సింగరుట్ల లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం

**కారంపూడి, మే 10 ప్రభాతవార్త:** కారంపూడి మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామ శివారులోని సింగరుట్లలో వేంచేసి ఉన్న లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు వ్యవస్థాపక ధర్మకర్త గుండాల శ్రీనివాసరావు, కార్యనిర్వహణ అధికారి చపారపు శివనాగిరెడ్డి తెలిపారు.



ఉదయం 9 గంటలకు నరసింహస్వామి హోమం నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు కల్యాణ మహోత్సవం వేడుకలు నిర్వహించనున్నారు. అనంతరం దేవాలయంలో గ్రామ పెద్దలు, ప్రజల సహకారంతో అన్నదానం చేయనున్నారు.సాయంత్రం 7 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వేడుకల్లో పాల్గొని ప్రజలందరూ జయప్రదం చేయాలని కోరారు.

## ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలంటూ విజయసంకల్ప పూజ

**మాచర్ల, మే 10 ప్రభాతవార్త:** భారతదేశం మీద పాకిస్తాన్ జరిపే ఉగ్రవాద దాడులను భారతసైన్యం ధీటుగా ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలను ఆ భగవంతుడు కల్పించాలని, భారతదేశ ప్రధాని నరేంద్రమోదీ పేరు మీద,



త్రివిధ దళాలు, భారత సైన్యానికి మనోధైర్యాన్ని అందించాలని, దేశానికి విజయం చేకూర్చాలని మాచర్ల పట్టణంలో పూజలు నిర్వహించారు. పట్టణంలోని బస్టాండ్ సెంటర్లో కొలువైన వెంకటేశ్వరస్వామి దేవాలయంలో విజయ సంకల్ప పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల పట్టణ బీజేపీ అధ్యక్షుడు ఓర్సు క్రాంతికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కూనిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా కోఆప్షన్ మెంబర్ బొగ్గవరపు మస్తానరావు, నియోజకవర్గ కోకన్వీనరు పోకూరి కాశీపతి, పట్టణ మాజీ ప్రధాన కార్యర్శులు ఆలేటి సజ్జనయేలు, ఏచూరి సురేష్‌బాబు, పట్టణ ఉపాధ్యక్షులు మారం వంశీకృష్ణ, బొడ్డుపల్లి ఈశ్వరయ్య, పట్టణ కార్యదర్శులు ప్రసన్న కుమార్, శ్రీనివాసరాజు, మానుపాటి రమణ, అన్నవరపు ఏడుకొండలు, వాసుదేవరాజు, ఆర్ఎస్ఎస్ కనకంటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన్స్ వర్సిటీ అధ్యాపకుడికి పీహెచ్‌డీ


**పొన్నూరు, మే 10,ప్రభాతవార్త:** చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని డిపార్టుమెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ సుధీర్ సన్నికంటికి తమ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ విభాగంలో పీహెచ్‌డీ పట్టా అందించిందని వర్సిటీ వైస్ చాన్సలర్, కల్నల్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అస్సెసింగ్ ద ఇంపాక్ట్ ఆఫ్ సెలిబ్రిటీ ఎండార్స్‌మెంట్ ఇన్ డిటర్మైనింగ్ ద కస్టమర్ బయ్యింగ్ ఇంటెన్షన్స్ ఏ స్టడీ అమాంగ్ ద సౌత్ ఇండియన్ బ్రాండెడ్ గోల్డ్ జువెల్లరీ కస్టమర్స్ అనే అంశంపై పరిశోధన



చేశారని తెలిపారు. ఈయనకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని డిపార్టుమెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శివకోటిరెడ్డి గైడ్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. ఈయన తన పరిశోధనలో భాగంగా మొత్తం 4 స్కోపస్ జర్నల్ పబ్లికేషన్ పేపర్లు పబ్లిష్ చేశారని తెలియజేశారు. పీహెచ్‌డీ పట్టా పొందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ సుధీర్ సన్నికంటిని విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చాన్స్‌లర్ కల్నల్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు అభినందించారు.

## గీతా పారాయణ నిర్వహించిన మహిళలు

**యడ్లపాడు, మే 10, ప్రభాతవార్త :** మండల పరిధిలోని సొలస గ్రామంలో వేంచేసియున్న శ్రీ భూసమేత రంగనాయక స్వామి వారి వార్షికోత్సవాలలో భాగంగా శనివారం మహిళలు గీతా పారాయణ



కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుండి స్వామివారికి సుప్రభాతసేవ, బిందె తీర్ధము, నిత్యార్చన విశేష హోమములు, గ్రామ బలిహరణ, తదుపరి భగవత్ గీతా పారాయణం, భజనా కార్యక్రమం తీర్ధ ప్రసాద వినియోగము అనంతరం సాయంకాల సమయంలో అర్చన, హోమము, గ్రామ బలిహరణ, హనుమత్ వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్దులు భారీగా పాల్గొన్నారు.

## యుద్ధం చేస్తున్న సైనికులకు దైవబలం కూడా తోడ్పడాలి

**యడ్లపాడు, మే 10, ప్రభాతవార్త :** దేశాన్ని ఉగ్రవాదుల నుండి కాపాడటానికి ప్రాణాన్ని పణంగా పెట్టి పాకిస్తాన్ మీద వీరోచితంగా పోరాటం చేస్తున్న సైనికులకు మానవ శక్తితోపాటు దైవ బలం కూడా కావాలని మండల బిజెపి నాయుకులు పేర్కొన్నారు. మండల పరిధిలోని పలు దేవాలయాలలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోడీకి భారతీయులందరు అయనకు




మద్దతుగా నిలుస్తామని దైవం ముందు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు టి సత్యనారాయణ, కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి అంజిరాజు డి వెంకటేశ్వరరాజు, అర్ సుబ్బారావు, ఐ రామారావు, భీమరాజు, శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ డిజిపి డాక్టర్ ఎం మాలకొండయ్య సేవలుస్ఫూర్తిదాయకం

### -కాళహస్తి సత్యనారాయణ

**పెదనందిపాడు మే 10 (ప్రభాతవార్త)** పోలీసు డిపార్ట్మెంట్లో డాక్టర్ మాల కొండయ్య చేసిన సేవలు నేటి తరానికి మార్గదర్శకం అని. వారి సేవలు స్ఫూర్తిదాయకమని.విశ్రాంత విజిలెన్స్ ఎస్పి. కళాశాల అభివృద్ధికి పాలకవర్గం చేస్తున్న కృషిని ప్రశంసించారు. అనంతరం కళాశాల పాలకవర్గం మాలకొండయ్యను ఘనంగా సత్కరించారు . పెదనందిపాడు లో నూతనంగా నిర్మించిన



పెదనందిపాడు కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కాళహస్తి సత్యనారాయణ అన్నారు. శనివారం సాయంత్రం. పి ఎ ఎస్ కళాశాలను విశ్రాంత పోలీస్ అధికారి మాలకొండయ్య సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఈ కళాశాల గోల్డెన్ జూబ్లీ ఫంక్షన్ లో తాను ముఖ్య అతిథిగా పాల్గొన్నానని . ఈరోజు మళ్లీ కళాశాలను సందర్శించడం తనకు సంతోషంగా ఉందన్నారు. పాలకవర్గ అధ్యక్షులు కాళహస్తి సత్యనారాయణ గృహాన్ని వారు సందర్శించారు. ఈ కార్యక్రమములో కళాశాల జాయింట్ సెక్రెటరీ నర్రా బాలకృష్ణ , పాలకవర్గ సభ్యుల వీరయ్య , కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి వీర రాఘవయ్య,మరియు అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది. పెదనందిపాడు ఎస్ఐ ఏ . మధు పవన్ తదితరులు పాల్గొన్నారు.

## కంప్యూటర్ అప్లికేషన్స్‌లో బహుళ శాఖ పరిశోధనలపై జాతీయ స్థాయి సదస్సు


**తాడేపల్లి,మే 10,ప్రభాతవార్త :** కెఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయ బిసిఏ మరియు ఎంసిఏ విభాగాలు సంయుక్తంగా నిర్వహించిన కంప్యూటర్ అప్లికేషన్స్ లో బహుళ శాఖ పరిశోధనలపై



జాతీయస్థాయి సదస్సుని సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సుబ్రహ్మణ్యం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.సదస్సుకు ముఖ్యఅతిధిగా ఆదికవి నన్నయ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ఆచార్య పి.సురేష్ వర్మ,గౌరవాతిధి ఎన్ఐటీ,వరంగల్ ఆచార్యులు ఈ.సురేష్‌బాబు లు విచ్చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఆర్టిఫిషల్ ఇంటెలిజన్స్,డేటా సైన్స్,సైబర్ సెక్యూరిటీ లు అన్ని రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకు రానున్నాయని వాటిని అందుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్క విద్యార్థికి ఉందన్నారు.ఎవరైనా అప్‌డేట్ కాకపోతే ఔట్‌డేట్ అయిపోవాల్సిందేనని ఇలాంటి సదస్సులు విద్యార్థులు,పరిశోధకులు విషాయాలపై సమగ్ర పట్టు సాధించడానికి ఉపయోగ పడతాయన్నారు.200లకు పైగా విద్యార్థులు తమ పరిశోధన పత్రాలు,ప్రాజెక్టు ఇందులో ప్రదర్శించడాన్ని వారు అభినందించారు. రిజిస్ట్రార్ సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి యూనివర్సిటీ చేస్తున్న కార్యక్రమాలను వివరించారు.కార్యక్రమంలో వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.రాజశేఖం రావు,ప్రొఫెసర్ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్,డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్,రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంసీఏ విభాగాధిపతి కిరణ్,బిసిఏ విభాగాధిపతి భగవాన్,సదస్సు కోఆర్డినేటర్స్ కిరణ్‌కుమార్, వెంకటేశ్వరరావు, అధ్యాపకులు రామకృష్ణ, కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీలక్ష్మీ నరసింహస్వామి కళ్యాణ మహోత్సవం

**గురజాల, మే 10 ప్రభాతవార్త:** మండలంలోని జంగమహేశ్వరపురంలో వేంచేసియున్న పల్నాడు యాదాద్రి శ్రీభూ సమేత నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు వేణుగోపాలచార్యులు తన



బృందంతో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు జరిపారు. అనంతరం పల్లకి సేవ, కళ్యాణం జరిపారు. యెనుముల మురళీధరరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మహా అన్నదానంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటి అన్ని ఏర్పాట్లు చేసింది. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, కేశవరెడ్డి తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు.

## పలు దేవాలయాలలో ప్రత్యేక పూజలు చేసిన బిజెపి నాయకులు

చిలకలూరిపేట,మే10,ప్రభాతవార్త: భారతదేశంపై పాకిస్తాన్ జరిపే ఉగ్రదాడులను భారత సైన్యం ధీటుగా ఎదుర్కొనే శక్తి సామర్ధ్యాలను ఆ భగవంతుడు కల్పించాలని, ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని, భారతదేశ ప్రధాని నరేంద్రమోడీ, త్రివిధ దళాలు, భారతసైన్యానికి మనోధైర్యాన్ని అందించాలని, దేశానికి విజయం చేకూర్చాలని దేశ వ్యాప్తంగా బిజెపి ఆధ్వర్యంలో అన్ని దేవాలయాలలో విజయసంకల్ప పూజలు నిర్వహిస్తున్నారు. దానిలో బాగంగా చిలకలూరిపేటలో స్దానిక బిజెపి నాయకులు శనివారం కళామందిర్ సెంటర్ వద్దనున్న బాలత్రిపుర సుందరీ



సమేత నాగేశ్వరస్వామి దేవాలయం, శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం నందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బిజెపి కన్వీనర్ తాటిపర్తి జయరామిరెడ్డి, కో కన్వీనర్ మల్లెల శివనాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కస్తూరి వెంకటేశ్వర్లు, ఓబిసి మోర్చా ప్రధాన కార్యదర్శి ఆదిమూలం గురుస్వామి, బిజెపి నాయకులు పులుగుజ్జు మహేష్, పొత్తూరి బ్రహ్మానందం, ఉప్పాల భాస్కరరావు, ఆలా శివకోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తంగేడుమల్లి మేజర్ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే చదలవాడ

రొంపిచర్ల, మే 10 ప్రభాతవార్త : మండలంలోని తంగేడుమల్లి మేజర్ కాలువ పనులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు శనివారం



ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు మాట్లాడుతూ రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. రూ.45 లక్షలతో మండలంలో కాలువల ఆధునీకరణ చేపట్టామన్నారు. కాలువలకు సంబంధించిన జెంగిల్ క్లియరెన్స్, పూడికతీత పనులు, కాలువ కట్టలను పటిష్ఠం చేయడం,షట్టర్లకు మరమ్మత్తులు చేయడం నిర్వహిస్తున్నామన్నారు. అదే విధంగా నరసరావుపేట మండలంలోనూ పనులకు నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కాలువ చివరి భూములకు నీరు అందించడమే తమ లక్ష్యమన్నారు. గత ఐదు సంవత్సరాల వైకాపా ప్రభుత్వ హయాంలో కాలువలకు ఎటువంటి మరమ్మత్తులు జరగలేదన్నారు. రైతులు సంతోషంగా ఉన్నప్పుడే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అమరావతి నిర్మాణంతో పాటు పోలవరం నిర్మాణం పూర్తి చేసుకుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటి నుండి పారిశ్రామికవేత్తలను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యం : బాపట్ల జిల్లా కలెక్టరు

బాపట్ల,మే10,ప్రభాతవార్త: ప్రతి ఇంటి నుండి పారిశ్రామికవేత్తలను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు.శనివారం బాపట్ల మండలం తూర్పు బాపట్ల కొండబొట్లపాలెం జడ్పీ




ఉన్నత పాఠశాల పక్కనే ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎం ఈ ఎఫ్ ఎఫ్ సి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ వెంకట మురళి, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ కలిసి భూమి పూజ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో సూక్ష్మ, చిన్న పరిశ్రమల కొరకు ఇండస్ట్రియల్ పార్క్ నిర్మిస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సంకల్పం తక్షణమే అమల్లోకి వచ్చేలా ప్రభుత్వం వేగంగా పనిచేస్తుందన్నారు. ప్రకటించిన వెంటనే భూమిని గుర్తించడం, నిర్మాణ పనులు ప్రారంభించడానికి ఏర్పాట్లు జరిగాయన్నారు. మొదటిగా బాపట్లలో 4.5 ఎకరాల భూమిలో పార్క్ నిర్మిస్తున్నట్లు వివరించారు. జాతీయ రహదారికి పక్కనే పార్క్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం నుంచి ఈ పార్క్ కి రూ.12 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. రెండు నుంచి మూడు అంతస్తులు ఉండేలా 80 గదులు నిర్మిస్తున్నామన్నారు. ఇందులో 30 గోదాములు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎఫ్ఎఫ్‌సి ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లో ఉత్పత్తుల తయారీదారులకు అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. పొదుపు మహిళలు, యువతీ, యువకులు ఎవరైనా ఉత్పత్తులు తయారు చేసుకుంటామని ముందుకు వస్తే వారికి కేటాయిస్తామన్నారు.అన్ని మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రహదారులు, విద్యుత్, భవనం, గోదాములు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఇక్కడకు వచ్చి తమ ఉత్పత్తులు ప్రారంభించడానికి అన్ని సిద్ధం చేస్తామన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ మాట్లాడుతూ యువతి, యువకులను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలనుగా మార్చాలని ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చిన్న, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు ఎంతగానో సహకరిస్తున్నాయన్నారు. అన్ని రకాల ఉత్పత్తులకు ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ కేంద్రంగా మారనుందన్నారు. రైతుల సైతం తమ పంటలను నిల్వ చేసుకునేలా గోదాములు నిర్మించనున్నట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పారిశ్రామిక రంగంగా అభివృద్ధి చేయడానికి ఉన్నత లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుకు వెళ్తున్నారన్నారు. పార్కుల నిర్మాణం, అందులో మౌలిక సదుపాయాలు కల్పించడం ఔత్సాహికులకు ఎంతో మేలు చేసినట్లేనన్నారు. చిన్నచిన్న ఉత్పత్తులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఎంతో సహకరిస్తున్న విషయాలను ప్రజలు గుర్తించాలన్నారు. బాపట్ల పట్టణ అభివృద్ధి సంస్థ చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు మాట్లాడుతూ యువతీ, యువకులకు ప్రభుత్వం కల్పించే గొప్ప అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.పరిశ్రమల స్థాపనతో యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా దొరుకుతాయని తెలిపారు. ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా అమలులోకి తెస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో బాపట్ల ఆర్డిఓ పి గ్లోరియా, ఏపీఐఐసీ గుంటూరు జోనల్ మేనేజర్ నరసింహారావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వై రామకృష్ణ, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పట్టణంలో రూ.కోటి 30 లక్షల పనులకు శంఖుస్థాపన చేసిన ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, మే 10 ప్రభాతవార్త : పట్టణంలోని రూ.కోటి 30 లక్షల పనులకు శనివారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శంఖుస్థాపన చేశారు. 9వ



వార్డు గుంటూరు రోడ్డు నుండి జడ్జి బంగ్లా వరకు రూ.37 లక్షలతో బీటీ రోడ్డు, అన్న క్యాంటీన్ నుండి జగజ్జీవన్‌రామ్ విగ్రహం వరకు రూ.19.70 లక్షలతో సి.సి.రోడ్డు, ప్లాట్ ఫామ్, గవర్నమెంట్ హాస్పటల్ నుండి మీసేవ సెంటర్ వరకు రూ.29 లక్షలతో నిర్మించిన బిటీ రోడ్డు, తారకరామాసాగర్ వాకింగ్ ట్రాక్‌కు రూ.16.40 లక్షలతో అభివృద్ధి, 26వ వార్డులో రూ.11 లక్షలతో సి.సి.డ్రైన్స్, 19వ వార్డులో రూ.17.50 లక్షలతో కల్వర్టులు, బ్రిడ్జికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కన్నా వెంట వివిధ హోదాలలో ఉన్న జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు ఉన్నారు.

# ఐడిపిఎస్‌లో సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట, మే 10 ప్రభాతవార్త : మండలంలోని కేసానుపల్లి గ్రామం వద్ద ఉన్న ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో శనివారం సమ్మర్ క్యాంప్‌ను శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ప్రారంభించారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్, ప్రముఖులు వేములపల్లి వెంకట నరసయ్య, స్కూల్ డైరెక్టర్ నాగోతు సబిత, ప్రిన్సిపాల్ రేఖ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు పాఠశాలలో జరుగుతున్న కార్యక్రమాలను అభినందించారు. అదే విధంగా




పాఠశాల చైర్మన్ నాగోతు ప్రకాష్ విద్యార్థుల కొరకు నిర్వహించే శిక్షణా శిబిరాలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. చైర్మన్ డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ ఐఐటి, జెఇఇ, నీట్ అవగాహన సదస్సును ప్రముఖ శిక్షణా సంస్థ ఎలైన్ కెరీయర్ ఇనిస్టిట్యూట్ సౌజన్యంతో నిర్వహించామన్నారు. జాతీయస్థాయి పోటీ పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలంటే సరైన దిశలో ప్రణాళికాబద్ధమైన శిక్షణ అవసరమన్నారు. ఐడిపిఎస్ నందు 6వ తరగతి నుండి 12వ తరగతి వరకు ప్రత్యేక కోచింగ్ జరుగుతుందని డాక్టర్ ప్రకాష్ వివరించారు.

# జవాన్ మురళీనాయక్‌కు ఎమ్మెల్యే కన్నా నివాళి


సత్తెనపల్లి, మే 10 ప్రభాతవార్త : పట్టణంలోని రఘురాంనగర్ గల తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శనివారం పాకిస్తాన్ సైన్యం జరిపిన కాల్పుల్లో వీరమరణం పొందిన మురళీనాయక్‌కు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ



సానుభూతిని తెలియజేశారు. దేశం మొత్తం వారి కుటుంబానికి అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలియజేశారు. కార్యక్రమంలో వివిధ హోదాలలో ఉన్న పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# త్రికోటేశ్వరస్వామికి లక్ష మల్లెపూల పూజ

నరసరావుపేట, మే 10 ప్రభాతవార్త : మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండపై వేంచేసియున్న శ్రీ త్రికోటేశ్వరస్వామికి లక్ష మల్లెపూలతో ప్రత్యేక పూజా కార్యక్రమం 12వ తేదీ సోమవారం నిర్వహిస్తున్నట్లు సహాయక కమిషనర్, కార్య నిర్వహణాధికారి డి.చంద్రశేఖరరావు శనివారం తెలిపారు. వైశాఖ పౌర్ణమి సందర్భంగా ప్రతి ఏడాది సాంప్రదాయంగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. దాతల సహకారంతో నిర్వహించే లక్ష మల్లెపూల పూజా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భక్తులను కోరారు. త్రికోటేశ్వరస్వామి ఆశీస్సులు అందుకోవాలని, తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.



# ఏషియన్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

నరసరావుపేట, మే 10 ప్రభాతవార్త : ఏషియన్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రముఖ వైద్యులు డాక్టర్ త్రివేణి కొండారెడ్డి శనివారం తెలియ జేశారు. మాతృ దినోత్సవాన్ని పురస్కరించు



కొని 11వతేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు వైద్య శిబిరం జరుగుతుందన్నారు. శిబిరంలో గర్భిణీలకు, సంతానం లేనివారికి వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తామన్నారు. అవసరమైనటువంటి గైనకాలజిస్ట్ కన్సల్టేషన్, అల్ట్రాసౌండ్ స్కాన్, రొమ్ము పరీక్షలు, రక్త పరీక్షలు ఉచితంగా చేయడం జరుగుతుందన్నారు. ఏషియన్ హాస్పటల్స్‌లోని ఐవిఎఫ్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా డాక్టర్ త్రివేణి కొండారెడ్డి కోరారు.

# వేసవికాలంలో గర్భిణీలు తగిన జాగత్తలు తీసుకోవాలి : మండల వైద్యాధికారి సుమంత్

కొల్లిపర,మే 10 ప్రభాతవార్త: వేసవికాలంలో గర్భిణీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి సుమంత్ అన్నారు.శనివారం మండల కేంద్రం కొల్లిపరలో వైద్యాధికారులు ఫ్యామిలీ పిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపు నిర్వహించారు.ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ బీపీ,షుగర్ వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహాల మేరకు మందులు వాడుకోవాలన్నారు.దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ప్రతి



నెల తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగించుకోవాలన్నారు.కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు,ఎఎన్ఎం లక్ష్మీ,డీఈవో బొమ్ము కోటిరెడ్డి,ఆషా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పేదలు ఉపాధి పదకాన్ని సద్వినియోగించుకోవాలి : ఎపిఓ వెంకయ్య

కొల్లిపర,మే 10 ప్రభాతవార్త: పేద ప్రజలు ఉపాధి హామీ పదకాన్ని సద్వినియోగించుకోవాలని ఏపిఓ వెంకయ్య అన్నారు.శనివారం మండల పరిధిలోని మున్నంగి,కొల్లిపర,వల్లభాపురం తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ ఉపాధిహామీ పధకం ద్వారా నిరుపేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడే



అవకాశం ఉందన్నారు.పేదప్రజలకు ఉపాధి కల్పించటానికే ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు,పీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా ముగిసిన పరిషత్ నాటికలు

పొన్నూరు, మే 10,ప్రభాతవార్త: అట్టహాసంగా ప్రారంభమై ముగింపు ఉత్సవాన్ని పొన్నూరు కళాపరిషత్ పూర్తి చేసుకొంది. శనివారం రాత్రి జరిగిన నాటిక ప్రదర్శనలలో మొదటిగా పి.టి.మాదవ్ రచించిన జనరల్ బోగీలు అనే నాటిక నేటి రైలు ప్రయాణంలోని వాస్తవాలను వెలికి తీసింది. ప్రయాణ సాధనాలు ఎన్ని ఉన్నప్పటికీ రైలు ప్రయాణం ప్రతి సామాన్యునికి



అందుబాటులో ఉంటుందని, అందులో జనరల్ బోగీలు చార్జి తక్కువతో దూర ప్రయాణానికి కూడా అనుకూలంగా ఉంటుందని కొనసాగే ఈ నాటికలో ముఖ్యంగా రైలు ప్రమాదం జరిగినప్పుడు జనరల్ బోగీలోని ప్రయాణీకులు గుర్తించబడటంలేదు. ఎందుకంటే అతని వద్ద టిక్కెట్ మాత్రమే ఉంటుంది కానీ, పేరు రిజిస్ట్రేషన్ కాదు. అందువల్ల ఎందరో ప్రయాణీకులు ఈ ప్రమాదాల్లో చనిపోయినప్పటికీ గుర్తించబడలేదు. ఒకసాటి మహిళ కొడుకు జాడ కోసం హైకోర్టులో పిల్ వేస్తుంది. తన కుమారుడు రైలు ప్రయాణంలో మరణించాడని, కొడుకు జాడ ఇప్పటికీ తనకు తెలియలేదని, దీనికంతటికి ఎవరు కారణం అని ప్రశ్నిస్తుంది. ప్రజాప్రతినిధులకు, రైల్వే ఉన్నతాధికారులకు ఉత్తరాలు వ్రాయడం తప్పు పటిన పోలీసులు ఆమెను అరెస్టు చేస్తారు. ఇది ఎంత వరకు సబబు అని రచయిత ప్రశ్నించాడు. ఇక రెండవ నాటిక ప్రత్యేక ప్రదర్శనగా శ్రీ సద్గురు కళానిలయం వారు ప్రదర్శించారు. కళా రూపాలను ఆవిష్కృతం చేస్తున్న ఈ నాటిక ఒక కళాకారుడు ఆదరించే కళా హృదయులకు అందించడం వారసత్వమే కదా..? అని నిరూపిస్తూ కమనీయం అనే ఈ నాటిక అందరిని ఆకట్టుకుంది. కళాభిమానాన్ని భావితరాలకు పరిచయం చేస్తూ,వైజ్ఞానికంగా ఎన్నో మార్పులు వచ్చినా కళారూపాలు ప్రదర్శించే చోటుకే ప్రేక్షకుడు వచ్చేలా నిర్ణయం తీసుకొంటాయని, సమాజ ఆవిష్కరణ వైపు అడుగులు వేయించే కమనీయమైన కళారూపాలను ఆదరించాలని ఈ కథా సారాంశాన్ని బహు చక్కగా ప్రదర్శించారు. గత నాలుగు రోజులుగా జరుగుతున్న ఈ నాటిక ప్రదర్శనలకు బహుమతులను అందజేశారు. ఈ బహుమతుల అందజేతను తరువాత సంచికలో అందించగలము. తొలుత చల్లా దేవాన్షినాయుడు, నటరాజ కూచిపూడి నాట్య నిలయం పొన్నూర విద్యార్థులచే నిర్వహించిన శాస్త్రీయ నృత్యం ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రేక్షకులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కళాపరిషత్ గౌరవాధ్యక్షుడు నన్నపనేని రఘునాథ్, అధ్యక్షుడు ఎస్.ఆంజనేయులు నాయుడు, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆకుల సాంబశివరావు, ఉపాధ్యక్షులు ఎస్.శివకుమార్, డిఎస్ఆర్ కోటేశ్వరరావు, కార్యదర్శి సిహెచ్‌వి రామకృష్ణారావు, సంయుక్త కార్యదర్శి ఎం.విజయకుమార్‌రెడ్డి, కోశాధికారి గుమ్మడి సోమయాజులు, సహాయ కోశాధికారి కొల్లిపర సత్యనారాయణ తదితరులు ఏర్పాట్లు చేశారు.

# శాంతి భద్రతల పరిరక్షణ పై అధికారులు చర్యలు తీసుకోవాలి

## -బాపట్లజిల్లా ఎస్పీ

బాపట్ల,మే10,ప్రభాతవార్త: రాష్ట్రంలోని ఎస్పీ లు ఆపై స్థాయి అధికారులు శాంతి భద్రతల పరిరక్షణ పై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా అన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా శనివారం రాష్ట్రంలోని వివిధ జిల్లాల ఎస్పిలు ఆపై స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ, ఇతర పలు అంశాల గురించి సమీక్షించారు.ఈ సమావేశానికి బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి స్థానిక క్యాంప్ కార్యాలయం నుండి హాజరయ్యారు. అనంతరం జిల్లా ఎస్పీ



మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా రాష్ట్రంలోని వివిధ జిల్లాల ఎస్పిలు ఆపై స్థాయి అధికారులతో రాష్ట్ర డిజిపి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం ఏర్పాటు చేశారన్నారు. భద్రత ప్రమాణాలను పెంపొందించుకుని, శాంతి భద్రతల పరిరక్షణ, గంజాయి వంటి మాదక ద్రవ్యాల నియంత్రణ, సీసీ కెమెరాల ద్వారా బోర్డర్ చెక్ పోస్టులను పరిశీలించుట, నిర్మానుష్య ప్రదేశాల్లో నేరాలు అధికంగా జరగటానికి అవకాశం ఉన్న ప్రాంతాల్లో డ్రోన్ ల ద్వారా నిఘా ఏర్పాటు చేసే విధానం,పాత నేరస్తుల కదలికల పై నిఘా ఉంచడం, జిల్లాలతో ఉన్న సరిహద్దు ప్రాంతాలు, జిల్లాలోని ముఖ్యమైన ప్రాంతాల్లో నాకాబంది, వాహనాలు తనిఖీలు నిర్వహించడం, గంజాయి వినియోగించేవారు అమ్మే వారి మీద నిఘా, పోలీస్ సిబ్బంది యొక్క సంక్షేమం తదితర అంశాల విషయాల పై సమీక్షించి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేసారన్నారు. ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైన ప్రజలకు సేవలందించుటకు జిల్లా పోలీస్ యంత్రాంగం సంసిద్ధంగా ఉందన్నారు. ప్రజల పరిసర ప్రాంతాల్లో ఏమైనా అనుమానస్పద వస్తువులు కానీ, వ్యక్తులు కానీ గమనిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ కు గాని లేదా 100,112 నంబర్ కి కానీ ఫోన్ చేసి తెలియపరచాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగించుకోవాలి

## - తహశీల్దార్ గుమ్మడి సిద్దార్థ

కొల్లిపర,మే 10 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కార వేదికను మండలంలో అన్ని గ్రామాల



ప్రజలు సద్వినియోగించుకోవాలని తహశీల్దార్ గుమ్మడి సిద్దార్థ అన్నారు.శనివారం మండల కేంద్రం కొల్లిపరలో శ్రీజనార్ధనస్వామి ఆలయం వద్ద సోమవారం ఉదయం 10 గంగటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఏర్పాట్లను ఆయన ఎంపీడీఓ విజయలక్ష్మీతో కలసి పరిశీలించారు.ఈ సందర్భంగా సిద్దార్థ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ హాజరుకానున్నారని ప్రజలు నేరుగా సమస్యలను ఆయనకు తెలియజేయవచ్చున్నారు.మండల..డివిజెన్ స్థాయి అధికారులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారని చెప్పారు.

# యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి : అర్బన్ సిఐ వీరానాయక్

పొన్నూరు, మే 10,ప్రభాతవార్త: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లావూరి వీరానాయక్ సూచించారు. స్థానిక అర్బన్ స్టేషన్‌లో శనివారం రాత్రి జరిగిన




విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటుపడి యువత తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని చెప్పారు. రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉందన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించబోమన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. అర్బన్ పరిధిలో పేకాట, సింగిల్‌నెంబర్, మట్కా, జూదం, అక్రమ రేషన్ బియ్యం తరలింపు, మద్యం సేవించి విచ్చలవిడిగా రోడ్లపై తిరగడం వంటి వాటిపై ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నా మన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే జరిమానా విధించడంతోపాటు,చర్యలుకూడా తీసుకొంటా మన్నారు. మైనర్లకు ఏ రకమైన వాహనాలు ఇవ్వ వద్దన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చినట్లయితే పోలీసులు పట్టుకొంటే ముందుకుగా వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. వాహనాలను నడిపేవారు తప్పని సరిగా నిబంధనలు పాటించాలన్నారు. ట్రిపుల్‌రైడ్ చేయడం చట్టరీత్యానేరమన్నారు. ట్రిపుల్‌రైడర్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. సంబంధిత వ్యక్తులకు జరిమానాలు విధిస్తా మన్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ తదితరాలను పోలీసులు అడిగినప్పుడు చూపించాల్సి ఉంటుందన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నట్లు చెప్పారు. పాద చారులకు, వాహనదారులకు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకొంటా మన్నారు. పోలీసులకు ప్రజలు సహకరిస్తే పట్టణంలో ప్రశాంతమైన వాతావరణం కలిగించే అవకాశం ఉంటుందన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు పౌరులు గుర్తిస్తే తమకు సమాచారం ఇవ్వవచ్చున్నారు. సమాచారం ఇచ్చినవారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. సమావేశంలో అర్బన్ ఎస్సై వాగాల శ్రీహరి తదితరులున్నారు.

# వీరసైనికుడు మురళీనాయక్ త్యాగాన్ని భారతజాతి ఎన్నటికీ మరచిపోదు

గుంటూరు కల్చరల్,మే 10,ప్రభాతవార్త : పాకిస్థాన్‌తో పోరాడే క్రమంలో తెలుగుబిడ్డ మురళీనాయక్ ప్రాణాలు కోల్పోవటం




విషాదకరమని ఆ వీర సైనికుని త్యాగాన్ని భారతజాతి ఎన్నటికి మరచిపోదని అవగాహన సంస్థ సభ్యులు,సంస్థ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమంలో విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య మాట్లాడుతూ 25ఏళ్ళ వయస్సులో మాతృభూమి కోసం ప్రాణాలర్పించి అమరుడైన మురలీ నాయక్ త్యాగాన్ని దేశమంతా గుర్తుపెట్టుకుంటుందన్నారు.విశ్రాంత ఇంజనీర్ ఎన్.సదాశివమ్ మాట్లాడుతూ దేశరక్షణకు సేవలందిస్తూ పాక్ జవాన్ల తూటాలకు మురళీనాయక్ బలయ్యారని,సరిహద్దుల్లో హోరాహోరీగా జరిగిన కాల్పుల్లో ధైర్యంగా పోరాడి వీర మరణం పొందారన్నారు. ప్రభుత్వం మాటలతో కాకుండా చేతలతో ఆ కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు.అవగాహన సాంస్కృతిక కార్యక్రమాల కో-ఆర్డినేటర్ బిళ్ళా అశోక్ మాట్లాడుతూ యుద్ధక్షేత్రంలో నేలరాలిన తెలుగుబిడ్డ మురళీ నాయక్ మరణం అందర్ని కలచివేసిందని,వీర సైనికులకు వందనాలర్పిం చాలన్నారు. అగ్నివీరుడు జోహార్ మురళీనాయక్ అంటూ నినాదాలు చేస్తూ సంతాపసూచకంగా మౌనం పాటించారు. అనంతరం రాజశేఖర్,యార్లగడ్డ లక్ష్మీ,మల్లేశ్వరరావు లు దేశభక్తి గీతాలను ఆలాపించారు.

# ట్రాఫిక్ సమస్యల నివారణకు పోలీసుల చర్యలు

మాచర్లటౌన్, మే 10 ప్రభాతవార్త: మాచర్ల పట్టణంలో ట్రాఫిక్ సమస్యల నివారణకు పోలీసులు చర్యలు చేపట్టారు. శనివారం ఎస్సై వెంకటరమణ షాపుల యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.



మాచర్లకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు బైకులతోవచ్చి ఎక్కడపడితే అక్కడ పార్కు చేయడం, ఆటోలు, బండ్లను రోడ్లపై నిలిపివేయడం వల్ల రద్దీ ఏర్పడుతుందన్నారు. ట్రాఫిక్ సమస్యలు నివారించేందుకు వ్యాపారులు, ప్రజలు సమన్వయంతో ముందుకు రావాలని ఆయన సూచించారు.

# ఉత్సాహంగా మహారాణాప్రతాప్ సింగ్ 486వ జయంతి వేడుకలు

గుంటూరు కల్చరల్,మే 10,ప్రభాతవార్త : స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆంధ్రప్రదేశ్ బొందిలి సంఘం ఆధ్వర్యంలో శ్రీ మహారాణా ప్రతాప్‌సింగ్ 486వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.తొలుత కార్యక్రమాలను ఆలయ పాలకమండలి అధ్యక్షులు సిహెచ్ మస్తానయ్య,ఉపాధ్యక్షులు లంకా విజయబాబు జ్యోతిప్రజ్వలన చేసి క్యాక్రమాన్ని ప్రారంభించారు.పత్రి గాయత్రీదేవిచే భక్తి గీతాలతో సభాకార్యక్రమం ప్రారంభమైంది.కార్యక్రమంలో సభ్యాధ్యక్షులుగా రామారాజు ఇన్‌ఫ్రా దేవలపర్స్ రామరాజు శ్రీనివాస్,ముఖ్యఅతిధిగా బిజేపి రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ,విశిష్ట అతిధిగా బిజేపి అర్బన్ జిల్లా మాజీ కార్యదరి్శ,హిందూ చైతన్య వేదిక భజరంగ్ రామకృష్ణ,ఆత్మీయ అతిధులుగా నూతలపాటి తిరుపతయ్య,కె.శంకర్‌సింగ్,ఎన్.కృష్ణసింగ్,మోహనసింగ్ పాల్గొన్నారు. డాక్టర్ రాజపుత్ర మధూరి విజేతసింగ్,బాణాల వెంకట సాయిమణికంఠ,రాజపుత్ర కార్తీక మధూరిసింగ్‌లను అతిధులను ఘనంగా సత్కరించారు.ముఖ్యఅతిధి మాట్లాడుతూ మహారాణాప్రతాప్‌సింగ్ పేరు వింటేనే హిందువుల గుండెల్లో ఉత్సాహాన్ని కలిగించే వీరుడు అన్నారు.భావితరాలు చరిత్రను చదివి రాణా ప్రతాప్ సింగ్ స్ఫూర్తిని పొందాలని,దేశభక్తి అంటే ఏమిటి ఆంధ్రప్రదేశ్ బొందిలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు క్షత్రి ధర్మనారాయణ సింగ్,ఆంధ్రప్రదేశ్ ఛత్రపతి శివాజీ చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి జాజం సుబ్రహ్మణ్యం,శ్రీసీతారామాంజనేయ స్వామి దేవాలయ కమిటీ సభ్యులు బాణాల ఆంజనేయులు కార్యక్రమాలను నిర్వహించారు.

# వెనుకబడిన ప్రాంతంలో మల్టీ స్పెషాలిటీ వైద్యసేవలు అభినందనీయం

మాచర్ల, మే 10 ప్రభాతవార్త: వెనుకబడిన మాచర్ల ప్రాంతంలో ఆధునిక వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా రవితేజ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను స్థాపించి పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవడం అభినందనీయమని తెదేపా సీనియర్ నాయకులు యాగంటి మల్లికార్జునరావు అన్నారు. రవితేజ హాస్పిటల్ స్థాపించి ఏడాదైన సందర్భంగా వైద్యులు సుష్మిత, శ్రీకాంత్‌లను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యాగంటి మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చి ఉన్నత విద్యనభ్యసించి వైద్యులుగా సుష్మిత, శ్రీకాంత్‌లు చేస్తున్న సేవలు



ఎనలేనివన్నారు. గతంలో మాచర్ల నియోజకవర్గ ప్రజలు చిన్నపాటి వైద్యానికి కూడా నరసరావుపేట, గుంటూరు వంటి నగరాలకు వెళ్లి ఎక్కువ ఖర్చు పెట్టి వైద్యసేవలు పొందేవారన్నారు. మాచర్ల పట్టణంలో రవితేజ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పడిన తర్వాత ఈ ప్రాంత ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో వైద్యసేవలు అందిస్తూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. ప్రజలకు సేవాభావంతో వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పథకం రవితేజ హాస్పిటల్‌లో త్వరలో అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రజలు ఉపయోగించుకోవాలని యాగంటి పిలుపునిచ్చారు.

# అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సత్కారం

నరసరావుపేట టౌన్, మే 10 ప్రభాతవార్త : నరసరావుపేట కళావేదిక వ్యవస్థాపకులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి ఆధ్వర్యంలో 10వ తరగతి మెరిట్ విద్యార్థులకు సత్కారం, ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేశారు. పొన్నపాటి పేరిరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. 590 మార్కులు సాధించిన రేవతి, ఇంటర్‌లో 465 మార్కులు సాధించిన బెల్లంకొండ



హిమబిందు, ఎన్.అజయ్‌రెడ్డిలను అభినందించి నగదు బహుమతులను అందించారు. అలాగే వారి తల్లిదండ్రులను అభినందించారు. విశ్రాంత హెచ్ఎం కందుల రామకోటిరెడ్డి, కె.కోటిరెడ్డి, వై.రాజారెడ్డి, పొన్నపాటి విజయ్, స్వర్ణ చిన్నరామిరెడ్డి, మురళీ, బాజీ, మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతి

కర్లపాలెం,మే10,ప్రభాతవార్త: కర్లపాలెం రామకృష్ణ సేవా సమితిలో వ్యవస్థాపకులు కాటూరి వెంకటేశ్వరరావు,మంతెన సత్యనారాయణరాజుల సహకారంతో 2024-25 విద్యా సంవత్సరంలో కర్లపాలెం మండలంలో 10వ తరగతిలో ప్రథమ ,ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతి,స్వామి వివేకానంద సాహిత్యం,బ్యాగ్ ను అందజేశారు.ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు తిమ్మరాజు వెంకట సుబ్బారావు,ట్రెజరర్ పెనుమెత్స బాపిరాజు, కాటూరి బాజి, కృష్ణమూర్తి, ఆలపాటి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు

# 12న అనుపులో రంగనాథస్వామి కల్యాణ మహోత్సవం

**విజయపురిసౌత్, మే 10 ప్రభాతవార్త:** మాచర్ల మండలం అనుపులో కృష్ణానదీ తీరాన కొలువైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించేందుకు పురావస్తు శాఖ అధికారులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారని పేర్కొన్నారు. కృష్ణానదిలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.



**ఇదీ ఆలయ పురాతన చరిత్ర!**

క్రీ.శ. 1200 కాలంలో విక్రమ సింహపురి (నేటి నెల్లూరు) చక్రవర్తి మనుమసిద్ధి రాజు శత్రురాజుల దాడులతో విజయపురి నల్లమల అడవుల్లో తలదాచుకోవాల్సి వచ్చింది. ఆ సమయంలోనే మనుమసిద్ధి మహారాజు రంగనాథస్వామి దేవాలయాన్ని నిర్మించారు. అనంతరం కాకతీసుల సహకారంతో తిరిగి తన రాజ్యాన్ని సాధించుకున్నారు. 1950లో నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో అప్పటి ఆర్కియాలజీ శాఖకు చెందిన అధికారి ఆర్.సుబ్రహ్మణ్య సరస్వతి రంగనాథస్వామి దేవాలయం ముంపునకు గురికాకుండా అనుపు ప్రాంతంలో శిథిలాలను చేర్చారు. 1907 మే 15న సుబ్రహ్మణ్య సరస్వతి దంపతులు తంగిరాల సుబ్రహ్మణ్యశాస్త్రి ఆగమ మంత్రోచ్ఛారణల మధ్య శ్రీదేవి, భూదేవి సమేత రంగ నాథ స్వామిని ప్రతిష్ఠించి అభిషేకం నిర్వహించారు. తదనంతరం సుబ్రహ్మణ్య సరస్వతి దంపతుల పర్యవేక్షణలో ఆలయాన్ని నిర్మించారు. ఆలయం పక్కనే శివాలయం, ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి యేటా రంగనాథస్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. సోమవారం ఉదయం 9.55 గంటలకు అంగరంగ వైభవంగా కల్యాణం జరగనుంది. భక్తులకు అన్నదానం ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. సాయంత్రం స్వామివారి రథోత్సవం కన్నుల పండువగా జరుగుతుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.



# సమగ్ర ప్రాంతీయ అభివృద్ధితోనే రాష్ట్ర ప్రగతి సాధ్యం : వడ్డే శోభనాద్రీశ్వరరావు

**గుంటూరుతూర్పు,మే10,ప్రభాతవార్త:** 26 జిల్లాల సమగ్రాభివృద్ధి తోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమోతుందని, రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, గత మూడు దశాబ్దాలుగా నిర్మాణంలో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులకు నిధులు కేటాయించి సత్వరమే పూర్తిచేయాలని ప్రముఖ రాజ నీతిజ్ఞులు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పేర్కొన్నారు. శనివారం గుంటూరులో జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి పై జన చైతన్య వేదిక రాష్ట్ర




అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి అధ్యక్షతన జన చైతన్య వేదిక హాలులో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో వడ్డే శోభనాద్రీశ్వరరావు ప్రధాన వక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను అమలు చేయడానికి అధికార పార్టీలు, ప్రధాన ప్రతిపక్షం కేంద్రంపై ఒత్తిడి తెచ్చే స్థితిలో లేవన్నారు. నిర్మాణంలో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులకు నిధులు కేటాయించకుండా 80 వేల కోట్లతో పోలవరం బనకచర్ల భారీ ప్రాజెక్టును రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెరపైకి తీసుకొని వస్తున్నారని, ఇది ఆంధ్రప్రదేశ్ కు గుదిబండగా మారనుందన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో 32 మంది బలిదానాలతో ఏర్పడిన విశాఖ ఉక్కు కర్మాగారానికి అవసరమైన బొగ్గు గనులను కేటాయించక పోవడం వలన నష్టాలకు గురి అవుతుంటే, మరోవైపు ప్రైవేటు రంగంలో ఆర్సేలర్ మిట్టల్ కు ఎర్ర తివాచి పరచి స్టీల్ ఫ్యాక్టరీకి అనుమతులు ఇచ్చి, బొగ్గు గనులు కేటాయించడం విచారకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమరావతి రాజధాని పేరుతో 58వేల ఎకరాలు సేకరించి, నేడు మరో 44 వేల ఎకరాల సాగు భూములను రైతుల నుండి తీసుకొని ప్రపంచంలోనే 5వ అతిపెద్ద రాజధానిగా నిర్మించాలని పగటి కలలు కంటుందని, దీనికోసం కనీసం లక్ష కోట్లు అప్పులు చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. సాక్షాత్తు దేశ రాజధాని ఢిల్లీకి 83 కి.మీ చెన్నై, బెంగళూరు లకు 62 కి.మీ మేర ఓటర్ రింగ్ రోడ్ లు ఉండగా, కేవలం లక్ష జనాభా మాత్రమే ఉన్న అమరావతికి 197 కి. మీ అవుటర్ రింగ్ రోడ్ నిర్మించ తలపెట్టడం ప్రజాధనాన్ని వృధా చేయడమేనని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన నిర్ణయాలు సంబంధిత మేధావులు, నిపుణులతో సంప్రదించకుండానే ఏక పక్షంగా చేస్తుందని, మూగ ప్రజలు, చెవిటి ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని విజయవంతం చేయలేవన్నారు. చైతన్య, నారాయణ, భాష్యం లాంటి కార్పొరేట్ విద్యా సంస్థల్లో 10శాతం మేర ప్రతిభ గల పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించాలని కోరారు. మహారాష్ట్రల్లో 167, ఉత్తర ప్రదేశ్ లో 116, కర్ణాటకలో 75 షుగర్ ఫ్యాక్టరీలు ఉండగా మన రాష్ట్రంలో కేవలం 5 మాత్రమే ఉండడం చేదు వాస్తవమన్నారు. షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ గత ప్రభుత్వంలో వేలాది కోట్ల రూపాయలు అవినీతి చేసిందని బహిరంగంగా మాట్లాడి, హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం వేసిన నేటి పాలకులు మరలా షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ చేతిలో విద్యుత్ రంగాన్ని పెట్టడం దారుణమన్నారు. గతంలో 8 వేలు విలువచేసే స్మార్ట్ మీటర్లను 36 వేలకు కేటాయించడం, ట్రాన్స్ఫార్మర్ లను కూడా రెట్టింపు ధరలకు ఇచ్చి జగన్ ప్రభుత్వం దోపిడీ చేస్తే నేడు కూటమి ప్రభుత్వం అదే త్రోవలో పయనిస్తుందని అవహేళన చేశారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో అతి తక్కువ తలసరి ఆదాయం కలిగి,అక్షరాస్యతలో 32వ స్థానంలో ఉండి, ప్రతి నెలా 6వేల కోట్ల రూపాయల వడ్డీలు చెల్లిస్తూ ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నేటి ప్రభుత్వం వాస్తవాలకు దూరంగా గత 11 నెలల్లో మరో లక్ష 50 వేల కోట్లు అప్పులు చేసి అనుత్పాదక రంగాలకు ఖర్చు చేయడం అవివేకమన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రగతికి వ్యవసాయరంగ ప్రాధాన్యతే ముఖ్యమని, జల వనరులను సద్వినియోగం చేసుకొని, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేస్తే వ్యవసాయ రంగంలో ఉత్పత్తి పెరిగి, సంపద, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. పాలకులు నీటిపారుదల ప్రాజెక్టులను అవినీతి పారుదల ప్రాజెక్టులుగా మార్చినారన్నారు. ఫీజు రీయబర్స్మెంట్ అమలు చేయలేకపోవడం వలన వేలాది పేద విద్యార్థులు నష్టపోతున్నారని, ఆరోగ్య శ్రీ నిధులు సంబంధిత ఆసుపత్రులకు సకాలంలో చెల్లించకపోవడం వలన పేద రోగులు ఇబ్బంది పడుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో వందలాది కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేసి వేడుకలను, బహిరంగ సభలను నిర్వహించడం బాధ్యతా రాహిత్య మన్నారు. అమరావతిలో రాజధాని పేరుతో కి.మీ. రోడ్డుకు 64 కోట్ల రూపాయలు, ఒక చదరపు అడుగుకు పదివేల రూపాయలకు పైగా వెచ్చిస్తూ అనుయాయులకు లబ్ది చేకూరుస్తున్నారని విమర్శించారు. ప్రముఖ విద్యావేత్త ప్రొ.డి.ఎ.ఆర్. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో వెనుకబడిన నియోజక వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోగలమని, నియోజక వర్గ, జిల్లాస్థాయిల్లో ప్రణాళిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి అమలు చేయాలన్నారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొ. ఎన్. వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రజలను జాగృతలను చేస్తేనే ప్రభుత్వాలు సక్రమంగా నడుస్తాయని, నది పరీవాహక ప్రాంతాలలో వ్యవసాయేతర కార్యక్రమాలు ఉండరాదని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎం. ఎస్. స్వామినాథన్ సూచనను రాష్ట్ర ప్రభుత్వాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మానవత ఛైర్మన్ పావులూరి రమేష్, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్, రాజ్యాంగ చర్చావేదిక కన్వీనర్ అవధానుల హరి తదితరులు పాల్గొని మాట్లాడారు.

# వీర మరణం పొందిన జవాన్ కు నివాళులర్పించిన ఎమ్మెల్యే నసీర్

**గుంటూరుతూర్పు,మే10,ప్రభాతవార్త:** జవాన్ మురళీ నాయక్ పోరాటాన్ని యావత్ భారతావని మరిచిపోదని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన జవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ భారతావని కోసం గొప్ప ధైర్య సాహసాలు ప్రదర్శించిన జవాన్ మురళీ నాయక్ పోరాటం స్ఫూర్తిదాయకమని చెప్పారు. నీ వీరమరణంతో ధరిత్రి కన్నీటితో తడుస్తోందని, నీ సాహసం,నీలాంటి వీరుడి త్యాగం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఉగ్రవాద పెనుభూతాన్ని పెంచి పోషిస్తున్న దాయాది పాకిస్తాన్ చర్యలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ దుయ్యబట్టారు. ఇలాంటి దుర్మార్గమైన చర్యలకు భారత్ ఎప్పటికీ తలవంచబోదని హెచ్చరించారు.



# వీరసైనికుడు మురళీనాయక్ త్యాగాన్ని భారతజాతి ఎన్నటికీ మరచిపోదు

**గుంటూరు కల్చరల్,మే 10,ప్రభాతవార్త :** పాకిస్తాన్‌తో పోరాడే క్రమంలో తెలుగుబిడ్డ మురళీనాయక్ ప్రాణాలు కోల్పోవటం విషాదకరమని ఆ వీర సైనికుని త్యాగాన్ని భారతజాతి ఎన్నటికీ మరచిపోదని అవగాహన సంస్థ సభ్యులు,సంస్థ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమంలో విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య మాట్లాడుతూ 25ఏళ్ళ వయస్సులో మాతృభూమి కోసం ప్రాణాలర్పించి అమరుడైన మురళి నాయక్ త్యాగాన్ని దేశమంతా గర్వపెట్టు కుంటుందన్నారు.విశ్రాంత ఇంజనీర్ ఎస్.సదాశివమ్ మాట్లాడుతూ దేశరక్షణకు సేవలందిస్తూ పాక్ జవాన్ల తూటాలకు మురళీనాయక్ బలయ్యారని,సరిహద్దుల్లో హోరాహోరీగా జరిగిన కాల్పుల్లో ధైర్యంగా పోరాడి వీర మరణం పొందారన్నారు.ప్రభుత్వం మాటలతో కాకుండా చేతలతో ఆ కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు.అవగాహన సాంస్కృతిక కార్యక్రమాల కో-ఆర్డినేటర్ బిళ్ళా అశోక్ మాట్లాడుతూ యుద్ధక్షేత్రంలో నేలరాలిన తెలుగుబిడ్డ మురళీ నాయక్ మరణం అందర్ని కలచివేసిందని,వీర సైనికుని వందనాలర్పించాలన్నారు.అగ్నివీరుడు జోహార్ మురళీనాయక్ అంటూ నినాదాలు చేస్తూ సంతాపసూచకంగా మౌనం పాటించారు. అనంతరం రాజశేఖర్,యార్లగడ్డ లక్ష్మీ,మల్లేశ్వరరావు లు దేశభక్తి గీతాలను ఆలాపించారు.



# ఎన్‌హెచ్-30పై ప్రయాణీకుల ఇబ్బందులు పట్టించుకోరా..

**ఎ కొండూరు, మే 10, ప్రభాతవార్త :** బ్రహీంపట్నం జగదల్‌పూర్ జాతీయ రహదారి-30పై ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి రైల్వేట్రాక్ కట్టుబడిపాలెం, జి కొండూరు మైలవరం ఎ కొండూరు మండలంలో డ్రైన్‌ల వ్యవస్థ సరిగా లేకపోవడం అలాగే పారిశుధ్యం వ్యవస్థ అధ్వాన్నంగా మారడంతో ఈ ప్రాంత ప్రయాణీకుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొండపల్లి నుండి జి కొండూరు మైలవరం ఎ కొండూరు మండల ప్రాంతాల్లో ఈ జాతీయ రహదారి-30పై భారీ వర్షాలకు రహదారిపై వరదనీరు అలాగే శానిటేషన్ సమస్య ఎ కొండూరు మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ వద్ద ఉన్న బస్‌షెల్టర్‌పై కప్పు ఐరన్ రేకు ఈదురు గాలులకు పైకప్పు లేచిపోవడంతో ప్రయాణీకులకు ఈ బస్‌షెల్టర్లు ఏ మాత్రం ఉపయోగపడటం లేదు. ఈ బస్‌షెల్టర్లు గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయడంతో ఉపయోగం లేకుండా పోయింది. బ్రిడ్జి వద్ద ర్యాంప్‌ల వద్ద చెత్తాచెదారం వ్యర్థాల దుర్గంధంతో ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యం చెందు తున్నారు. డివైడర్ మెష్‌లు ర్యాంపులు దెబ్బతిన్నాయి. కంభంపాడు కృష్ణారావు పాలెం చీమలపాడు గ్రామాల వద్ద హైవే రోడ్డుపైనే వరద నీరు వర్షాకాలంలో ప్రవహిస్తుండటంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. మైలవరం మండలం బాడవ టోల్ ప్లాజా-30 అది కారులు ముక్కుపిండి టోల్‌ఫీజు ప్రతిరోజు లక్షలాది రూపాయలు వసూలు చేయడం తప్ప రహదారి అస్తవ్యస్త నిర్వాహణ డ్రైన్‌లు శానిటేషన్ పనులు ఏ మాత్రం నిర్వహించడం లేదని ప్రజలు ఆరోపించారు. అలాగే రామచంద్రాపురం మలుపు గత 10ఏళ్ల నుండి రహదారి విస్తరణ పనుల్లో ఎన్‌హెచ్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండటంతో పనులు పూర్తికాక నరకం అనుభవిస్తున్నారు. ఇకనైనా సోమవారం ఈ నెల 12న తిరువూరు గ్రీవెన్స్ సెల్ కార్యక్రమానికి వెళుతున్నా కలెక్టర్ ఈ రహదారి ఇబ్బందులను డ్రైన్ శానిటేసన్ విస్తరణ పరిశీలన పనులు వెంటనే ప్రారంబించే విధంగా చర్యలు తీసుకుని ఇబ్బందులు తొలగించి, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# ఘనంగా ఓంకార ధ్యాన పరమేశ్వర విగ్రహ ప్రతిష్ఠ

**బల్లికురవ, మే 10, ప్రభాతవార్త :** మండలంలోని కొనిదెన గ్రామంలో వేంచేసియున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బ్రహ్మగుండ ప్రాంగణంలో ఓంకార ధ్యాన పరమేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. విగ్రహ దాతలు చెరుకూరి చెంచు రామయ్య సుధారాణి దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొనిదెన గ్రామం ఓం నమశ్శివాయ పంచాక్షరి మంత్ర జపంతో పులకించిపోయింది. గ్రామంలోని ప్రధాన వీధులలో శివనామస్మరణ మార్మోగుతుండగా కే.రాజుపాలెం గ్రామానికి చెందిన అయినవోలు సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు కొనసాగాయి. గణపతి పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, జలాధివాసం, క్షీరాధివాసంలో ఉంచిన విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. యంత్ర విగ్రహాల ప్రతిష్ఠ, పూర్ణాహుతి, మహా కుంభాభిషేకం అనంతరం ఉదయం 8.30గంటలకు ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ముగించారు. ఈ సందర్భంగా అన్న సంతర్పణ ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా గ్రామస్తులు తమ వంతు సహకారం అందించారు.

# హనుమాన్ శోభాయాత్ర ర్యాలీ కరపత్రాల ఆవిష్కరణ

**నరసరావుపేట, మే 10 ప్రభాతవార్త :** హనుమాన్ శోభాయాత్ర ర్యాలీ, కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు మాట్లాడుతూ ఈ నెల 25న ఆదివారం ఈ కార్యక్రమం జరగడం సంతోషమన్నారు. దేశం కోసం, ధర్మం కోసం ప్రతి గడప నుండి ఒకరు బయటకు రావాలన్నారు. శివక్షేత్ర పీఠాధిపతి శివస్వామి ఈ కార్యక్రమానికి హాజరు కావడం హర్షణీయమన్నారు. ఐక్యతతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు సూచించారు. ఈ కార్యక్రమానికి అత్తులూరి సుబ్బారావు అధ్యక్షత వహించారు. సింధూ రామకృష్ణ, ఏలూరి ప్రసాద్, కొత్త రామ, రెడ్డి జాలయ్య, కిషోర్, గురుబ్రహ్మం, త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.



# వీరునికి ఘన నివాళి

**నరసరావుపేట, మే 10 ప్రభాతవార్త :** భారతదేశం కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన సైనికుడు మురళీ నాయక్‌కు పలువురు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లో శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి షేక్ మస్తాన్‌వలి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా టూటౌన్ సి.ఐ. హైమారావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వీరమరణం పొందిన మురళీనాయక్ యువతకు ఆదర్శమన్నారు. దేశం కోసం పోరాటం చేస్తున్న సోఫియా ఖురాసి, ఓమిఖుసింగ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేయడం సంతోషమన్నారు. పాకిస్తాన్‌పై భారత సైన్యం చేస్తున్న సింధూర్ యుద్ధం చరిత్రలో గొప్పగా నిలిచిపోతుందన్నారు. పాకిస్తాన్‌ను వంచించేందుకు వారి భూభాగంపైకి వెళ్ళి ఇద్దరు మహిళలు ఉగ్రమూకలను అణచివేసేందుకు వారు జరిపిన పోరాటం అద్భుతమన్నారు. కార్యక్రమంలో నాయకులు మాబు, ఖాశింపీరా, రఫీ, సలీం, కరీమ్, అంబేద్కర్, కాసా రాంబాబు, అనీల, లక్ష్మి, మౌలాలి, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.



# నేడు అతావుల్లా బాబా దర్బార్ అండ్ దర్గాలో అన్న సమారాధన

**ఎ కొండూరు, మే 10, ప్రభాతవార్త :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం చీమలపాడు ఎఎంటికె దర్బార్ బాబె ఎ బాగ్దాద్‌లో ఈ నెల 11న ఆదివారం ఆషికే రసూల్ నఖీబుల్ ఔలియా సూఫీ ముహమ్మద్ అతావుల్లా షరీఫ షాతాజ్ ఖాదరీ బొగ్దాది బాబా (ర.అ) వారి తేర్వీ షరీఫ్ సాంప్రదాయబద్ధంగా అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నట్లు అతావుల్లా బాబా వారి ఆధ్యాత్మిక వారసుడు పీఠాధిపతి పీర్‌జాదా మొహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ శనివారం దర్బార్ అండ్ దర్గా వద్ద మీడియాకు తెలిపారు. ఈ నెల 11న ఆదివారం సాయంత్రం 7 గంటలకు కులమతాల కతీతంగా దర్బార్ అండ్ దర్గాకు వచ్చే భక్తులకు వేలాది మందికి అన్న సమారాధన కార్యక్రమాన్ని (లంగర్‌షరీఫ్)ను నిర్విఘ్నంగా నిర్వహిస్తున్నారు. అతావుల్లా బాబా వారి భక్తులు వేలాదిగా తరలివచ్చి ఈ ధార్మిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఖాజా మొహియుద్దీన్ కోరారు. ఇంకా ఈ మీడియా సమావేశంలో దర్బార్ అండ్ దర్గా ప్రతినిధులు ఎండి జాఫర్ సాదిక్, బొగ్దాది, తాజ్ ఖాదర్‌బాబు పాల్గొన్నారు.

# భూ సేకరణ ద్వారా రెహో విస్తరణ ప్రణాళికలు

**విజయవాడ, మే 10, ప్రభాతవార్త :** భూ సేకరణ ద్వారా రెహో విస్తరణ ప్రణాళికలు అమలు చేస్తున్నామని, దేశంలో మరింత కార్యకలాపాలు విస్తరిస్తామని రెహో ఇంటీరియర్ సొల్యూషన్స్ సిఇఓ డా థామస్ ట్రోగర్, రెహో ఇండియా ఎగ్జిక్యుటివ్ వైస్ ప్రెసిడెంట్ తుషార్ వర్మ, ఇండియా వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీ నారాయణ లు తెలిపారు. ఏపిలో శ్రీ సిటీలో 1.05ఎకరాల పారిశ్రామిక భూమిని 99సంవత్సరాల లీజుకు పొందామన్నారు. భారతదేశంలో తయారీని మరింత పెంచేలా చర్యలుంటాయన్నారు.

# రాష్ట్రంలో మొదటిసారి 3డి 4కె శస్త్రచికిత్స

**విజయవాడ, మే 10, ప్రభాతవార్త :** విజయవాడ పోరంకిలోని క్యాపిటల్ హాస్పటల్‌లో రాష్ర ంలోనే మొదటిసారిగా 3డి 4కె ద్వారా లాపరోస్కోపి ద్వారా అధునాతన శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించినట్లు హాస్పటల్ జి.ఐ.అండ్ బేరియాట్రిక్ సర్జన్ డా వి సురేష్ కుమార్ తెలిపారు. హాస్పటల్ ప్రాంగణంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ 3డి 4కె విధానం మన కంటికి దగ్గర పోలికలు, నిజమైన రంగులను అద్భుతమైన వివరాణత్మక చిత్రాలనందిస్తుందన్నారు. క్యాన్సర్‌కు జరిగే శస్త్రచికిత్సలో ఈవిధానంతో సూక్ష్మమైన విభేదాలను గుర్తించవచ్చన్నారు. గైనకాలజిస్ డా నెల వెళ్ళి అశ్విని మాట్లాడుతు ఈపరికరంతో సంక్లిష్టమైన ఎండోమెట్రియో సిస్, పెద్ద పెట్రాయిడ్స్, ట్యుబల్ రికైన లైజేషన్, లేపరోస్కోపి గైనకాలజిస్ట్ శస్త్ర చికిత్సలు నైపుణ్యంగా చేయవచ్చున్నారు. కార్యక్రమంలో హాస్పటల్ ఎండి డా హరీష్ మన్నే, అనస్టీషియాలజి విభాగాధిపతి డా ఎం శ్రీధర్ పలువురు వైద్యులు పాల్గొన్నారు.



# క్యాన్సర్‌పై పోరాటానికి సిటిజెన్ ఫోర్స్ క్యాన్సర్‌క్లబ్

**విజయవాడ, మే 10, ప్రభాతవార్త :** క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించడం, వ్యాధిగ్రస్తులకు అండగా నిలిచే లక్ష్యంతో సిటిజెన్ ఫోర్స్ క్యాన్సర్ క్లబ్ ప్రారంభించినట్లు టెలికాం రంగ దిగ్గజం సిఎంఎఐ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ ప్రొ. ఎస్‌కె గోయల్ అన్నారు. శనివారం విజయవాడలో ప్రారంభించిన సందర్భంగా ఎస్‌కె గోయల్ మాట్లాడుతూ ఆరోగ్య భారత ఆవిష్కరణలో స్వచ్ఛంద సంస్థలు కీలక భూమిక పోషించాలన్నారు. క్యాన్సర్‌పై సిటిజెన్ ఫోర్స్ చేస్తున్న పోరాటానికి తాము సంపూర్ణ మద్దతిస్తామన్నారు. కార్యక్రమంలో క్యాన్సర్ వైద్య నిపుణులు డా ఎన్ సుబ్బారావు, రేడియాలజిస్ట్ డా వేమూరి వరప్రసాద్, ఇండియన్ రేడియోలాజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేన్ ఉపాధ్యక్షులు డా జివి మోహన్ ప్రసాద్, సినీ నటి చంద్రాని దాస్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



# మృతి చెందిన టీడీపీ కార్యకర్త కుటుంబానికి సంక్షేమ నిధి నగదు అందజేత

**నాగులుప్పలపాడు, మే 10, ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి, జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి జాతీయ, టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదేశాల మేరకు.. నాగులుప్పలపాడు మండలం ఒమ్మేవరం గ్రామంలో ఇటీవలే రోడ్డు ఆక్సిడెంట్‌లో మరణించిన నార్నె సురేష్‌కి టీడీపీ సభ్యత్వం కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి రూ.5లక్షలను అందించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన సంతనూతలపాడు నియోజకవర్గ శాసనసభ్యులు బీఎన్ విజయ్‌కుమార్. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో మండల పార్టీ అధ్యక్షులు తెళ్ళ మనోజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌ఛార్జీలు కాకర్ల లక్ష్మీ, వరప్రసాద్, గుమ్మడి సాయిబాబా, గ్రామ పార్టీ అధ్యక్షులు కొమ్మాలపాటి సురేష్, గ్రామ సర్పంచ్ పాలపర్తి బాలకోటయ్య, ఈదర రాజా, కనగాల శ్రీనివాసరావు, కొమ్మినేని రమేష్, నందిగం కోటయ్య, సెల్వం, పార్వతి, మండల నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో ముందంజకు విద్య ప్రధాన మూలం : ప్రముఖ న్యాయవాది ధనలక్ష్మీ

**సంతనూతలపాడు,మే 10, ప్రభాతవార్త :** వెనుకబడిన వర్గాల వారికి ముఖ్యంగా విద్యాభివృద్ధికి మూలం అని ప్రముఖ న్యాయవాది నేలటూరి ధనలక్ష్మీ పేర్కొన్నారు. సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట శాంతినగర్ కామ్రేడ్ నూకతోటి కోటయ్య కళా ప్రాంగణం ఆవరణలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి విద్యా శిబిరాన్ని శనివారం ఆమె సందర్శించి అనంతరం మాట్లాడారు. ఈ వేసవి ఉచిత విద్యా శిబిరం రెండవ ఏడాది నిర్వహించడం ఎంతో అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. మ్యాథమెటిక్స్, ఇంగ్లీష్, తదితర సబ్జెక్టులతో పాటు చిన్నారులు, కరాటే, పెయింటింగ్, వంటి రంగాలలో కూడా శిక్షణ ఇవ్వడం ప్రశంసనీయమని ఆమె అభినందించారు. దీనితో పాటు ఉదయాన్నే విద్యార్థులకు స్వచ్ఛందంగా అల్పాహారం అందించడం పట్ల అమె హర్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి స్టడీ సెంటర్ డైరక్టర్ డాక్టర్ నూకతోటి రవికుమార్ నేతృత్వం వహించగా సీఎస్ఆర్ శర్మ, కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ సాల్మన్, స్టడీ సెంటర్ ఉపాధ్యాయులు కళ్యాణ్, రామాంజనేయులు, కైలా అనురాధ, టైక్వాండో సీనియర్ కోచ్ ఎరిచర్ల కోమల శ్రీనివాసరావు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురించిన పుస్తకాన్ని న్యాయవాది ధనలక్ష్మీకి అందజేశారు.

# మా స్థలాన్ని మాకు అప్పగించి న్యాయం చేయ్యండి

## -ప్రభుత్వానికి బాధితురాలు సుధారాణి విజ్ఞప్తి

**విజయవాడ, మే 10, ప్రభాతవార్త :** తమ స్థలంపై డూప్లికేట్ డాక్యుమెంట్లతో కోర్టులో అక్రమంగా పిటీషన్లు వేసి 15 సంవత్సరాలుగా కోర్టులో కేసు కొనసాగుతుంగా జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు తమ స్థలాన్ని కట్టబెట్టారని దీనిపై హైకోర్టు పవన్ కళ్యాణ్‌కు నోటీసులు కూడా జారీ చేసిందని బాధితురాలు సుధారాణి ఆరోపించారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులు, హైకోర్టు న్యాయవాదులు రాజారాం, తారక్ ప్రసాద్‌లతో కలిసి మాట్లాడుతూ 1976 నుండి పరంపరగా వస్తున్న పూర్వీకుల ఆస్తి తన అమ్మ జొన్నకూటి మరియమ్మ నుండి కూతురు కనపర్తి సుధారాణికి వస్తే, కంచల నాగేశ్వరరావు అనే వ్యక్తి తమకు తెలియకుండానే డూప్లికేట్ డాక్యుమెంట్లు సృష్టించుకుని తమపైనే కోర్టులో పిటీషన్లు వేయగా గత 15 సంవత్సరాలుగా ఈ కేసు కోర్టులో నలుగుతూనే వుందని బాధితురాలు సుధారాణి ఆవేదన పడ్డారు. ఇదిలా వుంటే స్థలం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయాన్ని ఆనుకుని వుండడంతో 2024 సార్వత్రిక ఎన్నికలు అయిన వెంటనే తమ స్థలాన్ని కోర్టులో కేసు కొనసాగుతుండగానే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు కంచల నాగేశ్వరరావు అక్రమంగా అమ్మివేశారన్నారు. తమ స్థలంలో జనసేన పార్టీ కార్యాలయం వారు బోరు వేసేందుకు సిద్ధపడగా తాము అడ్డుకున్న సమయంలో ఈ విషయం వెల్లడైందన్నారు. స్థలం పవన్ కళ్యాణ్ కొన్నాడని, పవన్ కళ్యాణ్ పేరుమీద రిజిస్టర్ అవడంతో దీనిపై స్పందించిన హైకోర్టు పవన్‌కళ్యాణ్‌కు నోటీసులు జారీ చేసిందన్నారు. దీనిపై పవన్ కళ్యాణ్ వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు.



# వైజేప ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

**సంతనూతలపాడు, మే 10, ప్రభాతవార్త :** యూట్యూబ్ న్యూస్ ఛానెల్స్ ఆఫ్ జర్నలిస్టు అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంతనూతలపాడు బస్టాండ్ సెంటర్ వద్ద శనివారం నాడు మజ్జిగ పంపిణీ కార్యక్రమంను నిర్వహించారు. వైజేప ఏపీ జిల్లా అధ్యక్షులు పోలుబోయిన వెంకట శివ కృష్ణ ఆధ్వర్యంలో వైజేఏపీ ప్రకాశం జిల్లా సెక్రటరీ ఇస్తర్ల శ్రీనివాసరావు సహాయంతో సుమారు ఐదు వందల మందికి మజ్జిగ పంపిణీ చేపట్టారు. యూట్యూబ్ న్యూస్ ఛానెల్స్ ఆఫ్ జర్నలిస్టు అసోసియేషన్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు పోలుబోయిన వెంకట శివ కృష్ణ మాట్లాడుతూ ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని, ప్రయాణికుల కొరకు మజ్జిగ ఏర్పాటు చేసినట్లు అదే విధంగా త్వరలో అన్ని మండలాలలో ఇదే విధంగా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జైజనం పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గం ఇన్‌ఛార్జీ చావలి రాంబాబు, వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు, సెక్రటరీ శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ డాక్టర్ మధురశ్రీ కవి, కోశాధికారి గణేష్‌బాబు, పలు పార్టీల ప్రతినిధులు సంకే సుబ్బారావు, మేళం సూర్య, కొప్పోలు శ్రీనివాసరావు, మార్పుడి శ్రీనివాసరావు, మార్పుడి రమేష్ , కారుమంచి నాగరాజపు తదితరులు పాల్గొన్నారు.

# భారత్ విజయం సాధించాలంటూ రామాలయంలో ప్రత్యేక పూజలు

**దర్శి, మే 10, ప్రభాతవార్త :** పొదిలి రోడ్డులోని రామాలయం గుడిలో పాకిస్థాన్ మీద మన భారతదేశం విజయం సాధించాలని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో త్రివిధ దళాలు మన భారతదేశ ప్రజలు సస్యశ్యామలంగా సుఖ సంతోషాలతో భారతదేశ ప్రజలకు ధైర్యాన్ని చేకూర్చాలని మన భారత మాత పేరుతో పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దర్శి అసెంబ్లీ కన్వీనర్ మాడపాకుల శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు తిండి నారాయణరెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ వల్లభవరపు అమరేశ్వరరావు, మధుసూదన్‌రెడ్డి, నాయకలు పార్టీ కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

11-5Pg5.qxd:11-5Pg5.qxd 11/05/25 9:51 PM Page 1



# భారత్ దాడుల్లో మృతిచెందిన ఉగ్రవాదులు వీరే..

## 'ఆపరేషన్ సిందూర్'లో ఐదుగురు కీలక ఉగ్రనాయకులు హతం



**న్యూఢిల్లీ, మే 10:** పహల్గాంవ్ ఉగ్రదాడికి భారత్ తీవ్రస్థాయిలో బదులిచ్చిన సంగతి తెలిసిందే. లష్కరే తోయిబా, జైషే ముహ్మద్ ఉగ్రముఠాలే లక్ష్యంగా వాటిస్థావరాలపై బాంబులతో విరుచుకుపడింది. ఈనెల 7వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత పాక్ పిఒకేలో జరిపిన మెరుపుదాడుల్లో తొమ్మిది కీలక ఉగ్రశిబిరాలను నేలమట్టంచేసింది. ఈ ఆపరేషన్ సింధూర్‌లోకనీసం 100 మంది ఉగ్రవాదులు హతమైనట్లు కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో ఐదుగురు కీలక ఉగ్రనాయకులను కూడా మట్టుబెట్టినట్లు తెలుస్తోంది. వారి వివరాలను కూడా కేంద్రం తాజాగా వెల్లడించింది. జైషేమహ్మద్ వ్యవస్థాపకుడు మసూద్ అజహర్ ఇద్దరు బావమరుదులతోపాటు లష్కరే తాయిబాకు చెందిన కీలక ఉగ్రవాది మరో ఇద్దరు హతమయ్యారు. వీరిలో కీలకమైన ఉగ్రనేతల పేర్లను కేంద్రం ప్రకటించింది. ముదస్సర్ ఖదాయిస్‌ఖాస్ అలియాస్ అబు జుండాల్ లష్కరేకు కీలక ఉగ్రవాదిగా కొనసాగుతున్నాడు. ఈతడిఅంత్యక్రియలను పాక్ ఆర్మీ లాంఛనాలతో నిర్వహించింది. అంతర్జాతీయ ఉగ్రవాది హఫీజ్ అబ్దుల్ రవూఫ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి పాక్ ఆర్మీచీఫ్ పంజాబ్‌లోని పాక్ సీఎం, ఐజిలు పాల్గొన్నారు. ఇకమసూద్ అజర్ పెద్ద బావమరిది హాఫీజ్ మహ్మద్ జమీల్ ఉగ్రముఠాలో కీలకసభ్యుడు. మసూద్ అజార్ మరో బావమరిది అయిన మహ్మద్‌యూసఫ్ అజార్ అలియాస్ ఉస్తాద్‌జీ అలియాస్ సలీమ్ అలియాస్ సాహబ్ జైషేలో కీలకంగా కొనసాగుతున్నాడు. ఐసి 814 విమాన హైజాక్ ఘటనలో ప్రధాన నిందితుడు. ఇక జమ్ము కాశ్మీర్‌లో ఉగ్రదాడులకు నాయకత్వం వహించిన మరో కీలక ఉగ్రనేత లష్కనే సీనియర్ ఖలీద్ అలియాస్ అబూ అకాస కూడా హతం అయ్యాడు. ఆఫ్ఘన్ నుంచి ఆయుధాలు స్మగ్లింగ్ చేసేవాడు. ఫైసలాబాద్‌లో జరిగిన అంత్యక్రియ లకు పాక్ సీనియర్ ఆర్మీ అధికారులు, స్థానిక డిప్యూటికమిషనర్ కూడా హాజరయ్యారు. మహ్మద్ హసన్‌ఖాన్ జైషేలో కీలక నేత పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని జైషే ఆపరేషనల్ కమాండర్ ముఫ్తి అస్గర్‌ఖాన్ కశ్మీరీ కుమారుడు. జమ్ముకాశ్మీర్‌లోకి ఉగ్రవాదులను పంపించడంలో కీలకపాత్రపోషించాడు. జైషే, లష్కరే ముఠాల కీలక స్థావరాలే లక్ష్యంగా భారత్ ఈమెరుపు దాడులు చేపట్టింది. భారత్ టార్గెట్‌చేసిన కేంద్రాల్లో లాహోర్‌కు 40 కిలోమీటర్ల దూరంలోని మురిద్కేలో ఉన్న లష్కరే తోయిబా ఉగ్రశిబిరం ఉంది. 26/11 ముంబయి దాడులకు పాల్పడిన ఉగ్రవాదులు అజ్మల్ కసబ్, డేవిడ్ హెడ్లీ ఇక్కడే శిక్షణ తీసుకున్నారు. ఇక జైషేకు చెందినప్రధాన కేంద్రం బహావల్‌పూర్‌లోని మర్కజ్‌సుభాన్‌పైనా భారత్ మెరుపుదాడి చేసింది. ఈ దాడిలో మసూద్ అజర్ కుటుంబంలోని పదిమంది మృతి చెందినట్లు స్వయంగా మసూద్ ప్రకటించాడు.



## ఇకపై ఏ ఉగ్రదాడి అయినా యుద్ధ చర్యగానే పరిగణిస్తాం

**న్యూఢిల్లీ:** పాకిస్తాన్‌కు భారత్ సీరియస్ వార్నింగ్ ఇచ్చింది. ఇకపై ఏ ఉగ్రదాడినైనా యుద్ధ చర్యగా పరిగణిస్తామని హెచ్చరించింది. పాకిస్థాన్ రెచ్చిపోతే అంతకు అంత ప్రతిదాడితో విరుచుకుపడాలని నిర్ణయించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన త్రివిధ దళాధిపతులతో జరిపిన అత్యున్నత స్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. పాక్‌పై పూర్తి స్థాయి యుద్ధానికి మోదీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సమాచారం. ఇకపై ఏ ఉగ్రదాడినైనా యుద్ధ చర్యగా పరిగణించాలని, అంతే తీవ్ర స్థాయిలో బదులివ్వాలని ప్రధాని దిశానిర్దేశం చేశారని తెలిసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోబాల్ ఈ కీలక సమావేశంలో పాల్గొన్నారు. భారత క్షిపణులు శత్రువుల గుండెల్లో గుబులు పుట్టిస్తాయ్..వీటి స్పెషల్ ఏంటంటే భారత్‌లో 26 లొకేషన్లపై పాక్ డ్రోన్ దాడులకు ప్రతిగా శనివారం తెల్లవారు జామున నాలుగు పాక్ ఎయిర్‌బేస్‌లపై భారత్ దాడులు చేసింది. అనంతరం నేపథ్యంలో మోదీ ఈ సమావేశం నిర్వహించారు. దేశ భద్రతా విషయంలో మరింత కఠిన వైఖరి ప్రదర్శించాలని ఈ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. భారత ప్రయోజనాలను దెబ్బతీసేలా భవిష్యత్తులో ఎలాంటి ఉగ్రవాద చర్యలకు పాల్పడినా దానిని యుద్ధ చర్యగా పరిగణించాలని సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నట్టు ఆ వర్గాలు వెల్లడించాయి. దీంతో ఇకపై ఉగ్రవాద చర్యలను కేవలం అంతర్గతా భద్రతా చర్యలుగానే పరిగణించలేమని, ప్రతిస్పందన అత్యంత భీకరంగా ఉంటుందనే ప్రత్యక్ష హెచ్చరిక సందేశాన్ని భారత్ దాయాదికి పంపించినట్లయింది.

# సజావుగా చార్‌ధామ్ యాత్ర: సిఎం పుష్కర్‌సింగ్ ధామి



**డెహ్రాడూన్, మే 10:** ఉత్తరాఖండ్‌లో చార్‌ధామ్ యాత్రకు సంబంధించి భక్తులకు కీలక అప్‌డేట్ అందింది. సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలకు ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి స్వయంగా తెరదించారు. ఛార్ ధామ్ యాత్ర సజావుగా సాగుతోందని చార్‌ధామ్ యాత్ర ఎటువంటి అంతరాయాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని, యాత్రికులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని ఆయన స్పష్టం చేశారు. ఈ యాత్రా సీజన్‌లో ఇప్పటివరకు 4 లక్షలకు పైగా భక్తులు చార్‌ధామ్‌లను విజయవంతంగా దర్శించుకున్నారని సీఎం పుష్కర్ సింగ్ ధామి వెల్లడించారు. యాత్ర సజావుగా సాగేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా, శ్రీ కేదార్‌నాథ్ ధామ్‌కు హెలికాప్టర్ సేవలు కూడా పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చాయని, ఇవి నిరంతరాయంగా నడుస్తున్నాయని తెలిపారు. యాత్రకు సంబంధించి ఎలాంటి వదంతులను నమ్మవద్దని ముఖ్యమంత్రి భక్తులకు విజ్ఞప్తి చేశారు. యాత్రికుల ప్రయాణ అనుభవాన్ని సురక్షితంగా, సౌకర్యవంతంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆయన పునరుద్ఘాటించారు. భక్తుల భద్రతకే తమ ప్రథమ ప్రాధాన్యత అని ధామి అన్నారు. యాత్రకు సంబంధించిన ఏదైనా సమాచారం లేదా సహాయం అవసరమైతే, భక్తులు 1364 లేదా 01351364 హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించవచ్చని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి సూచించారు. ప్రభుత్వం అందించే అధికారిక సమాచారంపైనే ఆధార పడాలని ఆయన కోరారు.

# భారత్‌తో పోలిస్తే అత్యంత బలహీనంగా ఉన్నాం..

## పాక్ క్రికెట్‌బోర్డు మాజీ ఛైర్మన్ నజామ్‌సేథీ



**ఇస్లామాబాద్, మే 10:** భారత్ తో పోలిస్తే పాకిస్థాన్ ఆర్థికంగా, అంతర్జాతీయంగా అత్యంత బలహీన స్థితిలో ఉందని, ప్రస్తుత పరిస్థితుల్లో భారత్ ముందు నిలబడలేని దుస్థితి నెలకొందని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) మాజీ ఛైర్మన్ నజామ్ సేథి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం భారత్, పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడి, ఆపరేషన్ సిందూర్, ఆ తర్వాత మే 9వ తేదీ రాత్రి పాకిస్థాన్ వైపు నుంచి పలు భారత నగరాలపై దాడికి జరిగిన యత్నం, దానిని భారత సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టడం వంటి ఘటనలతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలో, పాకిస్థాన్‌కు చెందిన ఓ టెలివిజన్ ఛానల్ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో పాల్గొన్న నజామ్ సేథి, పాకిస్థాన్ ప్రస్తుత దుస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మన దేశం చాలా బలహీనంగా తయారైంది. మనం ప్రస్తుతం ప్రమాదకరమైన దశలో ఉన్నాం. మన అంతర్గత పరిస్థితులు కూడా దారుణంగా ఉన్నాయి. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. అమెరికా కూడా మనకు అండగా నిలబడేందుకు నిరాకరిస్తోంది. ఇరాన్, ఆఫ్ఘనిస్థాన్‌లతో మన సంబంధాలు దెబ్బతిన్నాయి" అని నజామ్ సేథి విశ్లేషించారు. కార్యక్రమంలో యాంకర్ జోక్యం చేసుకుంటూ, భారత్ లో కూడా అంతర్గత సమస్యలు ఉన్నాయని, బంగ్లాదేశ్‌తో ఆ దేశ సంబంధాలు కూడా దెబ్బతిన్నాయని ప్రస్తావించారు. అయితే, నజామ్ సేథి ఈ వాదనను పూర్తిగా తోసిపుచ్చారు. భారత్‌తో పోలిస్తే బంగ్లాదేశ్ చాలా చిన్న దేశం. అంతర్జాతీయంగా భారతదేశానికి ఇప్పటికీ మంచి గుర్తింపు ఉంది. కానీ దురదృష్టవశాత్తు మనకు ఆ పరిస్థితి లేదు. ప్రస్తుత తరుణంలో విదేశీ పెట్టుబడులన్నీ భారత్ కే వెళుతున్నాయి. అరబ్ ప్రపంచం మొత్తం భారత్‌కే మద్దతుగా నిలుస్తోంది. సౌదీ అరేబియా, యూఏఈ వంటి దేశాలు భారత్‌తో బిలియన్ డాలర్ల కొద్దీ పెట్టుబడి ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. భారతదేశం ఏమాత్రం ఒంటరి కాదు, కానీ పాకిస్థాన్ మాత్రం ఒంటరైపోయింది అని సేథి అన్నారు.

# యుద్ధ రంగంలో డ్రోన్లదే హవా

**పహల్గాం ఉగ్రదాడి తరువాత భారత్, పాక్ భారీగా డ్రోన్ల వాడకం**

**రాబోయే రోజుల్లో డ్రోన్ల స్థానంలో ఫైటర్ జెట్ డ్రోన్లు**



**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** యుద్ధం అంటే ఒకప్పుడు ఆయుధాలు, వార్ ట్యాంకులు, వేల సంఖ్యలో సైనికులు అన్నట్లుగా పరిస్థితులు వుండేవి. కానీ నేడు ఈ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఇప్పుడంతా డ్రోన్‌ల మయంగా మారింది. శత్రు దేశ లక్ష్యాలను దెబ్బతీయాలంటే ఇప్పుడు అన్ని దేశాలు డ్రోన్లనే వాడుతున్నాయి. తక్కువ ధరకు లభ్యమవుతున్న డ్రోన్లతో ప్రత్యర్థి దేశాలకు ఎక్కువ నష్టం కలిగించే డ్రోన్లను ఇప్పుడు అనేక దేశాలు సొంతంగా తయారు చేసుకోవడం లేదా దిగుమతి చేసుకోవడం జరుగుతోంది. పహల్గాం ఉగ్రదాడి తరువాత భారత్ పాక్ మధ్య మొదలైన యుద్ధంలో ఇప్పుడు డ్రోన్లే కీలక పాత్ర వహిస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే డ్రోన్లే ఇప్పుడు గేమ్ చేంజర్లుగా మారాయి. భారత్‌పై పాక్ ప్రయోగిస్తున్న బైరెక్టార్ టిబి2. అసిగార్డ్ సొంగార్ రకం డ్రోన్లు టర్కీలో తయారనవి కాగా పాక్‌పై భారత్ వాడిన డ్రోన్లు ఇజ్రాయిల్, ఫ్రాన్స్‌లో రూపొందినవి కావడం గమనార్హం. పాక్ గగనతల రక్షణ వ్యవస్థలను నిమిషాల వ్యవధిలో తుత్తునియలు చేసిన భారత డ్రోన్లు ఆ దేశానికి దిమ్మదిరిగే షాక్ ఇచ్చాయి.

డ్రోన్ల వాడకం అనేది రెండు వేల దశకంలో ఎక్కువైనా 1917లోనే తొలి తరం డ్రోన్‌ను బ్రిటన్, అమెరికాలు తయారు చేశాయి. ఆ తరువాత వీటిని ఒక్కో దశ లో అనేక దేశాలు అభివృద్ధి చేసుకుంటూ పోయి 1990 దశకం వచ్చే సరికి అధునాతన డ్రోన్ ఆవిష్కృతమయ్యింది. ఇప్పుడు అనేక దేశాలు వాడుతున్న అధునా తన డ్రోన్లు గడచిన ఐదారేళ్ల వ్యవధిలో కొత్త టెక్నాలజితో రూపొందినవి. ఇందులో మిలటరీ కోసం తయారు చేస్తున్న సైనిక డ్రోన్లు యుద్ధ తంత్రాన్నే మార్చేస్తున్నాయి. నిన్నమొన్నటి వరకు డ్రోన్ల తయారీ రంగాన్ని అమెరికా, ఇజ్రాయిల్ శాసించగా ఇప్పుడు చైనా, టర్కీతో పాటు ఫ్రాన్స్ సహా మరి కొన్ని దేశాలు అగ్ర భాగాన వున్నాయి. ప్రస్తుతం టర్కీ తయారీ డ్రోన్లు ప్రపంచ వ్యాప్తంగా పేరొందాయి. డ్రోన్లలో వున్న రకాల విషయానికి వస్తే ప్రిడేటర్ డ్రోన్లు, రాడార్ డ్రోన్లు, సూసైడ్ డ్రోన్లు ఇలా అనేక రకాల డ్రోన్లు యుద్ధ రంగంలో కీలక భూమిక వహిస్తున్నాయి. తమకంటే బలమైన దేశమైన రష్యాపై పైచేయి సాధించేందుకు రష్యా టర్కీలో తయారైన అధునాతన డ్రోన్లను వాడింది. ఉక్రెయిన్ వాడిన కొన్ని రకాల డ్రోన్లు రష్యాలోని పలు ప్రాంతాలలో ద్రవ రూపంలో వున్న థర్మైట్ అనే రసాయనాలను స్ప్రే చేసింది. మండే స్వభావం వున్న ఈ రసాయనం వల్ల ఆయా ప్రాంతాల భూములు చాలా కాలం పాటు నిరుపయోగంగా మారగా. అక్కడి ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఇక పాకిస్తాన్ భారత్‌పై ప్రయోగిస్తున్న సోంగార్, బైరెక్టార్ టిబి 2 రకం డ్రోన్లు పేలుడు సామర్థ్యం కలిగినవి. ఒక రకంగా చెప్పాలంటే ఇవి ఆత్మాహుతి డ్రోన్లు. వీటిని చాలా వరకు బారత సైన్యం నిరోధించినా కొన్నిచోట్ల నష్టం వాటిల్లింది.

**ప్రపంచంలో అత్యధిక మిలటరీ డ్రోన్లు కలిగిన పది దేశాలు:** ఇక ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో మిలటరీ డ్రోన్లు కలిగిన దేశాల్లో అమెరికా అగ్రభాగాన వుంది. అమెరికా వద్ద 13,710 అధునాతన డ్రోన్లు వున్నాయి. ఇందులో ఎక్కువగా ప్రత్యర్థి దేశాలపై నిఘా కోసం తయారయినవే కావడం గమనార్హం. అమెరికా వద్ద వున్న మిలటరీ డ్రోన్లలో ఆర్‌క్యూ 11 రావెన్ పేరిట వున్నాయి. ఈ రకం డ్రోన్లు వైమానిక నిఘా కోసం తయారయినవి. అమెరికా తరువాత టర్కీ దేశం డ్రోన్ల తయారీలో ద్వితీయ స్థానంలో వుంది. ఈ దేశంలో 1421 డ్రోన్లు వున్నాయని అంచనా. డ్రోన్ టెక్నాలజిలో అభివృద్ధి చెందిన దేశాల్లో టర్కీ ప్రస్తుతం ముందు వరుసలో వుంది. మధ్యస్థ ఎత్తులో ఎగరగల బెరెక్టార్ టిబి 2తో పాటు సోంగార్‌లు ఇందులో ప్రధానమైనవి. ఈ రకం డ్రోన్లను టర్కీ అజర్‌బైజార్, ఖతార్, ఉక్రెయిన్‌లకు భారీగా ఎగుమతి చేస్తోంది. టర్కీ తరువాత యూరపియన్ దేశం పోలాండ్ డ్రోన్ల తయారీలో మూడవ స్థానంలో వుంది. ఈ దేశం వద్ద 1209 డ్రోన్లు వున్నట్లు అంచనా. పోలాండ్ నౌకా దళంలో డబ్ల్యూ బి గ్రూప్ అభివృద్ధి చేసిన వెయ్యికి పైగా వార్మెట్ లాటరింగ్ రకం డ్రోన్లు వున్నాయి. ఇవి తేలికపాటి రకం డ్రోన్లు. పోలాండ్ తరువాత రష్యా వద్ద 1050 డ్రోన్లు వున్నాయి. రష్యా కూడా డ్రోన్ టెక్నాలజి కోసం భారీగా పెట్టుబడులు పెడుతోంది. రష్యా వద్ద వున్న డ్రోన్లలో అధిక భాగం స్థానికంగా తయారు చేసిన ఓ ర్లాన్ 10 రకం డ్రోన్లు కావడం గమనార్హం. ఉక్రెయిన్ చేస్తున్న డ్రోన్ల దాడిని ఎదుర్కొనేందుకు రష్యా కొత్తరకం డ్రోన్లను తయారు చేస్తోంది. రష్యా తరువాత జర్మనీ వద్ద 670 డ్రోన్లు వున్నాయి. ఇవన్నీ సైనిక అవసరాల కోసం వున్నాయి. ఇక డ్రోన్ల వినియోగంలో భారత్ ఆరవ స్థానంలో వుంది. భారత్ వద్ద 625 డ్రోన్లు వున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వీటిలో 600 డ్రోన్లు స్ప్రైలైట్ రకం డ్రోన్లు వున్నాయి. వీటిని 2019లో రక్షణ రంగంలో ప్రవేశ పెట్టారు. 2015లో 400 మిలియన్ డాలర్ల ఒప్పందంతో ఇజ్రాయిల్ నుంచి 10 హెరాన్ 1 డ్రోన్లను భారత్ కొనుగోలు చేసింది. దీంతో పాటు ఇటీవల ఫ్రాన్స్ నుంచి డ్రోన్లను భారత్ కొన్నది. వీటితో పాటు భారత్ వద్ద 15 హారోప్ మానవరహిత విమానాలు వున్నాయి. భారత్ తరువాత ఫ్రాన్స్ వద్ద 591, ఆస్ట్రేలియా వద్ద 557, దక్షిణ కొరియా వద్ద 518, ఫిన్లాండ్ వద్ద 412 డ్రోన్లు వున్నాయి.

# వందలాది భద్రతా దళాలతో షార్‌లో మాక్‌డ్రిల్

**తిరుపతి పోలీసులు, సిఐఎస్ఎఫ్ దళాల సమన్వయం**



ఉగ్రవాదులను ఎదుర్కోవడానికి షార్‌లో చేపట్టిన మాక్‌డ్రిల్

**శ్రీహరికోట (తడ), మే 10 ప్రభాతవార్త:** అత్యంత భద్రత ప్రదేశమైన భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం శ్రీహరికోటలో సిఐఎస్ఎఫ్ దళాలు, తిరుపతి పోలీసులు సంయుక్తంగా శనివారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సూచనలతో శ్రీహరికోటలోని సిఐఎస్ఎఫ్ డిఐజి సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సుమారు రెండుగంటలపాటు షార్ వద్ద మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ డ్రిల్‌లో వివిధ సెక్యూరిటీల నుంచి సమన్వయంతో సిబ్బంది పాల్గొన్నారు. శ్రీహరికోటను ఎప్పుడూ కంటికి రెప్పలా కాపాడే కేంద్రపారిశ్రామిక భద్రత దళాలు ప్రస్తుత పాకిస్తాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో మరింత అప్రమత్తం అయ్యాయి. సీనియర్ కమాండెంట్ సంజీత్‌కుమార్, డిప్యూటీ కమాండర్ ఎస్‌కె గౌర్‌లతో పాటు సూళ్లూరుపేట సిఐ మురళీకృష్ణ, శ్రీహరికోట ఎస్ఐ కె.శ్రీకాంత్, సిఐఎస్ఎఫ్‌దళాలు, పోలీసు బలగాలు మాక్‌డ్రిల్‌లో పాల్గొన్నారు. అత్యవసర యూనిట్లుగా క్విక్ రెస్పాన్స్ టీమ్ 70మంది, బాంబ్ డిస్పోజల్ టీమ్ ఐదుగురు, అగ్నిమాపక విభాగం ఎనిమిది మంది, వైద్య సిబ్బంది నలుగురు, ఇంటలిజెన్స్ బ్యూరో అధికారి చిరాగ్, సిబ్బంది, మెరైన్ పోలీసులు, సివిల్ పోలీసులు ఇందులో పాల్గొన్నారు. ఏదయినా ముప్పు సంభవించినప్పుడు భద్రత దళాలు ఏ విధంగా సంసిద్ధతగా ఉండాలో సమన్వయంతో పాటు ప్రతి స్పందన అవసరాలు ఈ మాక్‌డ్రిల్ లక్ష్యంగా ఉంది. ఇందులో పాల్గొనే యూనిట్లు సమర్థవంతమైన కమ్యూనికేషన్, వేగవంతమైన చర్యలను ప్రదర్శించాయి. ఈ కారణంగా మాక్ డ్రిల్ విజయవంతమైనట్లు అధికారులు తెలిపారు. దేశంలోని ఇస్రో కేంద్రాల వద్ద భద్రతను పెంచాల్సిన అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్రప్రభుత్వం శ్రీహరికోటలోను భద్రత చర్యలను పటిష్టం చేసినట్లు వారు పేర్కొన్నారు.



# మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తాం

## ప్రతి కుటుంబానికి రూ.10లక్షల సాయం: జమ్ముకాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా

**శ్రీనగర్, మే 10:** జమ్ముకాశ్మీర్ సరిహద్దుల్లో పాకిస్థాన్ జరిపిన విచక్షణారహిత కాల్పుల్లో సుమారు 20 మంది పౌరులు మృతిచెందిన సంగతి తెలిసిందే. మృతుల కుటుంబాలకు జమ్ముకాశ్మీర్‌ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా నష్టపరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలచొప్పున పరిహారం అందిస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలకు తమ ప్రభుత్వం ఎప్పటికీ మద్దతుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. పహల్గాంవ్ దాడికిప్రతీకారంగా ఉగ్రస్థావరాలను భారత్ ధ్వంసం చేయడంతో పాక్‌కూడా సరిహద్దుప్రాంతాల్లో ప్రతీకార దాడులకు పాల్పడుతోంది. నియంత్రణ రేఖ వెంట పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి దాడులకు తెగబడింది. జమ్ముకాశ్మీర్‌ప్రభుత్వ అధికారి రాజ్‌కుమార్ థాపా సహా 20 మందిపౌరులు ప్రాణాలు కోల్పోయారు. పదులసంఖ్యలో గాయపడ్డారు. ఒక్కరోజుముందే తాను నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో రాజ్‌కుమార్ పాల్గొన్నారని, ఇంతలోనే రాజౌరిలోని ఆయన ఇంటిపై జరిగిన దాడిలోప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేసారు. ఉగ్రవాదంపై పోరు ఆగదని, శాంతియుత సహజీవనంవైపే తాము ప్రాధాన్యత ఇస్తామని ఒమర్ అబ్దుల్లా ఈసందర్భంగా పేర్కొన్నారు. నాలుగురోజుల్లో పూంచ్, రాజౌరి, జమ్ము బారాముల్లా సెక్టార్లలో 19 మంది మరణించారు. బుధవారం పూంచ్‌లో 12 మంది మరణిస్తే శుక్రవారం ఊరి, పూంచ్‌లోమరో ఇద్దరు మరణించారు. శనివారం ఉదయం పాక్ కాల్పుల్లో ఒక సీనియర్‌ప్రభుత్వ అధికారి మరో ఐదుగురుప్రాణాలు కోల్పోయారు.

# పాక్ నెత్తిన మండుతున్న 'బలోచ్' కుంపటి

## ఓ పట్టణాన్ని స్వాధీనం చేసుకొన్న బిఎల్‌ఏ



**ఇస్లామాబాద్, మే 10:** భారత్‌ను రెచ్చగొడుతూ భంగపాటుకు గురవుతున్న పాకిస్థాన్ నెత్తిన మరో పిడుగు పడింది. దశాబ్దాలుగా ఆ దేశానికి కొరకరాని కొయ్యగా మారిన బలోచిస్థాన్ వేర్పాటువాద ఉద్యమం తాజా ఉద్రిక్తతల వేళ మరింత తీవ్రమైంది. తాజాగా అక్కడ ఓ పట్టణాన్ని బలోచ్ లిబరేషన్ ఆర్మీ స్వాధీనం చేసుకోవడంతో దాయాదికి స్వదేశంలోనే సవాల్ ఎదురైంది. బలోచిస్థాన్ ప్రావిన్స్‌లో గల కాలత్ జిల్లా మంగోచర్ పట్టణాన్ని తాము స్వాధీనం చేసుకున్నట్లు బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్‌ఏ) శనివారం ప్రకటించింది. అంతేగాక, బలోచిస్థాన్ వ్యాప్తంగా 39 ప్రాంతాల్లో మెరుపుదాడులు చేశామని వెల్లడించింది. ఈ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని, మిలిటరీ కాన్వాయ్‌లపై దాడులు చేస్తామని హెచ్చరించింది. ఇప్పటికే కొంతమంది స్థానిక పోలీసులను బందీలుగా తీసుకున్నట్లు తెలుస్తోంది. పోలీసు స్టేషన్‌ను తమ నియంత్రణలోకి తీసుకున్న బిఎల్‌ఏ రహదారులను దిగ్బంధించింది. అయితే, బలోచ్ రెబల్స్ ప్రకటనపై పాక్ ప్రభుత్వంనుంచి ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. ఇదిలా ఉండగా శుక్రవారం కూడా పాక్ ఆర్మీ సిబ్బందిపై తిరుగు బాటుదారులు దాడి చేయగా 22 మంది సైనికులు మరణించినట్లు వార్తలు వచ్చాయి. దీనిపైనా ఎలాంటి అధికారిక సమాచారం లేదు.

# పాక్ కాల్పుల్లో మరో జవాన్ వీరమరణం



సచిన్ యాదవ్‌రావు వనాంజే (ఫైల్)

**ముంబై, మే 10:** భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఆపరేషన్ సిందూర్‌లో మరో జవాన్ వీరమరణం పొందారు. సరిహద్దుల్లో పోరాడుతూ మహారాష్ట్ర - తెలంగాణ సరిహద్దులోని నాందేడ్ జిల్లా తమ్లూర్ చెందిన ఆర్మీ సోల్జర్ సచిన్ యాదవ్‌రావు వనాంజే (29) జమ్మూ కశ్మీర్‌లో నేలకొరిగారు. సచిన్ మరణవార్త తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. స్వగ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. యుద్ధంలో ఇప్పటికే తెలుగు జవాన్ మురళీనాయక్ (22) వీరమరణం పొందారు. దేశ రక్షణలో శుక్రవారం తెల్లవారుజామున రెండున్నర గంటల ప్రాంతంలో దాయాది బుల్లెట్‌కు బలయ్యారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలోని గోరంట్ల మండలం కల్లి తండాకు చెందిన మురళీ 'ఆపరేషన్ సిందూర్' సందర్భంగా నియంత్రణ రేఖ వద్ద విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో జరిగిన కాల్పుల్లో తీవ్రంగా గాయపడ్డారు. మెరుగైన చికిత్స నిమిత్తం విమానంలో ఢిల్లీకి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే తనువు చాలించాడు. దేశ భద్రతలో తన ప్రాణాలను పణంగా పెట్టిన మురళీనాయక్ త్యాగం మన దేశం ఎప్పటికీ మరువలేనిదని కేంద్ర, రాష్ట్ర ప్రముఖులు నివాళులర్పించారు.

# భారత్-పాకిస్థాన్ సంయమనం పాటిస్తే మంచిది

## అవసరమైతే నిర్మాణాత్మక పాత్ర పోషిస్తాం: చైనా



**బీజింగ్, మే 10:** భారత్-పాకిస్థాన్‌ల మధ్య సమస్యకు ముగింపు పలికేందుకు అవసరమైతే నిర్మాణాత్మక పాత్ర పోషిస్తామని చైనా పేర్కొంది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో చైనా ఈ మేరకు పేర్కొనడం గమనార్హం. ఇరు దేశాలు సంయమనం పాటించాలని చైనా విదేశాంగ శాఖ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. 'భారత్-పాక్‌ల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తత పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నాం. శాంతి, స్థిరత్వం కోసం ఇరుదేశాలు సమయమనం పాటించాలని కోరుతున్నాం. శాంతియుత మార్గాలతో సమస్యలను పరిష్కరించుకోవాలి. ఉద్రిక్తతలను తీవ్రతరం చేసే చర్యలను తగ్గించుకోవాలని సూచిస్తున్నాం. ఈ ఉద్రిక్తతలను తగ్గించాలని అంతర్జాతీయ సమాజం కూడా ఆశిస్తోంది. ఈ సమస్య ముగింపునకు అవసరమైతే నిర్మాణాత్మక పాత్ర పోషించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం' అని బీజింగ్ పేర్కొంది. గత నెల 22న పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. దీనికి ప్రతిగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాల లక్ష్యంగా దాడులు చేసింది. దీంతో భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు తీవ్రతరమయ్యాయి.

# స్వరం మార్చిన పాకిస్థాన్

## చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడి



**ఇస్లామాబాద్, మే 10:** భారత్ తమపై దాడిచేస్తే ఎదురుదాడికి దిగుతామని మేకపోతు గాంభీర్యం ప్రదర్శించిన పాకిస్థాన్ ఇప్పుడు స్వరం మార్చింది. పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్‌దార్ మీడియాతో మాట్లాడుతూ భారత్ తమపై చేస్తున్న సైనిక దాడిని ఇక్కడితో ఆపితే తాము కూడా ఉద్రిక్తతలు తగ్గించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఉభయ దేశాల మధ్య దాడుల వల్ల పాక్ ఆర్థిక పరిస్థితి కుదేలవ్వడం, ప్రజల పరిస్థితులు అధ్వానంగా మారే ప్రమాదం ఉండడంతో ఈ యుద్ధ వాతావరణాన్ని రూపుమాపడం కోసం న్యూఢిల్లీతో చర్చలు జరపడానికి ఇస్లామాబాద్ సిద్ధంగా ఉందని పాకిస్థాన్ అధికారిక వర్గాలు వెల్లడించాయి. భారత్-పాక్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో పరిస్థితులు చేయి దాటకముందే దాడుల నివారణకు చర్యలు తీసుకోవాలని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఇరు దేశాలకు సూచించారు. ఈ నేపథ్యంలో పాక్ విదేశాంగ శాఖ మంత్రి ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. గురువారం రాత్రి నుంచి పాక్ భారత సరిహద్దు ప్రాంతాల్లో దుస్సాహసానికి ఒడిగడుతూనే ఉంది. బారాముల్లా నుంచి భుజ్ వరకు 26 ప్రాంతాలపైకి వరసగా డ్రోన్లు ప్రయోగించింది. ముఖ్యంగా శ్రీనగర్ విమానాశ్రయాన్ని, అవంతీపొరా వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకొని డ్రోన్లను ప్రయోగిస్తూ విఫలయత్నం చేస్తుండగా, దాయాది చర్యలను భారత సైన్యం తిప్పికొడుతోంది. శనివారం మరోసారి జమ్మూ, ఫిరోజ్‌పుర్, పఠాన్‌కోట్, జైసల్మేర్, బాడ్‌మేడ్, భుజ్ తదితర ప్రాంతాలపై వీటిని మళ్లీ పంపేందుకు ప్రయత్నించగా భారత సైనికులు వాటిని కూల్చేశారు.

11-5Pg6exHMNWJQE.qxd:11-5Pg6exHMNWJQE.qxd 11/05/25 11:59 PM Page 1



# దైవ దర్శనానికి వెళుతూ పరలోకాలకు - అదుపుతప్పి కారు బోల్తా, తండ్రి, కుమారుడితో పాటు మరో వ్యక్తి మృతి

**బత్తలపల్లి, మే 10 ప్రభాతవార్త** ఆనందంగా దైవ దర్శనానికి వెళుతున్న వారిలో అకస్మాత్తుగా ప్రమాదం జరిగి తండ్రి, కుమారుడి తో పాటు మరో వ్యక్తి మృతి చెందారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లి గ్రామం ఔటర్ రింగ్ రోడ్ వై జంక్షన్ లో అనంతపురం వైపు నుండి కదిరి వైపు వెళుతున్న సెల్ఫ్ కారు అదుపు తప్పి బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న పదిమంది లో తండ్రి కుమారుడు మృతి చెందగా, ప్రశాంత్(30) పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం కు తరలించగా అక్కడ నుండి బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. మరో ఏడు మందికి చిన్నచిన్న రక్త గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కళ్యాణదుర్గం టౌన్ చెందిన గాజుల రామ్మోహన్ (సాఫ్ట్వేర్ ఉద్యోగి) తన కుటుంబ సభ్యులు, అతని స్నేహితులు రాజశేఖర్ రెడ్డి(45)వారి కుటుంబ సభ్యులు, ముకుందాపురం గ్రామానికి చెందిన ప్రశాంత్, అందరూ కలిసి కళ్యాణదుర్గం నుండి తిరుమల వెంకటేశ్వర స్వామి దైవదర్శనం కొరకు వెళుతూ ప్రమాదానికి గురైంది. బత్తలపల్లి గ్రామం అనంతపురం కు వెళ్లే వై జంక్షన్ కు కొద్ది దూరంలో కారు డ్రైవర్, ఓనర్ అయిన రామ్మోహన్ కారు నడుపుతూ వేగాన్ని అదుపు చేయలేక కారు ఉన్నఫలంగా బ్రేక్ వేయడంతో అదుపుతప్పి కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న కారు డ్రైవర్, ఓనర్ అయిన రామ్మోహన్, అతని భార్య మాధవి, వీరి కుమార్తెలు సాన్విక పదకొండ సంవత్సరాలు, జశ్విత 8 సంవత్సరాలు, కౌటిల్ కుమార్ నాలుగున్నర సంవత్సరం, రాజశేఖర్ రెడ్డి, భార్య దీపిక, కుమారుడు యస్విత్ రెడ్డి (7), కుమార్తె వీరాధ్య 3 సంవత్సరాలు, స్నేహితుడైన ప్రశాంత్ కుమార్ లు కారు ప్రమాదంలో దెబ్బలు తగిలి రోడ్డుపై పడి పోయారు. రోడ్డుపై వెళ్లేవారు, స్థానికులు అందించిన సమాచారం మేరకు బత్తలపల్లి పోలీస్లు, 108 సిబ్బంది సహాయంతో సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను బత్తలపల్లి ఆర్ డి టి హాస్పిటల్ కు తరలించారు.

ఆర్ డి టి హాస్పిటల్ లో రాజశేఖర్ రెడ్డి, యశ్విత్ రెడ్డిలు మృతి చెందారు. తండ్రి, కుమారుడు మృతితో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ప్రశాంత్ కుమార్కు తీవ్రగాయాలు కావడంతో ఆర్ డి టి లో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురంకు తరలించారు. మిగిలిన క్షతగాత్రులకు ఆర్ డి టి హాస్పిటల్ లో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

## కక్ష కోసం కాదు ఆడబిడ్డల పసుపుకుంకుమల రక్ష కోసమే భారత్ యుద్ధం : హోంమంత్రి వంగలపూడి

విజయవాడ, మే10, ప్రభాతవార్తప్రతినిధి: కక్ష కోసం కాదు ఆడబిడ్డల పసుపుకుంకుమల రక్ష కోసమే భారత్ యుద్ధం చేసిందని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు.ఆ మేరకు ఒక ప్రకటన విడుదల చేసారు. పెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్ ఒక్కటేనన్నారు హోంమంత్రి వంగలపూడి అనిమతసామరస్యానికి నిలువెత్తు నిదర్శనం మన దేశం భిన్నత్వంలో ఏకత్వం ఒక్క మనదేశంలోనే సాధ్యం1965, 71, 2016, 2019 లో యుద్ధవాతావరణం వచ్చినా శాంతిని పాటించాంఎన్ని కుయుక్తులు పన్నినా ప్రజాస్వామ్యం ఏనాడూ చెక్కు చెదరలేదుపాక్ ఉగ్రవాదులు దాడికి ప్రతి భారతీయ పౌరుడి హృదయం బరువెక్కిందికాళ్ల పారాణి ఆరకముందే భర్తను తన కళ్లముందే ఉగ్రవాదులు చంపడం దుర్మార్గంసాధారణ పౌరులను కర్కశంగా కన్నపిల్లలు, కట్టుకున్న వారిముందే తుపాకులతో కాల్చడం దారుణం26 మంది చనిపోతే 150 కోట్ల మంది తమ కుటుంబసభ్యులే దూరమైనంత వేదన అనుభవించారుచనిపోయిన వారిలో ఇద్దరు మన ఆంధ్రప్రదేశ్ వారే కావడం మరింత బాధాకరంఒంగోలులో టీడీపీ కార్యకర్త హత్య జరిగితే వెళ్లి పరామర్శించానుఉగ్రదాడిలో వెనువెంటనే మన రాష్ట్ర పౌరులు ఇలా భౌతికంగా దూరమవడం జరిగిందివిశాఖలో చంద్రమౌళి, కావలిలో మధుసూదన్ కుటుంబాలకు ప్రభుత్వం అన్నివిధాల అండగా ఉంటుందికావలికి చెందిన మధుసూదన్ రావు మృతి చెందిన తీరు అత్యంత విషాదకరంప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, అజిత్ దోవల్ త్రిమూర్తుల్లా దేశ ప్రతిష్టను, దేశ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టారుమహిళలైన కల్నాల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ సహా ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదులను మట్టుపెట్టడం గర్వించే విషయంగవర్నర్ అబ్దుల్ నజీర్ చొరవతో మతపెద్దల సమావేశం అనివార్యం, అభినందించాల్సిన విషయంఇతర దేశాల పౌరులని హింసించడం, చంపడం భారతదేశ చరిత్రలో లేదుఆంధ్రప్రదేశ్ పౌరులను మాక్ డ్రిల్ ద్వారా అప్రమత్తం చేశాంజవాన్ మురళీనాయక్ కుటుంబ పరిస్థితి గురించి మంత్రి సవితతో ఫోన్ లో మాట్లాడానుఉన్న ఒక్క కొడుకుని సైన్యంలో చేర్పించిన ఆ కుటుంబం తెగువకు హ్యాట్సాఫ్కాల్పుల విరమణకు భారత్, పాక్ దేశాలు అంగీకరించడం ఆహ్వానించదగ్గ పరిణామన్నారు.



## కాణిపాకంలో భారీగా పెరిగిన వేసవి రద్దీ

-దర్శనానికి నాలుగైదు గంటల సమయం

కాణిపాకం, ఏప్రిల్ 18 ప్రభాతవార్త: సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిది వినాయక స్వామి అలయం శనివారం పోటెత్తిన భక్తులతో పోటెత్తింది. సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు శని, ఆదివారాలు ప్రభుత్వ సెలవు రోజులు కావడంతో పాటు విద్యాసంస్థలు, పాఠశాలల్లో ఇంటర్, 10వ తరగతి పరీక్షలు పూర్తయి ఫలితాలు రావడంతో కాణిపాకం ఆలయ దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని భక్తులతో పోటెత్తింది. ఆలయంలోని క్యూలైన్లతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన

# మహిళల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా!

- కుప్పంలో మహిళల్ని పారిశ్రామిక.. వ్యాపారవేత్తలుగా మార్చే ప్రణాళిక !!
- అలీప్.. ఫ్రంటైయర్ మార్కెట్స్ ద్వారా శిక్షణలు.. ఉపాధి అవకాశాలు !!

**కుప్పం, మే 10 ప్రభాతవార్త** గతంలో డ్వాక్రా సంఘాల ఏర్పాటు ద్వారా మహిళలకు పొదుపు, ఆర్థిక లావాదేవీల వ్యవహారాల్లో కీలకం చేసిన సిఎం చంద్రబాబునాయుడు తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో మరోమారు మహిళల్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నారు. కుప్పం ప్రాంతంలో మహిళల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా కుప్పంలో వివిధ కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టారు. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కడ) ద్వారా ఈ కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. గత జనవరి నెలలో హైదరాబాద్‌కు చెందిన అలీప్ సంస్థ కుప్పంలో చేపట్టే కార్యకలాపాల కోసం వారికి సుమారు 14 ఎకరాల భూమి కేటాయించడంతో పాటు శంకుస్థాపన చేసిన విషయం విదితమే. ఇప్పటికే అలీప్ సంస్థ కుప్పం ప్రాంతంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా మారాలనుకుంటున్న మహిళలకు తగు శిక్షణ తరగతులను రెండు విడతలుగా నిర్వహించింది. మహిళలు తాము ఏర్పాటుచేయదలచుకున్న చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, వాటికి అవసరమైన వనరులు, ప్రొడక్ట్ ఉత్పత్తి, మార్కెటింగ్ తదితర అంశాలపై మహిళలకు కూలంకుషంగా శిక్షణ తరగతుల్లో తర్ఫీదు ఇచ్చారు. త్వరలోనే వీరికి బయటి ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించనున్నారు. దాదాపు వంద మంది మహిళలు అలీప్ సంస్థ ద్వారా ఇప్పటికే శిక్షణ పొందడం విశేషం. ముమ్ముందు కుప్పంలో మహిళలు సొంతంగా పరిశ్రమలు స్థాపించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈసంస్థ కుప్పం వచ్చేందుకు సిఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి ప్రత్యేక చొరవ చూపారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఆర్థిక అక్షరాస్యత (డిజిటల్) పెంచడంతో పాటు వారు రిటైల్ డిజిటల్ ఆన్‌లైన్ వ్యాపారం నిర్వహించేందుకు ప్రస్తుతం ఫ్రంటైయర్ మార్కెట్స్ సంస్థ కుప్పంకు వచ్చింది. ఆ సంస్థ సిఇఒ అజైతాషా ఇటీవలే కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్‌తో ప్రభుత్వం తరపున ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈసంస్థ మేరీ సహేలీ పేరిట యాప్‌ను రూపొందించింది. ఈయాప్‌ను మహిళలు ఎలా వినియోగించాలి, యాప్‌లో లభించే వస్తువులు, వాటి విక్రయ వివరాలు తదితరాలు పొందుపరచారు. ఈసంస్థ ద్వారా మహిళలు గ్రామాల్లోనే ఆన్‌లైన్ డిజిటల్ వ్యాపారం చేసుకునే దుకాణాలు సైతం ఏర్పాటుచేసుకునే అవకాశం ఉంది. తద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమైన వివిధ రకాల ఉత్పత్తులను ఫ్రంటైయర్ మార్కెట్స్ సంస్థ నేరుగా గ్రామాల్లోకే సరఫరా చేస్తుంది. తద్వారా మహిళలు తమ ఆర్థిక స్థితిని మెరుగుపరచుకుని వ్యాపారవేత్తలుగా మారే అవకాశం ఉంది. వీటితో పాటు కుప్పంలో మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం మరిన్ని కార్యక్రమాలు ముమ్ముందు నిర్వహించనుంది.

## దేవుని ఆశీస్సులు అందరిపై ఉండాలి - శ్రీవారిసేవలో ప్రముఖులు

**తిరుమల, మే 10 ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, స్వామివారి దయతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించినట్లు ప్రముఖులు తెలిపారు. జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్, సినీనటి శ్రీముఖి శనివారం ఉదయం ఆలయంలోనికి చేరుకుని దేవదేవుడి ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి వేదాశీర్వచనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## 16న డిఎస్సీ హిందీ ఆన్‌లైన్ ఉచిత మోడల్ టెస్ట్

విజయవాడ, మే10, ప్రభాతవార్తప్రతినిధి: హిందిలో డిఎస్సీ రాసే అభ్యర్థులకు ఇది మంచి కబురు. ఈనెల 16న సాయంత్రం 6 నుంచి 8.30 గంటల వరకూ యాప్‌లో ఉచిత డిఎస్సీ హిందీ ఆన్‌లైన్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు హిందీ సేవాసదన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఎస్. గైబువల్లి ఒక ప్రకటనలో తెలిపారు. డిఎస్సీలో స్కూల్ అసిస్టెంట్, టిజిటి, పిజిటి హిందీ పరీక్షలకు రాష్ట్రంలోని హిందీ అభ్యర్థులంతా హాజరుకావొచ్చునని పేర్కొన్నారు. ఆన్‌లైన్ మోడల్ టెస్ట్‌తో పరీక్ష రాసే విధానం, సిలబస్ అనుసారంగా ప్రశ్నాపత్రం, సమయపాలన తదితర విషయాలపై అవగాహన కలుగుతుందని వివరించారు. హిందీ సేవాసదన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని రాష్ట్రవ్యాప్తంగా డిఎస్సీ హిందీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. మిగతా వివరాలకు సెల్ : 9581386150, 9553677119, 9848783787 సంప్రదించాలని విజ్ఞప్తిచేశారు.

## మంత్రి సత్యకుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన జెసి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు



మంత్రి సత్యకుమార్‌కు పుష్పగుచ్చాలు అందజేస్తున్న ఏపి జేఏసి అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు

**అనంతపురం, మే 10 ప్రభాతవార్త బ్యూరో** అమరావతి ఆంధ్రప్రదేశ్ జాయింట్ యాక్షన్ కమిటీ (ఏపీ జేఏసీ) అధ్యక్షులు, రాష్ట్ర రెవెన్యూ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, శనివారం అనంతపురంలో పర్యటించిన ఆరోగ్య శాఖ సహాయ మంత్రి సత్యకుమార్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల, ముఖ్యంగా రెవెన్యూ శాఖలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలు, సంక్షేమ కార్యక్రమాలు, పరిపాలనా సవాళ్లపై సవివరంగా చర్చించారు. ముఖ్యాంశాలుగా ఉద్యోగుల భద్రత, పదోన్నతులు, సేవా నిబంధనల సరళీకరణ, వృత్తిపరమైన శిక్షణా అవకాశాలు, క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధిని మంత్రికి వినిపించారు. మంత్రి సత్యకుమార్ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందిస్తూ, ఉద్యోగుల సంక్షేమం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా కట్టుబడి ఉన్నాయని తెలిపారు. లేవనెత్తిన ప్రతి అంశాన్ని పరిశీలించి, సంబంధిత శాఖలకు తగిన ఆదేశాలు ఇవ్వడం ద్వారా వీటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశం అనంతరం వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి స్పందన మాకు ఆశాజనకంగా ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పట్ల వారి నిబద్ధత స్పష్టంగా కనిపిస్తోంది. మా ప్రతిపాదనలు త్వరలోనే అమలవుతాయన్నారు.

## టిజిఆర్‌జెసి సెట్‌కు 84 శాతం మంది హాజరు

### 12 జిల్లాల్లో 301 కేంద్రాల్లో పరీక్ష

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని విద్యాశాఖ అధ్వర్యంలో కొన సాగుతున్న రెసిడెన్షియల్ జూనియర్ కాలేజెస్‌లో ప్రవేశాల కోసం నిర్వహించే టిజిఆర్‌జెసి సెట్-2025 శనివారం ప్రశాంతంగా జరిగింది. పరీక్షకి 84.38 శాతం మంది విద్యార్థులు హాజరైనట్టు సొసైటీ కార్యదర్శి రమణ కుమార్ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 35 రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి శనివారం టిజిఆర్‌జెసి సెట్‌ను నిర్వ హించారు. 35 జూనియర్ కాలేజీల్లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూపులను ఇంగ్లీష్ మీడియంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లను తీసు కోను న్నారు. రాష్ట్రవ్యాప్తంగా 35 జూనియర్ కాలేజీలు ఉండగా.. వాటిలో బాలురకు 15, బాలికలకు 20 గురుకుల జూనియర్ కాలేజీలు కొనసాగు తున్నాయి. ప్రవేశపరీక్షకు 72,695 మంది దరఖాస్తు చేసుకొన్నారు.



జీవో కాపిని చూపుతున్న వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

# హంద్రీనీవా లైనింగ్ పనులను ఆపించండి

- 10వేల క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచండి
- వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం, మే 10 ప్రభాతవార్త బ్యూరో** హంద్రీనీవా లైనింగ్ పనులను వెంటనే నిలుపుదల చేసి 10వేల క్యూసెక్కుల సామర్థ్యం పెంచేలా చేస్తే చంద్రబాబుపేరు చరిత్రలో నిలబడిపోతుందని, లేదంటే రాయల సీమ ద్రోహిగా చరిత్రలో మిగిలిపోతాడని వైఎస్‌ఆర్‌సిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. జిల్లా వైసిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. జిల్లా పర్యటనలో చంద్రబాబునాయుడు హంద్రీనీవా విషయంలో అపద్దాలు చెప్పి చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేశారని, చరిత్ర చెరిపేస్తే చెరిగి పోదని గుర్తుంచుకోవాలన్నారు. కృష్ణ జలాల కోసం దశాబ్దాలుగా పెద్ద ఎత్తున అనేక మంది, అనేక పార్టీలు పోరాటాల ఫలితంగా హంద్రీవా ప్రాజెక్టు రూపకల్పన జరిగిందన్నారు. అయితే 1983లో ఎన్టీఆర్ ఓడిసి వద్ద, 1996లో ఉరవకొండలో చంద్రబాబునాయుడు, తిరిగి 1999లో ఆత్మకూరు వద్ద చంద్రబాబునాయుడు శంకుస్థాపనలు చేశారన్నారు. మూడు సార్లు టిడిపి హయాంలో శంకుస్థాపనలకే పరిమితం అయ్యారు తప్పా గంప మట్టి కూడా తీయలేదన్నారు. 2004లో వైఎస్ఆర్ సీఎం అయ్యాక, 2005లో ఉరవకొండలో 40 టీఎంసీల సామర్థ్యంతో హంద్రీనీవాకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారన్నారు. మాల్యాల నుంచి 12 పంపుల ద్వారా జీడిపల్లికి మొదటి దశలో జీడిపల్లి నుంచి పుంగనూరు వరకు 2వ దశ పనులు చేపట్టి, 6.2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే దిశగా పనులు చేపట్టారన్నారు. వైఎస్ఆర్ హయాంలోనే హంద్రీనీవాకు దాదాపు రూ.5వేలకోట్లు ఖర్చు చేశారన్నారు. 2012 నవంబర్ 18న అప్పటి సిఎం క ఇరణ్‌కుమార్‌రెడ్డి మాల్యాలను హంద్రీనీవా ద్వారా కృష్ణ జలాలను విడుదల చేస్తే, తమతోపాటు అప్పటి మంత్రి రఘువీరారెడ్డి నీటి వెంట పాదయాత్ర చేసి 2012 నవంబర్ 29న జీడిపల్లికి నీరు తెచ్చామని ఎమ్మెల్యే హోదాలో పయ్యావుల కేశవ్ అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేయడంజరిగిందన్నారు. వాస్తవాన్ని మరుగున పరిచేలా చంద్రబాబునాయుడు అంతా తానే చేసినట్లు చెప్పుకోవడం విడ్డూరంగాఉందన్నారు. అదే విధంగా ముఖ్యమంత్రి హోదాలో వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అనంతపురంలో కంటి వెలుగు కార్యక్రమానికి హాజరైతే 6,300 క్యూసెక్కులకు హంద్రీనీవాను పెంచాలని, తాను సీఎం దృష్టికి తీసుకెళ్తే జీవో కూడా విడుదల చేసి రూ.4647 కోట్లతో పనులు చేపట్టేందుకు టెండర్లు కూడా పూర్తయ్యాయన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ టెండర్లను రద్దు చేసి, 3850 క్యూసెక్కులకే పరిమితం చేసి విస్తరణ పనులు చేపడుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో 10వేలక్యూసెక్కులతో హంద్రీనీవాను విస్తరిస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబునాయుడు నేడు 3850 క్యూసెక్కులకు పరిమితం చేయడం వల్ల భవిష్యత్తులో అదనంగా నీరు తెచ్చుకోవాలంటే తీసుకోలేని పరిస్థితికి తీసుకెళ్లి ఈ ప్రాంత ప్రజలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా చంద్రబాబునాయుడు లైనింగ్ పనులను రద్దు చేసి 10వేల క్యూసెక్కులకు హంద్రీనీవా సామర్థ్యాన్ని పెంచాలని ఆయన సూచించారు. సమావేశంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట మధు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్ నాయకులు ఖాజా, అంజి తదితరులు పాల్గొన్నారు.

# దుర్గమ్మ ఆలయంలో పలు విభాగాలు తనిఖీ

- భక్తులకందిస్తున్న సౌకర్యాలపై నూతన ఇఓ వికె శీనా నాయక్ పరిశీలన



దుర్గమ్మ ఆలయ పరిసరాలు పరిశీలించి అధికారులకు ఆదేశాలిస్తున్న ఇఓ

**ఇంద్రకీలాద్రి, మే 10, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఆలయంలో భక్తులకందిస్తున్న సౌకర్యాలపై నూతన ఇఓ వికె శీనా నాయక్ శనివారం స్వయంగా పరిశీలించారు. దుర్గాఘాట్‌ను పరిశీలించి జల్లు సౌకర్యాల ఏర్పాటు చేయాలన్నారు. మహిళలకు దుస్తులు మార్చుకోటానికి, మరుగుదొడ్లు కు పూర్తి మరమ్మత్తులు చేయాలని ఆదేశాలిచ్చారు. ఆలయ పారిశుద్ధ్యం మరింత మెరుగ్గా నిర్వహించి శుభ్రంగా వుంచాలన్నారు. దుర్గాఘాట్లో కొబ్బరికాయలు, పూజాసామాగ్రి తదితరాలమ్మే దుకాణదారులను క్రమపద్ధతిలో పెట్టాలని, ధరల్లో తేడా వుండకూడదని సిబ్బందికి ఆదేశాలిచ్చారు. తలనీలాలు సమర్పించే భక్తులకు కేశ ఖండన శాలలో ఇబ్బందులుండకుండా చర్యలు తీసుకోవాలని, భక్తులతో మర్యాదగా మెలగాలని ఆదేశాలిచ్చారు. కుమ్మరిపాలెంలో వున్న స్థలంపై వివరాలు తెలుసుకుని అక్కడ భక్తుల సౌకర్యార్థం రూపొందించిన వివరాలు తెలుసుకున్నారు. మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్ ఎదురుగా వున్న కొండప్రాంతం పరిశీలించి రెండవ ఘాట్‌గురించి రూపొందించిన ప్రతిపాదనల వివరాలు తెలుసుకున్నారు. ఆలయ భద్రతలో కీలకమైన శివాలయం దిగువ మెట్టు, రుద్రహోమం మండపం ప్రాంతం, పరిశీలన చేసి ఉత్తరంవైపు మెట్ల దారిలో గతంలో వున్న సిబ్బంది నివాస సముదాయం ప్రాంతం భద్రత రీత్యా ఉపయోగంలోకి తీసుకురావడానికి పరిశీలన చేయాలన్నారు. కొండపైన అక్షరాభ్యాసం, అన్నప్రసాన కార్యక్రమాలు నిర్వహించే మండపం పరిశీలించి భక్తుల సెంటిమెంట్లను పరిశీలిస్తు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొండమీద వివిధ ప్రాంతాల్లో గల మంచినీటి కూలర్స్ పరిశీలించి, కూలర్లపై శుభ్రం చేసిన తేదీ నమోదు చేయాలన్నారు. ఉచిత ప్రసాదం పంపిణీ పరిశీలించి భక్తులు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణంలో వున్న యాగశాల పూజా మండపాలు పరిశీలించి భక్తులకు త్వరగా అందుబాటులోకి తేవాలన్నారు.

దుర్గమ్మవారి ఆలయంలో శనివారం సాయంత్రం విజయవాడకు చెందిన నర్తన డ్యాన్స్ ఇన్స్టిట్యూట్ నృత్య విద్యార్థులు ఆచార్య పి మానస నేతృత్వంలో వారి విద్యార్థులు భక్తిశ్రద్ధలతో పలు కీర్తనలకు, సంకీర్తనలకు, భక్తిగీతాలకు అనుగుణంగా నృత్యనీరాజనమర్పించి భక్తులను ఆకట్టుకున్నారు. కళాకారులకు దుర్గమ్మవారి దర్శనాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు.

## అన్న మృతి.. తమ్ముడు ఆత్మహత్య

**కర్నూలు, మే 10, ప్రభాతవార్త :** తోడబుట్టిన సోదరుడు ఆత్మహత్య చేసుకుని మరణించాడన్న మనస్థాపనతో యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. నాలుగు నెలల వ్యవధిలో అన్నదమ్ములు మృతి చెందడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు నగరంలోని రామచంద్ర నగర్లో నివాసముంటున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రాకేష్ గౌడ్ హైదరాబాదులో సాఫ్ట్వేర్ ఇంజనీరుగా పనిచేసేవాడు. నాలుగు నెలల క్రితం అతనికి వివాహం చేశారు. అయితే వివిధ కారణాలతో వివాహం జరిగిన 20 రోజులకే రాకేష్ ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. ఈ ఘటనతో తీవ్రమనస్థాపానికి గురైన రాకేష్ సోదరుడు వంశీ కృష్ణ గౌడ్ (30) మనస్థాపానికి గురై శనివారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. 4 నెలల క్రితం అతని అన్న రాకేష్ గౌడ్ ఆత్మహత్య చేసుకున్నప్పటి నుంచి అన్న మృతిని జీర్ణించుకోలేక కొన్ని రోజులుగా మనస్థాపానికి గురై, అదోమాదిరిగా ఎవ్వరితో మాట్లాడకుండ ఉండేవాడు. ఈ నెల 7వ రాకేష్ గౌడ్ తండ్రి శ్రీనివాసులు కుటుంబ సమేతంగా బంధువుల వివాహానికి వెళ్ళాడు. అయితే తమతో కూడా వివాహానికి రమ్మని వంశీని పిలిచినప్పటికీ అతను నిరాకరించాడు.

దీంతో వంశీకృష్ణను ఇంటి వద్ద ఉంచి బంధువుల పెళ్లికి వెళ్లారు. తిరిగి వచ్చేపరికి వంశీకృష్ణగౌడ్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల నుండి విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వగా రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ అనుపత్రికి తరలించారు. తండ్రి శ్రీనివాసగౌడ్ ఇచ్చిన. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాపు చేస్తున్నామని రైల్వే పోలీసులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఆశా వర్కర్లు దుర్మరణం

**విజయవాడ, మే10, ప్రభాతవార్తప్రతినిధి:** మచిలీపట్నం- విజయవాడ జాతీయ రహదారి గూడూరు మండలం తరకటూరు గ్రామం వద్ద శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మచిలీపట్నం రైల్వే స్టేషన్ వద్ద గల శుభం కల్యాణ మండపంలో జరగనున్న ఆశా వర్కర్ల సదస్సుకు హాజరవ్వటానికి వస్తున్న ఆటో తరకటూరు గ్రామం కియా కారు ఢీ కొట్టడంతో సంఘటనా స్థలంలో ఇద్దరు మృతి చెందగా, నలుగురికీ తీవ్ర గయాలపాలయ్యారు. తాడేపల్లి విజయలక్ష్మి( 45) గోపునేనిపాలెం పమిడిముక్కల మండలం, ఊటుకూరి దుర్గ (40) కపిలేశ్వరం పి.హెచ్.సి తాడంకి గ్రామం ఇద్దరు ఘటనా స్థలం వద్ద మృతి చెందారు. వాణి తాడంకి గ్రామం, గుండె నాగమల్లేశ్వరి మద్రివాడ గ్రామం, గుండె నిర్మల జ్యోతి మద్రివాడ గ్రామం, మాగంటి సుజాత తాడంకి గ్రామంకు చెందినవారు.

# ఇస్లాం పేరిట మారణహోమం సృష్టిస్తున్న పాక్

## ఎంపి అసదుద్దీన్ ఒవైసి ఆరోపణ



సభలో ప్రసంగిస్తున్న ఎంపి అసదుద్దీన్ ఒవైసి

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 10, ప్రభాతవార్త:** పాకిస్థాన్ ఇస్లాం పేరుతో మారణహోమం సృష్టిస్తున్నదని ఇస్లాం పేరును పలికే అర్హత కోల్పోయిందని, అమాయకులను, చిన్నపిల్లలను చంపమని ఇస్లాం చెప్పలేదని, పాకిస్థాన్ దాడి చేస్తే భారత్ తగ్గే ప్రశక్తి లేదని ఎఐఎంఐఎం పార్టీ అధినేత, పార్లమెంట్ సభ్యుడు అసదుద్దీన్ ఓవైసి స్పష్టం చేశారు. భారత జవాన్‌లకు మనమందరం మద్దతుగా ఇవ్వాలని, చచ్చేవరకు భారత భూమి కోసమే బతకాలని ఆయన ఉద్వేగంగా ప్రసంగించారు. అంతేకాకుండా ఆయన సంచ నలమైన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఉర్దూ జర్నలిస్ట్స్ అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ప్రసంగించారు.

భారత్ నుంచి పాకిస్తాన్ విడిపోయిన తరువాత ఇక్కడి హిందువులకు, ముస్లింలకు మధ్య విద్వేషాలను రెచ్చగొట్టాలని చూసిందని ఆయన ఆరోపించారు. పాకిస్తాన్ ఆర్మీ జవానులను టార్గెట్ చేస్తూ దాడులకు పాల్పడుతున్నదని, తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపెరేషన్ సిందూర్ పేరుతో పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసిందని, దీంతో పాకిస్థాన్ భారత సరిహద్దు రాష్ట్రాలపై డ్రోన్లు, మిస్సైళ్లతో దాడికి ప్రయత్నిస్తున్నదని, ఈ దాడులను భారత్ పూర్తిగా ఎదుర్కొం టుందన్నారు. భారతదేశంలోని ముస్లింలు దేశం కోసం ప్రాణాలను అర్పించడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. పాకిస్తాన్ పచ్చి అబద్దాలతో ప్రపంచ దేశాల మద్దతు కూడగట్టుకోవాలని చూస్తున్నదని, కాని వారి మాటలు నమ్మే స్థితిలో ఎవరూ లేరని చెప్పారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీల నాయ కులు విభేదాలను విడనాడి దేశరక్షణ కోసం ఐక్యంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## రైల్వేస్టేషన్లలో భద్రత కట్టుదిట్టం

**హైదరాబాద్ (తార్నాక), మే 10, ప్రభాతవార్త:** భారత్.. పాకిస్థాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో రైల్వే ప్రయాణికుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు దక్షిణ మధ్యరైల్వే సీపీఆర్వో శ్రీధర్ వెల్లడించారు.

నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్‌లైన సికిందరాబాద్, కాచిగూడలో భారీగా భద్రతను పెంచినట్లు తెలి పారు. సీసీ కెమెరాల సంఖ్యను సైతం పెంచి పర్యవేక్షణ చేస్తున్నట్లు శ్రీధర్ పేర్కొన్నారు.

11-5P□g7exHMNWJQE.qxd:11-5P□g7exHMNWJQE.qxd 11/05/25 11:56 PM Page 1



# టెట్రాపాడ్స్‌తో కృష్ణా ప్రాజెక్టులకు భద్రత

## ఎన్ఎస్‌పి, పులిచింతల, ప్రకాశం బ్యారేజీలకు పొంచి ఉన్న నష్టం

### తెలంగాణ డ్యాం సేఫ్టీ అథారిటీ భయాందోళనలు

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** శ్రీశైలం బ్యారేజి పునాదుల్లో గొయ్యి టెట్రాపాడ్స్‌ను వినియోగించి తాత్కాలిక మరమ్మతు చేపడితే శ్రీశైలం ప్రాజెక్టు మాత్రమే కాకుండా దిగువన కృష్ణానదిపై ఉన్న నాగార్జునసాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజిలకు పొంచి ఉన్న ప్రమా దం నివారించడమేకాకుండా కృష్ణానది పరివాహక ప్రాంతంలో నివాసం ఉండే ప్రజలకు భద్రత కల్పించే అవకాశం మెరుగుపడుతోంది. రిజర్వాయర్స్ మేనేజ్ మెంట్ కమిటీ మూడేళ్ల క్రితం మరమ్మతుల అవసరాన్ని, నిధుల కేటాయింపులపై కృష్ణా బోర్డుకు నివేదిక ఇచ్చింది. జాతీయ ఆనకట్ట భద్రతా ప్రాధికారసంస్థ కూడా పలు సిఫార్సు లు చేసింది. ముంబయి సముద్రతీరం కోతకు గురికాకుండా ఏర్పాటు చేసిన టెట్రాపాడ్స్‌ను శ్రీశైలం ప్రాజెక్టు తాత్కాలిక మరమ్మతకు వినియో గించాలని తెలంగాణ డ్యాం సేఫ్టీ అథారిటీ సూచించింది. ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్‌కు రిసెర్చ్ బాధ్యతలు అప్పగించింది.

శ్రీశైలం డ్యాం దిగువన ఏర్పడిన గొయ్యితో ప్రమాదం ఉన్నప్పటికి ఆ ప్రాజె క్టును నిర్వహించే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నదని తెలంగాణ రాష్ట్రం నుంచి విమర్శలు వెల్లువెత్తున్నాయి. 2009లో కృష్ణా నదికి వచ్చిన భారీ వరదలతో పెద్ద గొయ్యిఏర్పడింది. నీటిపారుదలశాఖ ఇంజనీర్లు ప్లంజ్ పూల్ అనే పరిభాషతో డ్యామేజిని పిలుస్తారు. అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2014 వరకు శ్రీశైలం ప్రాజెక్టు ఒ అండ్ ఎం పై శ్రద్దను పెట్టలేదు. రాష్ట్రం 2014లో విభజించడంతో అవశేష ఆంధ్రప్రదేశ్‌కు శ్రీశైలం నిర్వహణ బాధ్యతలు ఇవ్వగా, తెలంగాణకు నాగార్జునసాగర్ నిర్వహణ బాధ్యతలు ఇచ్చారు. అవశేష ఆంధ్రప్రదేశ్ పాలకులు కూడా శ్రీశైలం నుంచి రోజు ఎనిమిది టిఎంసిల నీటిని తరలించుకుపోతున్నారే కానీ గొయ్యి విషంలో శ్రద్ధ తీసుకోవడంలేదు. గత 16 సంవత్సరాలుగా ప్రతి ఏటా వరదతో ఇది మరింత పెద్దదిగా గొయ్యి అవుతోంది. జాతీయ సంస్థలు చేసిన రీసెర్చ్‌లలో ఈ గొయ్యి దాదాపు 143 అడుగుల లోతు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని సంవత్సరం క్రితం హెచ్చరికలు చేసినా ఆంధ్రప్రదేశ్ పాలకులు మాత్రం నిర్లక్ష్యం వీడలేదు. ఇరువై నాలుగు రోజుల్లో నైరుతి రుతుపవనాలు తెలుగు నేలపై రానే వస్తున్నాయి. గత కొద్ది సంవత్సరాలుగా కృష్ణానదికి అంతంత మాత్రమే వరద వచ్చింది. ఈసారి భారీ స్థాయిలో వరదలు వస్తే డ్యాం పరిస్థితి ప్రమాదకరంగా మరుతుందని సర్వత్రా ఆందోళన మొదలైంది.. తెలంగాణ ఇఎన్సీ, డ్యాంసేఫ్టీ కమిటీ ఛైర్మన్ జి.అనిల్‌కుమార్ 'శ్రీశైలం డ్యాం తెలుగు రాష్ట్రాలకు అత్యంత కీలకం. ఆనకట్ట దిగువన భారీ గొయ్యి ఉండటం మంచిది కాదు. ఎన్డీఎస్‌ఏ సిఫార్సులను వెంటనే అమలు చేయాలి. తాత్కా లికంగా టెట్రాపాడ్స్‌తో ఈ పెద్ద గొయ్యి పూడ్చవచ్చు. డ్యాం నిర్వహణ ఏపీ పరిధిలో ఉన్న నేపథ్యంలో వీలైనంత త్వరగా వారు స్పందించాలి' అంటూ అనేక వేదికలపై మాట్లాడుతూ ఒత్తిఇడి పెంచుతున్నారు.

శ్రీశైలం ఆనకట్ట రక్షణపై తెలంగాణ డ్యాం సేఫ్టీ కమిటీ ఆందోళన వ్యక్తం చేస్తూ నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఇటీవల ప్రజంటేషన్ ఇచ్చింది. అంతేకాకుండా పలు లేఖలు రాసింది. కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో కూడా కమిటీ ఛైర్మన్, ఇరిగేషన్ శాఖ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ అనిల్‌కుమార్ మరోమారు మరమ్మతుల విషయాన్ని గుర్తు చేశారు. శాశ్వత మరమ్మతులు ఇప్పటికిప్పుడు సాధ్యం కాకపోయినా తాత్కాలిక పనులు చేపట్టాల్సిన అవసరాన్ని ఆయన సూచించారు.

పునాది కన్నా గొయ్యి లోతుగా ఉంది అని నీటిపారుదల శాఖ నిపుణులు అంటున్నారు. కృష్ణా నదిలో 14 లక్షల క్యూసెక్కుల స్థాయిలో భారీగా వరద వచ్చినా నీటిని దిగువకు విడుదల చేసేలా శ్రీశైలం ఆనకట్టను డిజైన్ చేసి అప్పట్లో నిర్మించారు. 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలిస్తున్న సమయంలో డ్యామ్ నీటి నిర్వహణకు తిలోదకాలు ఇవ్వడంతో ఒక్కసారిగా 25 లక్షల క్యూసెక్కుల వరద దిగువకు వదలాల్సి వచ్చింది. ఆ సమయంలో డ్యాం గేట్ల దిగువన స్పిల్‌వేకు సమీపంలో భారీ గొయ్యి పడింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ ఈ గొయ్యిపై బాతిమెట్రిక్ సర్వేను చేసింది. 400 మీటర్ల వెడల్పు, 143 అడుగుల లోతుగా ఈ గొయ్యి ఉన్నట్లు నివేదించింది.

ఆనకట్ట పునాది కన్నా లోతులో ఈ గొయ్యి ఉన్నట్లు బాతిమెట్రిక్ సర్వేలో గుర్తించారు. శ్రీశైలం ఆనకట్ట దిగువన ఏర్పడిన ప్లంజ్‌పూల్ ముప్పును తెలంగాణ రాష్ట్ర డ్యాం సేఫ్టీ కమిటీ అంచనా వేసిన వెంటనే ఎన్డీఎస్‌ఏకు నివేదించింది. శ్రీశైలం జలాశయం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకే కాకుండా చెన్నైకి తాగునీరు అందించే ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టు. వర్షాకాలంలో నిల్వ సామర్థం 215 టీఎంసీలు ఉంటే అది 23 లక్షల క్యూ సెక్కుల ప్రవాహంతో సమానం. ఎండాకాలంలో నీళ్లు అడుగంటిన సమ యంలో 130 టీఎంసీలు అంటే 14 లక్షల క్యూసెక్కులకు సమానంగా ఉంటాయి.

ఆనకట్టకు ఏదైనా అనుకోని ప్రమాదం ఏర్పడితే ఇంత భారీ ప్రవాహం డ్యాం నుంచి ఒకేసారి దిగువకు విడుదలవుతుంది. దిగువన ఉన్న నాగార్జునసాగర్ తర్వాత ఉన్న పులిచింతల, ప్రకాశం బ్యారేజీల పరిస్థితి తీవ్ర ప్రమాదంలో పడుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వరద ఒక్కసారి వూళ్ళపై పడితో కోటికిపైగా మంది ప్రజలు బంగాళాఖాతంలో నిమజ్జనం అయ్యే అవకాశం ఉన్నప్పటికి మరమ్మతుపై దృష్ఠి సారించడంలేదు. శ్రీశైలంలో జల విద్యుత్ ఉత్పాదన కూడా జరుగుతోంది. తెలంగాణ వైపు 900 మెగావాట్లు, ఏపీ వైపు 770 మెగావాట్ల జలవిద్యుత్ కేంద్రాలు ఉన్నా యి. వీటన్నింటిపైనా ప్రభావం పడుతుందని నివేదికను సమర్పించింది.

# కులగణన చరిత్రాత్మక నిర్ణయం

### రాజ్యసభ సభ్యుడు డా.లక్ష్మణ్

**హైదరాబాద్ (పంజగుట్ట), మే 10, ప్రభాతవార్త:** బీసీలకు నిజమైన గణాంకాలు లేకపోవడం వల్లే రిజర్వేషన్‌ల పెంపుదల మీద సమస్యలు వస్తున్నాయని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. శనివారం హైదరాబాద్‌లో కులగణన, ఓబీసీల భవిష్యత్ నిర్మాణం, సామాజిక న్యాయం అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం న్యాయమైన మార్గంలో కులగణన చేపట్టటం ఒక కీలకమైన చర్య అన్నారు. కులగణన పూర్తయితే రాజకీయ హక్కులు, విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధిలో బీసీలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. తెలంగాణలో గతంలో జరిగిన సర్వేలకు సంబంధించి న్యాయస్థానాల్లో నిలబడుతుందా లేదా అన్న అంశం కూడా చర్చించాలన్నారు. జనగణనతో కులగణన చేయడం చరిత్రాత్మక నిర్ణయం అన్నారు. మరో ముఖ్య అతిథిగా విచ్చేసిన యూపీ మంత్రి నరేంద్రకశ్యప్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు తెలివైనవారు, బుద్ధిమంతులని, మనలో చైతన్యం లేకపోవడం వల్లే ఇన్ని సంవత్సరాలు మనం వెనుకబడ్డామన్నారు. రాజ్యసభ సభ్యుడు ఆర్.క్రిష్ణయ్య మాట్లాడుతూ ప్రతిపక్షాలకు భయపడి మోడీ కులగణన చేశారని అంటున్నారు కానీ పాకిస్థాన్‌కే భయపడలేదు.. మోడీ కాంగ్రెస్‌కు భయపడతారా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన కులగణనలో చిత్తశుద్ధిలేదని ఆయన విమర్శలు చేశారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో మేధావులు, ఓబీసీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని తమతమ అభిప్రా యాలను వెల్లడించారు.

# రాష్ట్రంలో ఐఐటి, ఐఐఎం నెలకొల్పండి

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి చలగాని దయాకర్ వినతి

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఐఐఎం నెలకొల్పడంతోపాటు ఐఐటి సీట్లు పెంచాలని నూతన ఐఐటిలను ఏర్పాటు చేయాలని పిసిసి అధికార ప్రతినిధి చలగాని దయాకర్ డిమాండ్ చేశారు. శనివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలుసుకొని ఐఐటి సీట్ల పెంపు విషయంలో తెలంగాణను విస్మరించారని తిరుపతి, జమ్మూకశ్మీర్, పాలక్కాడా చత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాలలో మాత్రమే సీట్లు పెంచారని ఆయన గుర్తుచేశారు. 130 ఫ్యాకల్టీలను రూ.11828.79కోట్లతో చేయాలని నిర్ణయించారని ఇది గొప్ప పరిణామంగా ఆయన అన్నారు. తెలంగాణలో 2008లో ఐఐటిని హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారని జాతీయ ర్యాంకు కూడా వచ్చిందని ఆయన మంత్రికి తెలిపారు. ఐఐటి ప్రఖ్యాతి పెంచేందుకు మరోఐదువందల సీట్లు పెరిగేలా నూతన ఐఐటిలను నెలకొల్పాలని ఆయన కోరారు. తెలంగాణలో వైద్య,సాంకేతిక రంగాలతోపాటు ప్రాథమిక మాధ్యమిక విద్య అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని మంత్రికి వివరించారు. ప్రతి సంవత్సరం 10లక్షల మంది డిగ్రీ, ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరుతున్నారని రెండులక్షల మంది జెఇఇ మెయన్స్‌కు దరఖాస్తులు చేసుకుంటున్నారని వారి ఉత్సాహంకు అనుగుణంగా సీట్లు పెంచాలని కోరారు.

# మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకంలోకి మిరప

### 1,72,135 టన్నులకు మద్దతు ధర లోటు చెల్లింపు

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** తెలంగాణ మిరప రైతుల నిమిత్తం కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ లోని ధరలో లోటు చెల్లింపు (పిడిపి) ద్వారా రైతులకు మద్దతు అందించనుంది. మిరప రైతులు సాగు ఖర్చు కంటే తక్కువ ధరకు పంటను అమ్మాల్సి రావడంతో, ఈ అంతరాన్ని పూడ్చుడానికి ఈ మద్దతు ధరను ఇవ్వనున్నారు. మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ పథకం తెలంగాణలో అమలు చేస్తున్నట్లు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ధృవీకరించింది. ఇందుకు అవసరమైన చర్యలు ప్రారంభించాలని తెలంగాణ వ్యవసాయ శాఖను ఆదేశించింది. రాష్ట్రంలోని ఖమ్మం, మహబూబాబాద్, గద్వాల్, కొత్తగూడెం, భూపాలపల్లి, ములుగు, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో మిర్చి అధికంగా పండుతుంది. రాష్ట్రంలోని రైతులు ప్రస్తుతం తమ ఉత్పత్తి ఖర్చు కంటే తక్కువ ధరకు మిరపకాయలను అమ్ముకోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ అంచనా వేసిన మిరప ఉత్పత్తి 6,88,540 టన్నులలో 1,72,135 టన్నులను (అంటే 25 శాతం) మేర మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకంలోకి తీసుకురానుంది. మార్కెట్ ధర, ఉత్పత్తి ఖర్చు మధ్య వ్యత్యాసాన్ని కవర్ చేస్తారు. మిర్చి రేటు క్వింటాలుకు రూ.10,374గా నిర్ణయించబడింది. ప్రారంభంలో, రాష్ట్ర సర్కార్ ఈ మొత్తాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుంది. తదుపరి ఆమేరకు సొమ్మును కేంద్రం తిరిగి చెల్లిస్తుంది. దీనికోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 శాతం భరిస్తాయి. కాగా కొంతమంది దళారులు క్వింటాలుకు రూ.5 వేల నుండి రూ.6 వేల వరకు చాలా తక్కువ ధరకు రైతుల నుండి మిర్చిని కొనుగోలు చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు చేరాయి. ఈ నేపథ్యంలో కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది.




పి.వి.రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాలమహానాడు నాయకులు

# అణగారిన వర్గాలను పాలకులుగా చేయడమే పి.వి.రావు లక్ష్యం: పబ్బతి శ్రీకృష్ణ

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 10, ప్రభాతవార్త:** గౌతమబుద్ధుడు, జ్యోతి రావ్ ఫూలే, డా.బి.ఆర్.అంబేద్కర్‌ల స్ఫూర్తితో అణిచివేతలకు గురైన ప్రజలను పాల కులుగా చేయడమే మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉ మ్మడి ఎపిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో వెలువడిన 'ఆంధ్రప్రదేశ్' మాసపత్రిక సంపాదకుడు స్వరీయ పి.వి.రావు ఆశయమని, ఆయన ఆశయాల సాధన కోసం కృషి చేస్తా మని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ చెప్పారు. శనివారం ఎన్ఎస్ఎస్‌లో జరిగిన పి.వి.రావు 73వ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పి.వి.రావు స్థాపించిన మాలమహానాడు నైతిక విలువలు, సామాజిక బాధ్యతల కోసం తాము శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. తెలుగు, ఇంగ్లీషు, మరాఠి, హిందీ, ఉర్దూలో పట్టున్న పి.వి.రావు ఆంధ్రప్రదేశ్ మాసపత్రికకు ఎడిటర్‌గా పనిచేశారని తెలిపారు. అంతకుముందు మాలమహానాడు నాయకులు పి.వి.రావు చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు.

# తెలంగాణ ప్రతిష్టను దెబ్బ తీయాలని చూస్తున్న ఎమ్మెల్సీ కవిత

### భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** మిస్‌వరల్డ్ కాంపిటేషన్‌లను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్సీ కవిత తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను దెబ్బ తీయాలని చూస్తున్నదని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. మిస్ వరల్డ్ కాంపిటీషన్‌పై ఎమ్మెల్సీ కవిత చేసిన కామెంట్స్ పై స్పందించిన భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రతి అంశాన్ని రాజకీయం చేయాలని ఏదో ఒకటి వివాదస్పదంగా మాట్లాడాలి అన్నా ఆలోచన ఉన్నా రని ఆయన ఆరోపించారు.

మిస్ వరల్డ్ కాంపిటీషన్ లను పోస్ట్ ఫోన్ చేయడం లేదా రద్దు చేయడం వంటి కార్యక్రమాలు తెలంగాణ ప్రభుత్వానికి చేసే అధికారం లేదని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం కేవలం ఒక ఫెలిసేటేటర్ మాత్రమే అని ఆయన గుర్తుచేశారు. తెలంగాణ ఈరోజు చాలా సేఫెస్ట్ ప్లేస్ అని తెలంగాణలో పెట్టుబడులు పెట్టొచ్చని ఎంపి వివరించారు. తెలంగాణలో ఇంత పెద్ద ఈవెంట్లు ప్రపంచవ్యాప్తంగా చూస్తున్నటువంటి ఈవెంట్లను చేయ వచ్చని, నాలుగైదునెలల క్రితం ఈ ప్లేస్ తెలంగాణను సెలెక్ట్ చేసుకోవడం జరిగిందని ఆయన గుర్తుచేశారు. ఈరోజు మిస్‌వరల్డ్ లిమిటెడ్ అనే కంపెనీ ఇక్కడ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. కవిత అమెరికాలో కూడా చదువుకొని వచ్చింది, ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం పరిధి ఏంటి అనేది ఆమెకి అర్థం అయి ఉండాలి కానీ రాజకీయం చేయాలన్న దురుద్దే శంతో కాకుండా వాస్తవాలు మాట్లాడాలి చామల కోరారు.

# అందాల పోటీలకు నిరసన సెగ

## పలు మహిళా సంఘాల ప్రతినిధుల అరెస్ట్

### అందాల పోటీలు సిగ్గుచేటు: పిఒడబ్ల్యు సంధ్య

**హైదరాబాద్ (సైబరాబాద్ ప్రతినిధి), మే 10, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న మిస్‌వరల్డ్ అందాల పోటీలకు పలు మహిళా సంఘాల నుంచి తీవ్ర నిరసన ఎదురైంది. మహిళా సంఘాల ప్రతి నిధులు తమ కార్యకర్తలతో కలిసి శనివారం గచ్చిబౌలి స్టేడియం వద్ద నిరసన తెలియ చేయడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్‌వరల్డ్ పోటీలు ప్రారంభం కావడానికి ముందు ఒక్కసారిగా దూసుకువచ్చిన ప్రగతిశీల మహిళాసంఘంతోపాటు ఇతర మహిళా సంఘాల ప్రతినిధులు నిరసనకు దిగారు. మిస్‌వరల్డ్ పోటీలను వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. అందాల పోటీలు నిర్వహించడం తగదంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఒక దశలో వీరు స్టేడియం లోపలికి దూసుకువెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులకు,



గచ్చిబౌలి స్టేడియం వద్ద మహిళా సంఘాల ప్రతినిధులను అరెస్టు చేస్తున్న దృశ్యం

మహిళా కార్యకర్తలకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. దీంతో నిరసనకారులను అరెస్టుచేసిన పోలీసులు సమీపానవున్న పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా దాదాపు వంద మందిని అరెస్టు చేయగా తమలో కొందరికి గాయాలయ్యాయని మహిళా కార్యకర్తలు వాపోయారు. పిఒడబ్ల్యూ, సిఎమ్ఎస్, ఐద్వా, ఎయిమ్స్, పిడిఎస్‌యు, పివైఎల్ తదితర సంఘాలు మిస్ వరల్డ్ అందాల పోటీలకు వ్యతిరేకంగా నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిఓడబ్ల్యూ సంధ్య మా ట్లాడుతూ మిస్ వరల్డ్ అందాల పోటీలు సామ్రాజ్య వాద విష సంస్కృతికి నిదర్శన మన్నారు.

ఈ పోటీలకు వ్యతిరేకంగా గచ్చిబౌలి స్టేడియం ముందు తాము నినదిస్తుండగా తాడుతో రౌండప్‌చేసి తమ జెండాలను, బ్యాడ్జిలను బల వంతంగా లాక్కొని తమను పోలీస్ వ్యాన్‌లో ఎక్కించారన్నారు.

ఓవైపు రాష్ట్రంలో సామాన్యులు ఇబ్బందులు పడుతుంటే అందాల పోటీలు నిర్వహించడం సిగ్గచేటన్నారు.

# రికార్డు స్థాయిలో యాసంగి

## 79.96 లక్షల ఎకరాల్లో సాగు

### వ్యవసాయ శాఖ తుది నివేదిక వెల్లడి

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రస్తుత యాసంగి సీజనులో వివిధ పంటల సాగు రికార్డు స్థాయిలో నమోదైంది. యాసంగి సాధారణ సాగు విస్తీర్ణం 63,54,286 ఎకరాలు కాగా, ఈ సీజనులో రాష్ట్రవ్యాప్తంగా 79,96,302 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. నిరుడు యాసంగిలో సాగైన విస్తీర్ణంతో పోలిస్తే ఇది 12.25 లక్షల ఎకరాల మేర ఎక్కువ కావడం విశేషం.

ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయశాఖ తుది నివేదికను రూపొందించి ప్రభుత్వానికి సమర్పించింది. గత 2023-24 సీజనులో 67,70,396 ఎకరాల్లో పంటలు సాగవ్వగా, ఈసారి సుమారు 80 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేయటం విశేషం. యాసంగిలో సాగైన మొత్తం పంటల్లో అత్యధికంగా వరి 59,84,302 ఎకరాల్లో వరి సాగైంది. అలాగే 3,67,440 ఎకరాల్లో జొన్న, 9,13,411 ఎకరాల్లో మొక్కజొన్న, 2,22,772 ఎకరాల్లో శనగ, 56,273 ఎకరాల్లో మినుము, 2,51,115 ఎకరాల్లో వేరుశనగ, 31,444 ఎకరాల్లో నువ్వులు, 21,491 ఎకరాల్లో పొద్దుతిరుగుడు, 19,132 ఎకరాల్లో పొగాకు, 17,195 ఎకరాల్లో చెరకు పంటలు సాగైయ్యాయి. ఇక అత్యధికంగా రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లాలో 5,82,122 ఎకరాల్లో వివిధ పంటలతో అగ్రస్థానంలో ఉంది. అత్యధికంగా పంటలు సాగైన జిల్లాల్లో 5,31,682 ఎకరాలతో నిజామాబాద్ రెండో స్థానంలోను, 4,92,748 ఎకరాలతో సూర్యాపేట్ మూడో స్థానంలో ఉన్నాయి. అలాగే రాష్ట్రంలోనే అత్యల్పంగా 16,672 ఎకరాలతో మల్కాజిగిరి చివరి స్థానంలో ఉన్నట్లు వ్యవసాయ శాఖ పేర్కొంది.

# థర్మల్ పవర్ ప్రాజెక్టుకు భద్రత కట్టుదిట్టం

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** భారత్, పాకిస్తాన్ సరిహద్దులో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో కేంద్రం నేషనల్ థర్మల్ పవర్ (ఎన్టీపీసీ) ప్రాజెక్టుల్లో భద్రతను కట్టుదిట్టం చేసింది. దేశంలోనే కీలకమైన విద్యుత్ కేంద్రంగా గుర్తింపు పొందిన రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టులో భద్రతా వ్యవస్థనుపటిష్ఠం చేశారు. దక్షిణాదిలోని అన్ని రాష్ట్రా లకు ఈప్రాజెక్టు నుంచి విద్యుత్ సరఫరా జరుగుతోంది. దేశంలోని అన్ని కీలక ప్రాజెక్టులలో అలర్ట్ ప్రకటించిన క్రమంలో కేంద్రం రామగుండం ప్రాజెక్టులో భద్రతా వ్యవస్థను పెంచాలని ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. సీఐ ఎస్ఎఫ (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్) కేంద్రం ఆదేశాలతో అప్రమత్తమైంది. రోజువారీ భద్రతను పెంచడంతోపాటు అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. డ్రోన్ దాడులతో పాటు, విపత్తు సంభవిస్తే ప్రతి స్పందనకు సంబంధించి మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నది.

# 13న మరో రూ.2,500 కోట్ల రుణం

### సెక్యూరిటీ బాండ్లను విడుదల చేసిన సర్కార్

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** తెలంగాణ సర్కార్ మరో 2,500 కోట్ల రూపాయల మేర అప్పు తీసుకోవడానికి సెక్యూరిటీ బాండ్లను విడుదల చేసింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ నెల 13న నిర్వహించనున్న రాష్ట్ర ప్రభుత్వ సెక్యురిటీ బాండ్లను ఈవేలం వేయడం ద్వారా ఈ రుణాన్ని సేకరించనుంది. ఈ రుణంలో 21 ఏళ్ల కాల పరిమితితో 800 కోట్ల రూపాయలు, 22 ఏళ్ల కాల పరిమితితో మరో 800 కోట్ల రూపాయలు, 25 ఏళ్ల కాల పరిమితితో ఇంకో 900 కోట్ల రూపాయల చొప్పున రుణాన్ని సమీకరించనుంది. ఇక తెలంగాణ సహా దేశంలోని 7 రాష్ట్రాలు 11,500 కోట్ల రూపాయల చొప్పున రుణాలు తీసుకోనున్నాయి. ఇక ఈ ఆర్థిక సంవత్సరంలోని ఏప్రిల్ నుండి జూన్ వరకూ తొలి క్వార్టర్‌లో 14 వేల కోట్ల రూపాయల మేర రుణ సమీకరణ కోసం రిజర్వ్ బ్యాంక్‌కు తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ఇందులో భాగంగా ఏప్రిల్‌లో 3 దఫాల్లో రూ.4,400 కోట్లు తీసుకున్నది. ఈ త్రైమాసికంలోని ఈ రెండో నెలలో 6వ తేదీన ఇంకో 2 వేల కోట్ల రూపాయలు సేకరించింది. తాజాగా విడుదల చేసిన బాండ్లతో ఈ నెల 13వ తేదీన మరో 2,500 కోట్ల రూపాయలు తీసుకోనున్న నేపథ్యంలో ఈ క్వార్టర్‌లో ఇప్పటి వరకూ 8,900 కోట్ల రూపాయల రుణం తీసుకున్నట్లవుతుంది.

# సాగు మెలకువలపై రైతులకు అవగాహన

### రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం షురూ

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం కొనసాగుతోంది. రాష్ట్రంలో ప్రతివారం 200 గ్రామాల్లో ఆరు వారాల పాటు ఈ కార్యక్రమాన్ని తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహిస్తోంది. ప్రధానంగా ఇందులో ముఖ్యంగా ఆరు అంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా అవసరానికి మించి యూరియా వాడుతున్నారని, దాని వాడకం తగ్గించడం, అందువల్ల లాభాలు, నష్టాలను గూర్చి వివరిస్తున్నారు. ఇటీవల కాలంలో అధిక దిగుబడుల కోసం రైతుల అవసరానికి మించి రసాయనాలు వాడుతుండటం, దాని ప్రభావం వాతావరణం, రైతుల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపడమే కాకుండా, పంటల సాగుకు పెట్టుబడి వ్యయం కూడా పెరుగుతుందనే విషయాలను గూర్చి క్లుప్తీకరిస్తున్నారు. అలాగే విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు రశీదు తీసుకోవడం, తీసుకున్న దాన్ని సాగు అయిపోయేంతవరకు భద్రపరుచుకోవడం వంటి సూచనలు చేస్తున్నారు. వరి సాగుకున నీటిని ఎక్కువగా వాడకూడదని, రెండు, మూడు రోజులకు ఒకసారి పొలంలో నీరు తడి ఉంటే సరిపోతుందని అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాకుండా పంట పొలాల్లో పంట మార్పిడి చేయడంపై దృష్టిసారించాలని చెబుతున్నారు.



పూర్తి దగ్ధమైన కారు

# ఔటర్ రింగ్‌రోడ్డుపై కారు ప్రమాదం

### ముగ్గురు యువకులు మృతి

**హైదరాబాద్ (అబ్దుల్లాపూర్‌మెట్), మే 10, ప్రభాతవార్త:** ఔటర్ రింగ్‌రోడ్డుపై ప్రయాణిస్తున్న కారు రోడ్డుపై ఆగి ఉన్న బొలోరో వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు యువకులు అగ్నికి ఆహుతికాగా మరో యువకుడు చికిత్స పొందుతున్న సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీస్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని తాడ్‌బండ్‌కు చెందిన రితేష్‌కుమార్ అగర్వాల్ కుమారుడు దీపేష్ అగర్వాల్ తన స్నేహితుల్ని కలిసి వస్తానని చెప్పి రాత్రి 11 గంటలకు తన కారులో బయలు దేరాడు. తన స్నేహితులు సంచై మల్పాని, ప్రియాన్షు మిట్టల్‌తో కలిసి శంషాబాద్ నుండి ఘట్కేసర్ వెళ్లేందుకు ఓఆర్ఆర్‌పై ప్రయాణిస్తుండగా మార్గమధ్యంలోని గండిచెరువు బ్రిడ్జి వద్ద రెండు గంటల ప్రాంతంలో రోడ్డుపై ఎదురుగా ఉన్న బొలెరో గూడ్స్ వాహనాన్ని వీరు ప్రయాణిస్తున్న కారుతో ఢీకొట్టారు. దీంతో బొలెరో వాహనం 100 మీటర్ల మేరకు ముందుకు వెళ్లింది.. టాటా కారు ఇరుక్కుపోవడంతో మంటలు చెలరేగాయి. బొలెరో వాహనం డ్రైవర్ వెనుక భాగంలో ఇరుక్కున్న కారుని తీసే ప్రయత్నం చేయగా అప్పటికే మంటలు కారు మొత్తం వ్యాపిస్తుండగా వెనుక సీట్లో ఉన్న ప్రియాన్షును బయటికి తీశాడు. ఎదురుగా కూర్చున్న ఇద్దరు దీపేష్ అగర్వాల్ సంచై మల్పాని సజీవదహనమయ్యారు. కాగా తీవ్రంగా గాయపడిన ప్రియాన్షు మిట్టల్‌ను నగరంలోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందు ఉదయం నాలుగు గంటలకు మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించాలి

## నా వ్యాఖ్యలను వక్రీకరించారు

### సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ



శనివారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూమ్‌భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న పార్టీ జాతీయ కార్యదర్శి కె. నారాయణ

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రపంచవ్యాప్తంగా మానవాళికి బద్ధశత్రువైన ఉగ్రవాదం ఏ మతంలో ఉన్నా, ఏ కులంలో ఉన్నా, ఏ ప్రాంతంలో ఉన్నా దానిని సమూలంగా నిర్మూలించాల్సిందేనని సిపిఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. ఆడపిల్ల కన్నీరు ఊరికే పోదని, ఆపరేషన్ సిందూర్ భారత సైన్యం పక్కా ప్రణాళికతో పాకిస్థాన్ కేంద్రంగా కరుడుగట్టిన ఉగ్రవాదులు శిక్షణ పొందిన పలు కీలక ఉగ్రవాదుల శిక్షణ కేంద్రాలను విజయవంతంగా ధ్వంసం చేయడం ద్వారా భారత సైనిక శక్తిని ప్రపంచానికి చాటిందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూమ్‌భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడి యా సమావేశంలో వారు మాట్లాడారు. పహలా ంలో ముష్కరులు కాళ్ల పారాణి ఆరకముందే భార్య ముందు భర్తను చంపడం హేయమైన చర్య అన్నారు. సరి హద్దుల్లో ప్రాణాలు కోల్పోయిన ఎపికి చెందిన అగ్నివీర్ మురళి నాయక్‌కి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఉగ్ర వాదుల క్యాంపులపై దాడి క్రమంలో పాకిస్థాన్ సామాన్య జనాలకు ఇబ్బందులు కలిగించ వద్దని మాత్రమే తాను మాట్లాడానని, తన వ్యాఖ్యలు వక్రీకరించారని ఇది సరైంది కాదన్నారు. పాకిస్తాన్‌కి చైనా మద్దతు ఇస్తుందనేది అపోహ మాత్రమేనని, ఇందుకు సంబంధించి చైనా అధికారికంగా స్పష్టం చేసిన విషయాన్ని నారాయణ గుర్తు చేశారు.

కులగణన పూర్తి చేసేందుకు కాలపరిమితిని నిర్దేశించాలి కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న కులగణనను సిపిఐ పూర్తిగా స్వాగతిస్తుందని, అయితే ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు ఖచ్చితమైన కాలపరిమితిని నిర్ణయించాలని నారాయణ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ సుందరి పోటీలు నిర్వహించడం సిగ్గచేటని నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యుద్ధ కథనరంగంలో దూసుకుపోతున్న కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మనకు ఆదర్శ మన్నారు. కార్పొరేట్ సంస్థలకు అమ్ముడుపోయే ప్రపంచ సుందరి పోటీలు మనకు ఎందుకని.. వారు ఎవరికి ఆదర్శమని, ప్రపంచ సుందరీ మణులను పర్యాటక ప్రదేశాల్లో ఊరేగించినంత మాత్రాన ఈ రంగం అభివృద్ధి చెందుతుందా అని నారాయణ ప్రశ్నించారు. పర్యాటక ప్రాంతాలకు రవాణా సౌకర్యం, మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా .. వివిధ ప్రాంతాలకు పర్యాటకులు వచ్చేందుకు వీలు కలుగు తుందన్నారు.

భారత్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి పాకిస్తాన్ దాడులకు తెగబడ డంతో పాటు సుమారు 400 వరకు డ్రోన్లను ప్రయోగించగా, వాటిని భారత సైన్యాలు విజయవంతంగా తిప్పికొట్టడం అభినందనీయమని సయ్యద్ అజీజ్ పాషా అన్నారు.

సాధారణ పౌరులకు ఏలాంటి ప్రాణ నష్టం జరగకూడదనే లక్ష్యంతో భారత సైన్యాలు అర్థరాత్రి తర్వాత కేవలం ఉగ్రవాదుల శిక్షణ కేంద్రాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని వాటిని విజయవంతంగా పూర్తి చేయడం పట్ల ప్రపంచ దేశాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయన్నారు.

11-5pg10.qxd:11-5pg10.qxd 11/05/25 9:52 PM Page 1



ఆట



## ఏషియన్ పవర్ లిఫ్టింగ్‌లో.. చందనకు కాంస్యం

**న్యూఢిల్లీ:** ఆసియా సబ్‌జూనియర్, జూనియర్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్-2025లలో తెలంగాణకు చెందిన పవర్ లిఫ్టర్ తుడి సిరి చందన కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరిగిన మహిళల 52 కిలోల విభాగంలో పాల్గొన్న చందన 330 కిలోలు ఎత్తి మూడవ స్థానాన్ని దక్కించుకుంది. గత ఏడాది డిసెంబర్‌లో న్యూఢిల్లీలో జరిగిన 41వ ఫెడరేషన్ కప్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్-2024లో రాణించడం ద్వారా ఆమె ఆసియా పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికైంది. కాగా గత పదేళ్లలో చందన ఆరు జాతీయ మరియు 24 రాష్ట్ర ఈవెంట్లలో పాల్గొంది. రాష్ట్ర స్థాయి ఈవెంట్లలో పతకాలు గెలుచుకోవడమే కాకుండా, 2022 సంవత్సరంలో జాతీయ స్థాయి ఈవెంట్‌లో బంగారు పతకాన్ని గెలుచుకుంది. కేరళలో జరిగిన జూనియర్ నేషనల్ క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆమె కాంస్య పతకాన్ని గెలుచుకుంది. 2018 లో హైదరాబాద్‌లో జరిగిన ఎస్‌జిఎఫ్ గేమ్స్‌లో ఆమె రజత పతకాలను కూడా గెలుచుకుంది. తమిళనాడు, జార్ఖండ్, మహారాష్ట్రలలో జరిగిన జాతీయ స్థాయి ఈవెంట్‌లో 52 కిలోల విభాగంలో పాల్గొనడం ద్వారా ఆమె పతకాలను సాధించింది.




## భారత్‌లో వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ నియంత్రణ మండలి 2025-2027 సైకిల్ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌ను భారత్‌లోనే పరిశీలిస్తున్నది. 2025 ప్రపంచ టెస్ట్ చాంపియన్ షిప్ ఫైనల్ ఈ ఏడాది వచ్చే నెల లార్డ్స్‌లో జరుగనున్నది.గత నెలలో జింబాబ్వేలో జరిగిన ఐసీసీ చీఫ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్స్ కమిటీలో చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో ఐపిఎల్ ఛైర్మన్ అరుణ్ దుమాల్ బీసీసీఐ తరఫున పాల్గొన్నారు. భారతదేశం రాబోయే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరుకుంటే అభిమానులకు గొప్ప అవకాశం అవుతుందని అంచనా వేస్తున్నారు. ఇదే సమయంలో భారత్ ఫైనల్ ఆడకపోయినా చాలా మంది ఇతర రెండు అగ్ర జట్ల మధ్య జరిగే మ్యాచ్‌పై ఆసక్తి చూపుతారని భావిస్తున్నారు. భారత్ ఇప్పటి వరకు రెండుసార్లు డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరింది. 2021లో న్యూజిలాండ్ చేతిలో, 2023లో ఆస్ట్రేలియా చేతిలో ఓటమిపాలైంది. భారత జట్టు ఈ ఎడిషన్‌లో 2025 సైకిల్ ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయింది. కాగా స్వదేశంలో న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలో బోర్డర్ గవాస్కర్ సిరీస్‌లో ఓటమి తర్వాత ప్రపంచ చాంపియన్ షిప్ ఫైనల్ రేసు నుంచి టీమిండియా నిష్క్రమించింది. ఇక ఇటీవల భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ టెస్ట్‌ల నుంచి రిటైర్ అయ్యాడు. ఈ క్రమంలో టీమిండియా కొత్త కెప్టెన్‌తో టెస్ట్ ఛాంపియన్‌షిప్ కొత్త సీజన్‌లోకి ప్రవేశించనుంది. యువ బ్యాటర్ శుభ్‌మాన్ గిల్ ప్రస్తుతం కెప్టెన్సీ రేసులో ముందున్నాడు. భారత జట్టు ఇంగ్లాండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌తో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్‌ను మొదలుపెడుతుంది. మొదటి టెస్ట్ మ్యాచ్ జూన్ 20 నుంచి లీడ్స్‌లో జరుగుతుంది. భారత్ చివరిసారిగా 2021-22లో ఇంగ్లాండ్‌లో పర్యటించింది. ఆ సమయంలో జట్టు విరాట్ కోహ్లీ నాయకత్వంలో టెస్టులు ఆడింది. ఈ సిరీస్‌లో ఐదో టెస్టుకు బుమ్రా కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఇక ఈ సిరీస్ 22తో డ్రాగా ముగిసింది. కాగా డబ్ల్యూటీసీ తొలి ఎడిషన్ ఫైనల్ 2021లో సౌతాంప్టన్‌లో, రెండో ఎడిషన్ ఫైనల్ 2023లో ఓవల్‌లో జరిగింది.

# ఐపిఎల్‌కు 3సార్లు బ్రేక్

## మధ్యలోనే నిలిచిపోయిన సీజన్లు

### కరోనాతో అర్ధంతరంగా ముగిసిన మ్యాచ్‌లు




**న్యూఢిల్లీ:** ప్రపంచంలోనే అతిపెద్ద టీ20 లీగ్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) 18వ సీజన్ అకస్మాత్తుగా ఆగిపోయింది. భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో, భారత క్రికెట్ నియంత్రణ మండలి టోర్నమెంట్‌ను నిలిపివేయాలని నిర్ణయించుకోవలసి వచ్చింది. 58 మ్యాచ్‌ల తర్వాత ఈ నెల 9వ తేదీన బీసీసీఐ టోర్నమెంట్‌ను వారం పాటు నిలిపివేసింది. 2008లో ప్రారంభమైన ఈ లీగ్ చరిత్రలో వివిధ కారణాల వల్ల టోర్నమెంట్ వాయిదా వేయాల్సి రావడం ఇదే మొదటిసారి కాదు. ఐపిఎల్ 2008 లో ప్రారంభమైంది. అప్పటి నుంచి టోర్నమెంట్ ఎటువంటి సమస్యలు లేకుండా కొనసాగుతోంది.

కానీ, గత 5 సంవత్సరాలలో బీసీసీఐ టోర్నమెంట్‌ను వాయిదా వేయవలసి రావడం ఇది మూడోసారి. టోర్నమెంట్ మధ్యలో నిలిపివేయడం ఇది రెండోసారి. ఐపిఎల్ ప్రారంభం కావడానికి ముందే ఒకసారి వాయిదా వేయాల్సి వచ్చింది. ఐపిఎల్ ఎప్పుడు, ఎన్ని రోజులు వాయిదా పడిందనే వివరాలను గూర్చి తెలుసుకుంటే తొలిసారిగా ఐపిఎల్ 2020 లో వాయిదా వేయాల్సి వచ్చింది. అప్పుడు టోర్నమెంట్ మార్చి 29న ప్రారంభం కావాల్సి ఉంది. కానీ, కరోనా వైరస్ మహమ్మారితో ప్రపంచం కుదేలైంది. భారత బోర్డు మార్చి 15న టోర్నమెంట్‌ను ఏప్రిల్ 14 వరకు వాయిదా వేసింది. తరువాత ఏప్రిల్ 15న నిరవధికంగా వాయిదా వేసింది. చివరకు, 174 రోజుల తర్వాత, 2020 సెప్టెంబర్ 19న, టోర్నమెంట్ యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్‌లో ఐపిఎల్ మ్యాచ్‌లను పూర్తి చేశారు. మళ్ళీ ఒక సంవత్సరం తర్వాత ఐపిఎల్ 2021లో కూడా అదే జరిగింది. ఈసారి బీసీసీఐ బయోబబుల్‌లో టోర్నమెంట్‌ను నిర్వహించడం ప్రారంభించింది.

టోర్నమెంట్‌ను 34 వేదికలలో మాత్రమే నిర్వహించారు. ఇది ఏప్రిల్ 9న ప్రారంభం కావాల్సి ఉంది. కానీ, రెండవ దశ కరోనావైరస్ కారణంగా, మే 2న జరగాల్సిన మ్యాచ్ వాయిదా పడింది. ఈ సమయంలో, కొంతమంది ఆటగాళ్ళు వైరస్ బారిన పడ్డారు. ఆ తరువాత రెండు మ్యాచ్‌లు కూడా వాయిదా పడ్డాయి. చివరికి టోర్నమెంట్ మే 5న వాయిదా పడింది. మొత్తం మీద 139 రోజుల తర్వాత, సెప్టెంబర్ 19న, మరోసారి టోర్నమెంట్‌లో మిగిలిన భాగాన్ని యూఏఈలో పూర్తి చేశారు. ఇక ప్రస్తుఐపిఎల్ 2025 గురించి మాట్లాడుకుందాం. టోర్నమెంట్ మార్చి 22న ప్రారంభమైంది. అప్పటి నుంచి గత ఒకటిన్నర నెలల్లో టోర్నమెంట్‌లోని 57 మ్యాచ్‌లు పూర్తయ్యాయి. మే 8న ధర్మశాలలో పంజాబ్ కింగ్స్ వర్సెస్ ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య లీగ్ 58వ మ్యాచ్ జరుగుతుండగా, మ్యాచ్ కేవలం 10.1 ఓవర్ల తర్వాత రద్దు చేశారు. మరుసటి రోజు అంటే ఇప్పుడు 9న, టోర్నమెంట్ ఒక వారం పాటు వాయిదా పడింది. ఇప్పుడు టోర్నమెంట్ ఎప్పుడు తిరిగి ప్రారంభమవుతుందో తెలియాల్సి ఉంది.

## ఇటాలియన్ ఓపెన్‌లో.. లాజోవిక్‌ను ఓడించిన అల్కరాజ్





**న్యూఢిల్లీ:** ఇటాలియన్ ఓపెన్-2025లో 4సార్లు గ్రాండ్‌స్లామ్ ఛాంపియన్ అయిన కార్లోస్ అల్కరాజ్ సంచలన విజయం సాధించాడు. ఇటలీలోని రోమ్ లోగల ఫోరో ఇటాలికోలో అవుట్‌డోర్ క్లే కోర్ట్‌ల శనివారం జరిగిన ఈ టోర్నమెంట్‌లో సెర్బియా క్వాలిఫైయర్ దుసాన్ లా జోవిక్‌పై 6-3, 6-3 తేడాతో విజయం సాధించాడు.ఇటాలియన్ ఓపెన్‌లో జోకో మొదటి నాలుగు గేమ్‌లను అల్కరాజ్ గెలిచాడు. కానీ మొదటి సెట్‌ను 5-2తో సర్వ్ చేసినప్పుడు తన సర్వీస్‌ను వదులుకున్నాడు. స్పానియార్డ్ తదుపరి గేమ్‌లో వెనక్కి తగ్గాడు. ఫోరో ఇటాలికో వద్ద క్లే కోర్టులో తన వేగాన్ని ప్రదర్శించి డ్రాప్ షాట్‌ను ఢీకొట్టి ఒక కీలక పాయింట్‌పై బ్యాక్‌హ్యాండ్ విజేతను అందించాడు. ఇక ఏప్రిల్‌లో మోంటే కార్లో మాస్టర్స్ గెలిచిన అల్కారాజ్, ఈ సీజన్‌లో క్లే కోర్టులో 10-1తో మెరుగుపడ్డాడు. అతను తదుపరి 31వ సీడ్ అలెక్స్ మిచెల్సెన్ లేదా లాస్లో డిజెరేతో తలపడతాడు. నాలుగు సార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ అయిన అల్కరాజ్, మే 25న ప్రారంభమయ్యే ఫ్రెంచ్ ఓపెన్‌లో తన టైటిల్‌ను కాపాడుకోవడానికి సిద్ధమవుతున్నాడు. కాగా మహిళల టోర్నమెంట్‌లో, అగ్రస్థానంలో ఉన్న అరినా సబలెంకా అనస్తాసియా పొటాపోవాపై 6-2, 6-2 తేడాతో విజయం సాధించి శుభారంభం చేసింది.




## ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్ 2లో మధురకు స్వర్ణం

### పురుషుల టీమ్ ఈవెంట్లో భారత్‌కు 3 పతకాలు

**న్యూఢిల్లీ:** ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్ 2లో మధుర తొలి వ్యక్తిగత స్వర్ణం గెలుచుకోగా, టీమ్ ఈవెంట్లలో భారత్ మూడు పతకాలు సాధించింది. అంతకుముందు, శనివారం ఇక్కడ జరిగిన ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్ 2లో భారత కాంపౌండ్ ఆర్చర్లు అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి, టీమ్ ఈవెంట్లలో స్వర్ణం, రజతం మరియు కాంస్య పతకాలను గెలుచుకున్నారు. అభిషేక్ వర్మ, ఓజాస్ డియోటలే మరియు రిషబ్ యాదవ్‌లతో కూడిన పురుషుల జట్టు ఉత్కంఠభరితమైన ఫైనల్‌లో మెక్సికోను 232-228 తేడాతో ఓడించి స్వర్ణం సాధించడం పతకాల జోరులో ముఖ్యాంశం. మొదటి ఎండ్‌లో దాదాపు 59 పాయింట్లతో భారత్ 2 పాయింట్ల ఆధిక్యాన్ని బలంగా ప్రారంభించింది, మెక్సికో 57 పాయింట్లతో ఆధిక్యంలో ఉంది. రెండవ ఎండ్‌లో మెక్సికో 58 పరుగులతో పోరాడగా, భారతదేశం 56 పరుగులతో మ్యాచ్‌ను 115-115తో సమం చేసింది. మూడో ఎండ్‌లో, భారత్ 58 పరుగులతో మళ్లీ ఆధిక్యంలో ఉంది, మెక్సికో 57 పరుగులు చేసింది, భారత్ జట్టుకు 173-172 స్వల్ప ఆధిక్యాన్ని ఇచ్చింది. చివరి దశలో భారత త్రయం తమ ధైర్యాన్ని నిలుపుకుంది, అద్భుతమైన 59 పరుగులు చేసి స్వర్ణాన్ని కైవసం చేసుకోగా, మెక్సికో కేవలం 56 పరుగులు మాత్రమే చేయగలిగింది. మహిళల కాంపౌండ్ ఫైనల్లో, వెన్నం జ్యోతి సురేఖ, మధుర ధమన్‌గోంకర్, చికిత తనిపర్తి జట్టు 221-234 తేడాతో బలమైన మెక్సికన్ జట్టు చేతిలో ఓడిపోయి రజతం గెలుచుకుంది. ఇక ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్ 2లో మధుర ధమన్‌గోంకర్ అమెరికాకు చెందిన కార్సన్ క్రాహేపై 139-138 తేడాతో అద్భుతమైన విజయం సాధించింది. తన తొలి వ్యక్తి గత ప్రపంచ కప్ బంగారు పతకాన్ని గెలుచుకుంది. మూడు సంవత్సరాలుగా అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడనందుకు ప్రపంచ ఆర్చరీ ర్యాంకింగ్స్‌లో స్థానం పొందని మధుర, మూడవ ఎండ్‌లో 81-85తో వెనుకబడి ఉంది. కానీ 24 ఏళ్ల ఒత్తిడిలో అద్భుతమైన ప్రదర్శన చేసింది. దాదాపు దోషరహితంగా నాల్గవ ఎండ్‌లో కేవలం ఒక పాయింట్ మాత్రమే కోల్పోయి స్కోరును 110 ఆల్ వద్ద సమం చేసింది. డిసైడర్‌లో, ఆమె రెండు పర్ఫెక్ట్ 10లతో తన ఆధిక్యాన్ని నిలుపుకుంది. ఒక పాయింట్ తేడాతో అధిగమించి ఉత్కంఠభరితమైన ముగింపును సాధించింది. ఈ ఈవెంట్‌లో మధురకు ఇది మూడో పతకం కావడం విశేషం. అంతకుముందు మహిళల టీమ్ ఈవెంట్‌లో రజతం, మరియు అభిషేక్ వర్మతో కలిసి కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో కాంస్యం గెలుచుకుంది.

## నిత్యావసరాల కొరత భయం..కేంద్ర స్పష్టత

**న్యూఢిల్లీ, మే 10:** ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా అధిక ప్రభావం పడేది నిత్యావసరాల సరఫరా మీదే. అందుకే పాకిస్థాన్‌తో యుద్ధ పరిస్థితులు తీవ్రమవుతున్న క్రమంలో దేశంలోని పలు ప్రాంతాల్లో ముఖ్యంగా ఉత్తరాధి రాష్ట్రాల్లో నిత్యావసరాల కొరత భయం సామాన్య ప్రజల్లో నెలకొంది. జమ్మూ, జైపూర్, శ్రీనగర్ వంటి కొన్ని ప్రాంతాలలో కొనసాగుతున్న యుద్ధ ప్రయత్నాల కారణంగా కొరత వస్తుందనే భయంతో ప్రజలు వస్తువులను నిల్వ చేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టత నిచ్చింది. దేశంలో ఆహారం, ఎరువులు ఇంధనం వంటి అన్ని నిత్యావసర సరుకుల నిల్వలు తగినంత ఉన్నాయని వెల్లడించింది. ధరలపై ఎటువంటి ప్రభావం లేకుండా దేశవ్యాప్తంగా సరఫరా లైన్లు నిరాటంకంగా పనిచేస్తున్నాయని రాష్ట్రాలతో సమావేశం నిర్వహించిన తర్వాత అధికారులు తెలిపారు. రైలు, రోడ్డు, విమాన మార్గాల్లో సరుకుల రవాణాకు ఎలాంటి అంతరాయం లేదని, దేశంలోని దాదాపు 500 మార్కెట్లలో కీలక వస్తువుల ధరల స్థాయిలు స్థిరంగానే ఉన్నాయని ఆందోళన చెందవద్దని ప్రజలను కోరారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ వంటి ఇంధనాలకొరత ఆందోళనలపై ప్రముఖ చమురు సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కూడా తాజాగా స్పందించింది. ఇండియన్ ఆయిల్‌కు దేశ వ్యాప్తంగా ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, తమ సర ఫరా లైన్లు సజావుగా పనిచేస్తున్నాయని, ఎవరూ భయాందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఆహార కొరతకు సంబంధించిన ఫేస్ వార్తలను, అసత్య ప్రచా రాన్ని ఎవరూ నమ్మొద్దని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రజలను కోరారు. దేశంలో అవసరానికి మించి ఆహార నిల్వలు పుష్కలంగా ఉన్నాయని ఎక్స్‌పోస్ట్ ద్వారా ఆయన స్పష్టం చేశారు.



## వాణిజ్యం

## రెండు బ్యాంకులకు ఆర్‌బిఐ జరిమానా

**న్యూఢిల్లీ, మే 10:** భారతీయ రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా నిబంధనలు పాటించలేదనే కారణంతో ప్రముఖ బ్యాంకులైన స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా(ఎస్‌బిఐ), జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుపై జరిమానా విధించింది. ఆర్థిక క్రమశిక్షణను అమలు చేయడానికి, నిర్దేశించిన మార్గదర్శకాలకు బ్యాంకులు కట్టుబడి ఉండేలా ఈ జరిమానా విధిస్తున్నట్లు తెలిపింది. బ్యాంకుల రుణాలు, అడ్వాన్స్‌లు, అనధికార ఖాతాలు ఓపెన్ చేయడంలో నిబంధనల ఉల్లంఘనలను గుర్తించినట్లు ఆర్‌బిఐ తెలిపింది. దాంతో ఎస్‌బిఐకి రూ.1.72 కోట్ల జరిమానా విధిస్తున్నట్లు పేర్కొంది. జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్, 1949 ప్రకారం నిబంధనలను ఉల్లంఘించినందుకు రూ.కోటి జరిమానా విధిస్తున్నట్లు చెప్పింది. ఈ జరిమానాలు బ్యాంకింగ్ రంగంలో మరింత జవాబుదారీతనాన్ని నిర్ధారించడానికి దిద్దుబాటు చర్యగా పనిచేస్తాయని పేర్కొంది. రెగ్యులేటరీ నిబంధనల అమలు ఆర్థిక సంస్థలపై ఆర్‌బిఐ కఠినమైన పర్యవేక్షణను ప్రతిబింబిస్తుంది. అంతర్గత నియంత్రణలను బలోపేతం చేయడానికి, కస్టమర్ రక్షణ యంత్రాంగాలను మెరుగుపరచడానికి బ్యాంకులను ప్రోత్సహిస్తుంది. ఈ చర్యలు ఇతర బ్యాంకులకు హెచ్చరికగా కూడా పనిచేస్తాయని కొందరు భావిస్తున్నారు. ఆర్‌బిఐ ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ లావాదేవీల్లో కస్టమర్ ప్రొటెక్షన్‌కు సంబంధించిన అంశాలు, కరెంట్ అకౌంట్ మార్గదర్శకాలకు కట్టుబడి ఉండాలని, వాటిని పాటించడంలో లోపాలను నివారించాలని కోరుతున్నారు.




## వాట్సప్ బాట్‌లో ప్రీమియం చెల్లింపు: ఎల్‌ఐసి

**ముంబై, మే 10:** పాలసీదారులు సులభంగా ప్రీమియం చెల్లించేందుకు వీలుగా సరికొత్త సదుపాయాన్ని తీసుకొచ్చినట్లు లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) తెలిపింది. ఇందుకోసం ప్రత్యేకంగా వాట్సప్ నంబరు 8976862090 కేటాయించినట్లు పేర్కొంది. ఎల్ఐసీ పోర్టల్‌లో నమోదు చేసుకున్న పాలసీదారులు, ఈ నంబరుకు సందేశం పంపించడం ద్వారా పాలసీదారులు ఎక్కడి నుంచైనా, ఎప్పుడైనా ప్రీమియం చెల్లించేందుకు ఇది సౌకర్యంగా ఉంటుదన్నారు. దాదాపు 2.2 కోట్ల మంది ఎల్ఐసీ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. ఆన్‌లైన్ సేవల కోసం రోజుకు 3 లక్షల మందికి పైగా పాలసీదారులు పోర్టల్‌ను సందర్శిస్తుంటారని తెలిపారు. ఎల్ఐసీ కేటాయించిన వాట్సప్ నంబరుకు హాయ్ అని సందేశం పంపించాలి. ఆ తర్వాత తెరపై పలు రకాల ఆప్షన్లు కనిపిస్తాయి. ఇందులో మీకు కావాల్సింది ఎంపిక చేసుకుని, తదుపరి సూచనల ప్రకారం కొనసాగొచ్చు. తమ పాలసీలకు చెల్లించాల్సిన ప్రీమియం వివరాలు తెలుసుకునేందుకు వీలవుతుంది. నేరుగా యూపీఐ, నెట్ బ్యాంకింగ్, కార్డుల ద్వారా వాట్సప్ బాట్‌లోనే చెల్లింపులు పూర్తి చేయొచ్చు. పాలసీలకు చెల్లించా ల్సిన ప్రీమియం నుంచి, చెల్లించిన తర్వాత రశీదు కూడా ఈ వాట్సప్ బాట్‌లోనే లభిస్తుందని ఎల్ఐసీ సీఈఓ, ఎండీ సిద్ధార్థ మొహంతి తెలి పారు.

भारतीय जीवन बीमा निगम
LIFE INSURANCE CORPORATION OF INDIA


## సిఐఎల్, ఎఎం గ్రీన్ భాగస్వామ్యం

**ముంబై, మే 10:** దీర్ఘకాలిక పునరుత్పాదక ఇంధన సరఫరా కోసం కోల్ ఇండియా లిమిటెడ్ (సిఐఎల్), ఎఎం గ్రీన్ ఒప్పందం (ఎంఒయు) కుర్చుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం సిఐఎల్ సోలార్, పవన శక్తి ద్వారా ఎఎం గ్రీన్ ఉత్పత్తి చేయబోతున్న గ్రీన్ అమోమనియా సౌకర్యాలకు 4,500 మెగావాట్ల కార్బన్ రహిత శక్తిని సరఫరా చేయనున్నారు. ఈ మేరకు ఇటీవల జరిగిన ఒప్పందంపై సిఐఎల్ జిఎం సుదర్శన్ బోరా, ఎఎం గ్రీన్ బిజిఎస్ డెవలప్‌మెంట్ సీనియన్ వైస్ ప్రెసిడెంట్ శతన్వ అగర్వాల్ ఇరు సంస్థల ఉన్నతాధికారుల సమక్షంలో సంతకాలు చేశారు. దేశవ్యాప్తంగా భారీ పునరుత్పాదక ఇంధన విస్తరణ జరపాలని యోచిస్తున్నారు. అందులో భాగంగా గుజరాత్, రాజస్థాన్‌ల్లో సోలార్ పవర్ కెపాసిటీని 2,500 మెగావాట్ల నుంచి 3వేల మెగావాట్ల వరకు పెంచాలని నిర్ణయించారు. 1500 మెగావాట్ల పవన విద్యుత్ సామర్థ్యాన్ని 2వేల మెగావాట్లకు విస్తరించాలని చూస్తున్నారు. ఇందుకోసం దక్షిణ భారతదేశంలో అనువైన స్థలాలను అన్వేషిస్తున్నారు. ఈ మేరకు పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు రూ.25వేల కోట్లు ఖర్చు చేయాలని ప్రతిపాదించారు. ఎఎం గ్రీన్ ఈ పునరుత్పాదక శక్తిని పంప్డ్ హైడ్రో స్టోరేజీతో అనుసంధానిస్తున్నట్లు పేర్కొంది. కంపెనీఉత్పత్తి సౌకర్యాలకు స్థిరమైన గ్రీన్ ఎనర్జీ సరఫరాను ఇది నిర్ధారిస్తుంది. గ్రీన్‌కో గ్రూప్ ప్రమోటర్లు స్థాపించిన ఎఎం గ్రీన్ 2030 నాటికి యేటా 5 మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియాను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది ఒక ఎంటిపిఏ గ్రీన్ హైడ్రోజన్‌కు సమానం. ఇది నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌లక్ష్యంలో 20శాతంగా ఉండడం విశేషం. ఈ సందర్భంగా సిఐఎల్ సుస్థిరమైన ఎనర్జీని సరఫరా చేసేందుకు కట్టుబడి ఉందని సంస్థ ఛైర్మన్ పిఎం ప్రసాద్ తెలిపారు. భారత దేశ ఇంధన తయారీలో బొగ్గు కీలక భాగంగా ఉన్నప్పటికీ, సిఐఎల్ గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ఈ మేరకు కంపెనీ చురుకుగా పనిచేస్తోందని పేర్కొన్నారు. గ్రీన్‌కో అండ్ ఎఎం గ్రీన్ వ్యవస్థాపకులు అనిల్ చలమలశెట్టి ఈ ప్రాజెక్టుపై విశ్వాసం వ్యక్తం చేస్తూ గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, ఇతర గ్రీన్ మాలిక్యూల్స్ తయారీలో గణనీయంగా ఖర్చు తగ్గించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.



## భారత్-పాక్ ఉద్రికత్తలు..ఐటి ఉద్యోగులకు వర్క్‌ఫ్రం హోం

**ఇస్లామాబాద్, మే 10:** పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్‌చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్‌తో పాకిస్థాన్ కయ్యానికి కాలు దువ్వింది. సరిహద్దు ప్రాంతాల్లో దాడులు చేస్తూ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. దీంతో ప్రస్తుతం రెండు దేశాల మధ్య ఉద్రికత్త పరిస్థితులు తారాస్థాయికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో దేశీయ ఐటి సంస్థలు మళ్లీ వర్క్ ఫ్రమ్ హోమ్ బాటపట్టాయి. ఉద్యోగుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఢిల్లీ, ఛండీగఢ్, జైపూర్, అహ్మదాబాద్, నోయిడా, గురుగావ్ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు ఇంటి నుంచి పనిచేసే వెసులుబాటు కల్పించాయి. టెక్‌మహీంద్రా, హెచ్‌సిఎల్ టెక్నాలజీ, కెపిఎంజి, డెలాయిట్ సహా ఇతర ఐటి, కన్సల్టింగ్ సంస్థలు ఈ మేరకు వర్క్ ఫ్రమ్‌హోమ్ సదుపాయం కల్పించాయి. అలాగే అత్యవసరం కాని ప్రయాణాలపై విరమించుకోవాలని, సరిహద్దు రాష్ట్రాల్లోని ఉద్యోగులను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాని సూచిస్తున్నాయి. పరిస్థితులు చక్కబడే వరకు జాగ్రత్తగా ఉండాలని తెలిపాయి. అంతే కాకుండా ప్రస్తుత దేశ పరిస్థితులపై సోషల్ మీడియా కామెంట్లు, చేయొద్దనీ, క్లైయింట్స్ సంభాషణల్లోనూ ప్రస్తావించొద్దని తమ ఉద్యోగు లను పలు సంస్థలు కోరాయి. కాగాభారత్-పాక్ యుద్ధ నేపథ్యంలో పంజాబ్, హర్యాణా, రాజస్థాన్, ఢిల్లీ, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, బీహార్‌లలో ఇప్పటికే ఎమర్జెన్సీ ప్రోటోకాల్ విధించిన విషయం విదితమే.




## ఇస్లామాబాద్‌లో పెట్రోల్ బంకులు క్లోజ్..

**న్యూఢిల్లీ, మే 10:** భారత వైమానిక దాడులతో ఉక్కిరిబిక్కిరి అవుతోన్న పాక్‌కు మరో సంక్షోభం వచ్చి పడింది. భారత్ దాడితో కుదేలవుతున్న పాక్‌ను ఇప్పుడు చమురు కొరతవేధిస్తోంది. ఇస్లామాబాద్ రాజధాని టెరిటరీ అడ్మినిస్ట్రేషన్ రాజధాని నగరంలోని అన్ని పెట్రోల్, డీజిల్ ఫిల్లింగ్ స్టేషన్లను రాబోయే 48 గంటల పాటు పూర్తిగా మూసివేయాలని తక్షణ ఉత్తర్వు జారీ చేసింది. శనివారం ఉదయం 6 గంటల నుంచి 48 గంటల పాటు ఇస్లామాబాద్‌లోని అన్ని పెట్రోల్ బంకులను మూసివేస్తున్నట్టుగా అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. అయితే, పెట్రోల్ బంకులు మూసివేయడానికి గల కారణాలు ఏంటనే విషయంపై స్పష్టమైన వివరాలు మాత్రం తెలిసి రాలేదు. కాగా, పాక్ లోని 4 ఎయిర్‌బేస్ లపై భారత్ దాడి చేసింది. దీంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రతర మయ్యాయి.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14